సంపుటి: 39
సంచిక: 1

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

ఆగస్టు, 1984

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-191

[ఫలితాలు]

జూన్ '84 నెల "అపరాధ పరిశోధన పోటీ — 191"కి సరియైన సమాధానాలు:

1. రాకేష్.
2. ఆఫ్ఘనిస్తాన్.
3. మోటారుకారు.
4. చలనచిత్ర పరిశ్రమ.
5. రామారావు అదిక్.

పై జవాబుల ప్రకారం ఒకే ఒక్కరు ఆల్ కరెక్టుగా వ్రాశారు. వీరికి సెప్టెంబరు '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి పొందిన విజేత :

శ్రీమతి పున్నమరాజు ఇందిర,
C/O పి. వెంకటరావు,
4-6-21, తరవాణీ పేట,
మండపేట - 533 308,
ఆలమూరు తాలూకా,
(తూ. గో. జిల్లా)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

3. నలుగురు శత్రువులు—ఎమ్. సత్యవతి

25. వ్యామోహం—ప్రతాప రవిశంకర్

36. దొంగలు - దొంగలు—చంద్రశేఖర అజాద్

49. దొంగ సాక్ష్యం—శ్యాంబాబు

79. యమదూతలు—ఎమ్. వి. వి. సత్యనారాయణ

100. భైరవి—కె. వి. రమణ

117. రెండు శవాలు—బొమ్మిడి అచ్చారావు

132. విస్కీలో విషం—'విపంచి'

148. 25 జతల కళ్ళు—ఓరుగంటి పద్మావతి

161. కొరడా దెబ్బ—సరసి

170. కాంచన శిఖరం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. అంధకారంలో అడుగుల చప్పుడు
—చంద్రశేఖర అజాద్

41. తిరస్కారం—బి. రాజేశ్వరి

75. ఎర్ర ఫైలు—ప్రతాప రవిశంకర్

118. లక్షకో హత్య—టెంపోరావ్

158. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

నలుగురు శత్రువులు

ఎమ్. సత్యవతి

కాంతారావు టాక్సీ దిగి రాయబార కార్యాలయం ముందుకు నడిచాడు. సెక్యూరిటీ గార్డ్స్ అతడి ఐడెంటిటీ తనిఖీ చేశారు.

కాంతారావు వాళ్ళని నవ్వుతూ చూచి, "పదేళ్లుగా ఇదే

కార్యాలయంలోనికి నేను వెళ్తున్నాను. పదేళ్ళుగా యిదే కార్యాలయం ముందు మీరుంటున్నారు. మన జీవితాల్లో మార్పు లేదుకదూ!" అన్నాడు.

సెక్యూరిటీ గార్డ్సులో మొదటి వ్యక్తి గంభీరంగా చూచి, "ఇది మన కర్తవ్య బాధ్యత" అన్నాడు.

కాంతారావు నవ్వుకున్నాడు. ఈ సంభాషణ కూడా కోడ్ సంభాషణ. తాను రాయబార కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. శనిస్థాన్ దేశంలోని భారతదేశ రాయబార కార్యాలయం యిది. కార్యాలయంలో అటెండర్ లగాయితూ రాయబారి వరకూ భారతీయులే వుంటారని వేరే చెప్పుకోనక్కరలేదు.

కాంతారావు లిఫ్ట్ ఎక్కి లోపలకు నడిచాడు. మూడంతస్తుల విశాలమైన భవనం. ప్రతి గదిలోనూ టెలివిజన్ ఏర్పాటు వుంది. అన్నింటినీ కలుపుతూ రిమోట్ కంట్రోల్ రూం వుంది. కాంతారావు ఆ గదిలోకి నడిచాడు. రిమోట్ కంట్రోల్ ఆన్ చేశాడు. ఆ గదిలో కూడా వున్న టెలివిజన్ తెరలమీద దృశ్యాలు కనబడుతున్నాయి.

రాయబార కార్యాలయం భవనం, దాన్ని కలుపుతూ రోడ్లూ, కార్యాలయంలోని గదులూ వాటిని వేరువేరు కోణాల్లో చూపుతున్నాయి. టెలివిజన్ కార్యాలయం వుద్యోగులూ, వుద్యోగినులూ వాహనాల్లోంచి దిగి కార్యాలయంలోకి ప్రవేశిస్తున్నారు.

కాంతారావు ఆ గదిలోవున్న కిటికీలకు తెరలు లాగి వెలుతురు పడేలా చూశాడు. తరువాత అంతస్తులోని మిగతా పనులు చూసుకుంటున్నాడు.

ఎక్కడో మెషీన్ గన్స్ గర్జించాయి. కార్యాలయం భవనం గోడలు దద్దరిల్లాయి. ఎవరో అరుస్తున్నారు.

మెషీన్ గన్స్ మరల గర్జించాయి. అరుపులు ఆగి పోయాయి.

కాంతారావు చకచక టెలివిజన్ ముందుకు పరుగెత్తాడు.

పోర్టికోలో సెక్యూరిటీ గార్డ్స్ యిద్దరూ నేలమీద పడివున్నారు. వాళ్ళచుట్టూ రక్తం మడుగు కడుతోంది. పోర్టికోలో పెద్దసైజు వ్యాన్ ఆగివుంది. వ్యాన్‌లో యెవరూ లేరు.

కాంతారావు గదిలోంచి బయటపడి రిమోట్ కంట్రోల్ గదిలోకి నడిచాడు. రాయబార కార్యాలయం గదులలో ముగ్గురు మగవాళ్ళూ, ఒక ఆడదీ మెషీన్ గన్స్‌తో పరుగులు తీస్తున్నారు. కార్యాలయం సిబ్బందిని మెయిన్ హాలులో చేర్చుతున్నారు. సిబ్బంది కళ్ళు భయంతో మెషీన్ గన్స్ గొట్టాలను చూస్తున్నాయి.

మెయిన్ హాలులో ఆడా మగా చేరారు. చేతులు మడిచి నెత్తిమీద వుంచుకున్నారు. నల్లగా తుంగమొద్దులా వున్న వాడు వాళ్ళను మెషీన్‌గన్‌తో కవర్ నస్తున్నాడు. ఆడది మెషీన్‌గన్‌తో సిబ్బందిని మెయిన్‌హాలులోకి నెట్టుతోంది. ఆమెను నిమిషంపాటు పరిశీలించి ఆడదేనని నిశ్చయించుకున్నాడు కాంతాలావు.

ఆమె టైట్‌పాంట్లో స్లాక్ జొనిపింది. రెండూ రంగు వెలసి బూడిదకొట్టుకుపోయివున్నాయి. ఆమె మొహం పలకల మొహం. చెక్కిళ్ళు బలమైన ఎముకలు పొడుచుకు వచ్చినట్టున్నాయి. మొద్దుపెదిమలూ, మెడలో వ్రేలాడే మెషిన్‌గన్ ఆమె ఆడతనానికి ప్రశ్నార్ధకంగా వున్నాయి.

కాంతారావు నివ్వెరబోయి నిలుచుండిపోయాడు. చటుక్కున వ్రేళ్ళతో వాల్యూమ్ అని రాసి వున్న నాబ్

త్రిప్పాడు.

"వూ౯! క్విక్...." అంటోంది ఆడది వచ్చీరాని ఇంగ్లీషులో.

తుంగముద్దులాగా వున్నవాడు, "అందరూ వచ్చి నట్టేనా?" అన్నాడు.

"పై అంతస్తు .... క్రిష్టోఫర్‌ను పంపు...." అంది ఆడది.

ఒక్కపల్చటి వ్యక్తి టెలివిజన్ తెరమీదకు వచ్చాడు "రిమోట్ కంట్రోల్‌కి వెళ్ళనా?" అన్నాడు.

"వెళ్ళు క్రిష్టోఫర్!" అన్నాడు తుంగముద్దు.

క్రిష్టోఫర్ ఉడతలాగా గదిలోంచి గెంతాడు.

కాంతారావు ప్రమాదం గుర్తించాడు. కార్యాలయం మొత్తం శత్రువుల స్వాధీనంలో వుంది. తనొక్కడే స్వతంత్రుడు. రిమోట్‌కంట్రోల్ ప్రక్కనే అలారం స్విచ్ వుంది. దాన్ని ఒత్తితే నగరంలో వున్న పోలీస్ కార్యాలయాల్లో, రక్షణశాఖ కార్యాలయాల్లో ఒకేసారి అలారం మోగే ఏర్పాటు చేసింది శనిస్థాన్ ప్రభుత్వం.

కాంతారావు శక్తి కూడదీసి అటు పరిగెత్తాడు. అలారం స్విచ్ అందుకోబోయాడు. అతడి చెయ్యి గాల్లోనే ఆగింది. కాంతారావు ప్రక్కకు చూశాడు. లావుగా ఎర్రగా కంద దుంపలాగా వున్న వ్యక్తి! అతడికి పల్చగా మాసిన గడ్డం కూడా వుంది.

"ఇడియట్!" అన్నాడు కందదుంప. అంటూనే కాంతారావును గడ్డం క్రింద కొట్టాడు. ఫట్‌మంది. కాంతారావు పక్కకు పడ్డాడు. పడుతూనే కాళ్ళతో కందదుంపను మోకాళ్ళమీద తన్నాడు.

కందదుంప మొదలు నరికిన చెట్టులాగా కూలబడ్డాడు.

కాంతారావు ప్రక్కకు దొర్లి లేవబోయాడు. కందదుంప అతడికంటె ముందే మొగ్గవేసి లేచి నిలబడ్డాడు. కాంతారావును మొహంమీద తన్నబోయాడు. కాంతారావు అతడి పాదం పట్టుకుని మెలితిప్పాడు.

కందదుంప కెవ్వుమని అరిచాడు. కాంతారావు కనికరించలేదు. కందదుంప కాలిమడమ మెలితిరిగి ఫటక్ మంది. కందదుంప కింద కూలబడి గిలగిల కొట్టుకుంటున్నాడు. కాంతారావు రెట్టించిన వుత్సాహంతో అలారం స్విచ్ మీద చెయ్యి వుంచాడు.

తృప్తిగా వెనక్కి తిరిగాడు.

క్రిష్టోఫర్ అతడిని తీక్షణంగా చూస్తున్నాడు. అతడి కాళ్ళవద్ద కందదుంప యింకా మూలుగుతున్నాడు.

"కమాన్... మెయిన్ హాలులోకి పదరా....రాస్కెల్!" అరిచాడు క్రిష్టోఫర్.

2

రామానుజం తల దువ్వుకుంటున్నాడు. అలమారలోంచి పాకెట్ ట్రాన్సిస్టర్ వార్తలు వినిపిస్తోంది. రామానుజం విజిల్ వేస్తున్నాడు. వార్తలు అతడి తలలోకి ప్రవేశించటం లేదు.

దువ్వెన అద్దంముందు వుంచి వెనక్కి తిరిగాడు. ట్రాన్సిస్టర్ గొంతు నొక్కాలని అలమారలోకి చెయ్యి చాపాడు.

"ఇప్పుడే అందిన వార్త" అంటున్నాడు వార్తలు చదివే వుద్యోగి.

రామానుజం చెయ్యి నాబ్‌మీద ఆగింది.

"శనిస్థాన్ దేశంలో మన రాయబార కార్యాలయంలో నలుగురు దుండగులు ప్రవేశించారు. భారతదేశం అణు

రంగంలో పరిశోధనలు మానుకోవాలనీ. అలా ఒప్పందం రాసి ఇవ్వకపోతే కార్యాలయ సిబ్బందిని చంపేస్తామని దుండగులు బెదిరించారు. ప్రస్తుతం కార్యాలయం దుండగుల స్వాధీనంలో వుంది. పోలీసువర్గాలూ, రక్షణశాఖా మన కార్యాలయం చుట్టూ పహరావుంది. మరోగంటలో మరింత సమాచారం వస్తుందని ఆశిస్తున్నాం. ప్రతిగంటకూ ప్రత్యేక వార్తాప్రసారంలో మీరు వివరాలు వినవచ్చును. మన ప్రధాని యీ విషయంలో తన దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ.........."

రామానుజం చెవిలో యిక ఏ వార్తా ప్రవేశించడం లేదు. అతడి మెదడు పొరల్లోంచి ఉత్సాహం యిగిరిపోయింది. దాని స్థానంలో అన్నయ్య నిండిపోయాడు.

అన్నయ్య చాలకాలం నుండి శనిస్థాన్‌లో వుండిపోయాడు. అక్కడ నుండే తనకు కావలసిన డబ్బు పంపిస్తున్నాడు. ఒకటి రెండు రోజులలో తన పరీక్షాఫలితాలు తెలుస్తాయి. శనిస్థాన్ వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఈలోగా ఈ దుర్ఘటన జరిగింది. తాను ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నాడు.

దుండగులు అన్నయ్యకు అపకారం చేయరు కదా!

రామానుజం నిట్టూర్చాడు. అన్నయ్యతోబాటు యితర వుద్యోగులు చాలామంది వున్నారు. వాళ్ళకు కూడా ప్రమాదం పొంచి వుంది.

గంట తర్వాత ట్రాన్సిస్టర్‌లోకి ఆసక్తిగా చూశాడు రామానుజం.

"ఆకాశవాణి ప్రత్యేక వార్తాప్రసారం. శనిస్థాన్ దేశంలోని మన రాయబార కార్యాలయంలో ప్రవేశించిన దుండగులు కాంతారావు అనే వుద్యోగిని కాల్చి చంపారు. భారత

దేశం అణురంగంలో పరిశోధనలు ఆపుతామని రాతమూల కంగా మాట యివ్వాలని దుండగులు పట్టుబడుతున్నారు. కార్యాలయం వుద్యోగులను గంటకు ఒకరిని చొప్పున చంపుతామని దుండగులు హెచ్చరించారు."

రామానుజం నిస్త్రాణగా కూలబడిపోయాడు.

అయిపోయింది. భయపడినంతా అయిపోయింది. అన్నయ్యను దుండుగులు పొట్టన పెట్టుకున్నారు. అన్నయ్యే చేసిన తప్పు ఏమీలేదు. ఎందుకిలా జరిగింది? తనకు అన్నయ్యే సమస్తమూ. అన్నయ్య లేని లోటును ఎవరయినా ఎలా పూడ్చగలరు?

భారత ప్రభుత్వం ఏం చేస్తుంది? అసలు భారతదేశం అణురంగంలోనే కాదు ఏ రంగంలోనైనా వైజ్ఞానికంగా ముందుకు వెళ్తానంటే ఎవరికి అభ్యంతరం?

రామానుజం యివేమీ ఆలోచించలేదు. అసలు అతడి మస్తిష్కం యీ ఆలోచనకు లభించే సమాధానాలను జీర్ణం చేసుకునే దశలో లేదు. అతడి మెదడులో ఒకటే ఆలోచన. శనిస్థాన్‌లో తను దుండగులను మట్టుపెట్టాలి. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలు పోయినా ఫరవాలేదు. తన అన్నయ్యే పోగా లేనిది తాను వుండి ప్రయోజనం ఏమిటి?

రామానుజం పెట్టెవెతికి వాలెట్ తీశాడు. వాలెట్ తడిమి ఎయిర్ టికెట్, పాస్‌పోర్ట్ సరిచూసుకున్నాడు. పది నిమిషాల్లో ఎయిరిండియా ఆఫీసు ముందున్నాడు.

"ఏం కావాలి?" అన్నాడు ఎయరిండియా ఉద్యోగి.

"ఈ ఎయిర్ టికెట్‌తో ఎల్లుండి బయలుదేరే బోయింగ్‌లో 'పరాచి' వెళ్ళాలి. కాని నాకు ఈ రోజే పని పడింది. దయచేసి మార్పులు చేయగలరా?" అన్నాడు రామానుజం.

టికట్టునూ, పాస్‌పోర్టునూ పరిశీలించి ఎయిరిండియా వుద్యోగి నిట్టూర్చాడు.

"ఇక్కడి నుండి కలకత్తావరకూ వెళ్ళగలరు. అక్కడి నుండి ఫ్లైయిట్ మారుతుంది. వాళ్ళు బోయింగ్‌లోకి అనుమతించరనుకుంటాను" అన్నాడు.

రామానుజం నిరుత్సాహపడలేదు.

"కలకత్తావరకూ వెళ్ళనివ్వండి. అక్కడ ప్రయత్నించుకుంటాను" అన్నాడు.

3

కందదుంపలాగా మిలమిలలాడుతున్న అతడిని చూచి, "ఎందుకలా చూస్తావు అబ్దుల్? మనం రాయబార కార్యాలయంలోంచి బయటపడటమే అప్పుడు మంచిది తెలుసా?" అన్నాడు విల్సన్.

విల్సన్ నల్లగా తుమ్మమొద్దులా వున్నాడు. అతడి మొహంలో అధికారం దర్పంగా హొయలు చిలుకుతోంది.

క్రిష్టోఫర్ యిద్దరినీ చిరాకుగా చూచి, "మీ యిద్దరూ మొహాలు చూసుకోవడం కాకపోతే రాయబార కార్యాలయంలోంచి ఎందుకు పారిపొమ్మని చెప్పారో నాకు తెలియాలి. భారతదేశం యిక మన షరతుకు ఒప్పేసుకుంటోందని అనుకుంటున్నాం. మెషీన్‌గన్స్ ప్రేల్చుకుంటూ పోవాలనీ, నలుగురు భారతీయులను అడ్డం పెట్టుకుని వ్యాన్‌లో పారిపోవాలనీ, తరువాత వాళ్ళను ఖనిస్థాన్ పార్లమెంట్ వీధిలో వదిలిపెట్టాలనీ మీరిద్దరూ నిర్ణయించారు. లిల్లీకి కూడా మీ నిర్ణయంలో అంతరార్థం తెలియలేదట" అన్నాడు.

లిల్లీ మగాడిలాగా కుర్చీలో కాలుంచి విలాసంగా నిలబడి, సిగరెట్టు పీల్చుతోంది. బిగుతుగా వున్న పాంట్లోంచి

ఎముకల గూడులాగా ఒంగింది ఆమె శరీరం.

ఆమె సిగరెట్ నుసిరాల్చి, "విల్సన్! మనం ప్రయత్నంలో ఎక్కడయినా తప్పటడుగు వేశామా?" అంది.

విల్సన్ ముగ్గురినీ మార్చి మార్చి చూసి, "అబ్దుల్‌కి కాలు దెబ్బతిన్నది. అతడిని ప్రక్కగదిలోకి మార్చాం. అతడి కాలికి పట్టీవేశాం గదా! తరువాత క్రిష్టోఫర్ బయటికి తీసుకువెళ్ళి నిలబెట్టిన కాంతారావును కాల్చి చంపాడు. నేను స్పృహలేని అబ్దుల్‌కి స్పృహ తెప్పించాను. అప్పుడే గది తలుపు తెరుచుకుని సుప్రీమ్ వచ్చారు" అన్నాడు.

"సుప్రీమ్ వచ్చారా? రాయబార కార్యాలయంలోకి?" అంది లిల్లీ.

"అవును. సుప్రీమ్!"

"ఎలా సాధ్యం? బయట సెక్యూరిటీ గార్డ్స్ వుంటారు. సుప్రీమ్ ఆ భవనంలోకి వాళ్ళకు తెలియకుండా రావడానికి సాధ్యపడదు."

"అబ్దుల్! నువ్వు సుప్రీమ్ శక్తి సామర్థ్యాలనే శంకిస్తున్నావు. ఆయన సర్వసమర్థుడు. ఆయన మార్గం ఆయనకి ఎప్పుడూ వుంటుంది."

"ఆయనను శంకించడంలేదు. ఆల్ రైట్! ఆయనేమన్నారు?"

"రాయబార కార్యాలయంలో మన దాడికి భారతదేశం సుప్రీమ్‌నే అనుమానించే పరిస్థితి ఎదురయిందట. అందుకే ఆయన మనను కార్యాలయంలోంచి బయటపడమన్నారు."

"ఈ పని పూర్తయివుంటే మనకి ఒప్పందం సొమ్ము ముట్టివుండేది. మనకి ఎటూ కాకుండా అయిపోయింది."

"అవును. అందుకు నేనూ బాధపడుతున్నాను. మనకి తరువాతి కార్యక్రమం వుంది. భారతదేశం మన షరతుకు

ఒప్పుకుని తీరాలి!"

"ఏమో! మనం ఎంతకాలం యిక్కడ చేతులు ముడుచుకు కూర్చోవాలి?"

"కంగారుపడవద్దు. ఈ పని విజయవంతంగా ముగిస్తే మనకి ఎంత లాభమో సుప్రీమ్‌కూ అంతే లాభం! ఆయన మరల కబురు చేసేవరకూ మనం రహస్యజీవనం సాగించాలి అంతే?"

ప్రక్కగదిలోంచి ఆపరేటర్ పరుగెత్తుకు వచ్చాడు.

"వైర్‌లెస్ సెట్టులోంచి సందేశం వస్తోంది!" అన్నాడు ఆపరేటర్.

విల్సన్ అటుపరుగెత్తాడు. నల్లటి తుమ్మమొద్దు నిలువునా గిరికీలు కొడుతున్నట్టుగా పరుగెత్తాడు.

"సార్! జీరో...." సెట్టులోంచి వినిపించింది.

"జీరో....ఏమిటి?" అడిగాడు విల్సన్.

"భారత రాయబార కార్యాలయం వద్ద ఒక భారతీయ యువకుడు తచ్చాడుతున్నాడు."

"ఎవరతడు?"

"పేరు రామానుజం. ఇంపీరియల్ హోటల్‌లో దిగాడు."

"అతడు గూఢచారా?"

"కాదు. యూనివర్శిటీ నుండి ఇప్పుడే బయటపడినట్టు ఫ్రెష్‌గా వున్నాడు"

"ఏ పనిమీద వచ్చాడు?"

"విహారయాత్రకు. కాని అది నిజం అయివుండదు సార్. నిజం అయివుంటే అతడికి దర్శించడానికి రాయబార కార్యాలయం ఒక్కటే వుందా?"

"ఆల్‌రైట్! క్రిష్టోఫర్‌ను పంపిస్తున్నాను. నువ్వు అక్కడేవుండు. రామానుజం విషయం అతడు చూసు

కుంటాడు.

"అలాగే సర్!"

"మెసేజ్ ....ఓవర్ ...."

"ఓవర్ సర్!" అవతల నిశ్శబ్దం.

విల్సన్ తిరిగి తన అనుచరుల వద్దకు వచ్చాడు.

"క్రిష్టోఫర్! వేషం మార్చుకో. ఇంపీరియల్‌లో రామానుజం అనే భారతీయ యువకుడు దిగాడు. అతడిని వెంటాడి యిక్కడికి తీసుకురా!" అన్నాడు విల్సన్.

4

రామానుజం టాక్సీ ఆపించి గార్డ్స్ ముందుకు నడిచాడు. సైనిక రక్షణతో వున్న ఆస్పత్రి భవనం విలాసంగా వుంది. శనిస్థాన్ దేశంలో ప్రతి కార్యాలయానికీ ప్రతి ప్రభుత్వ భవనానికీ సైనిక రక్షణ వుంటుంది. రామానుజం తన గుర్తింపు పత్రం చూపించాడు.

"ఏం కావాలి?" అడిగాడు గార్డ్.

"ఆసుపత్రి చీఫ్‌గారిని కలుసుకోవాలి" అన్నాడు రామానుజం.

"ఏం పని?"

"మా అన్నయ్య కాంతారావును రాయబార కార్యాలయం ముందు కాల్చి చంపారు. మా అన్నయ్యను చూడాలని వచ్చాను."

"దేశాల మధ్య అంతరంగిక వ్యవహారం ఇది. మీరు ఎవరయినా సరే శవాన్ని చూపించరు."

"అతడు మా అన్నయ్య. అంతరంగిక వ్యవహారాలను మించిన అనురాగబంధం మాది!"

"వాదించకండి. మిలటరీ జనరల్‌గారిని అనుమతి అడగండి. అంతవరకూ ఆసుపత్రిలోకి కూడా వెళ్ళనివ్వం."

రామానుజం నిట్టూర్చాడు. సైనిక బలంతో దేశాలు నడుస్తుంటే అక్కడి పరిస్థితులు ఇంతకంటె బాగా ఎలా వుంటాయి? రక్తసంబంధాల కంటె అధికార వ్యామోహం, అధికార ప్రదర్శనం హెచ్చు.

రామానుజం సైనిక ప్రధానాధికారిని సంప్రదించాలని చూశాడు. కాని ఇంటర్వ్యూ దొరకలేదు. టాక్సీలో ఇంపీరియల్ హోటల్ చేరుకున్నాడు టాక్సీలోంచి పోర్టికోలోకి దిగబోతూ పైకి చూశాడు. మూడో అంతస్తులో ఒక మూల గది తనది. అద్దాల తలుపులు మిలమిలలాడుతున్నాయి. అద్దాల వెనుక తెరలు గాలికి వూగుతున్నాయి.

రామానుజం మెడమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తెరలు ఎందుకు వూగుతున్నాయి? అద్దాల రెక్కలు తెరిస్తే తప్ప. ఫాన్ తిరుగుతూంటే తప్ప. గదికి అటుప్రక్క రెక్కను తెరుచుకుని వుండాలి. లేదా ఫాన్ తిరుగుతూండి వుండాలి.

రామానుజం కౌంటర్‌లోకి చూశాడు. తన గది నెంబర్ తాళంచెవి అక్కడ వ్రేలాడుతోంది. తెరలు కదలడం కేవలం తన భ్రమేమో! తాళం చెవితో పై అంతస్తు చేరుకున్నాడు రామానుజం.

గది తలుపు తాళం వేసినట్టే వుంది. తాళంపట్టె రంధ్రంలో చెవి వుంచి క్లిక్ మనిపించాడు రామానుజం.

సన్నగా ఫాన్ హోరు వినిపిస్తోంది. హోరు క్రమంగా ఆగిపోయింది. రామానుజం అంచనా వేసుకున్నాడు. తాను గదిముందు చేరుకుంటునప్పుడే ఫాన్ స్విచ్ ఆపివుంటారు.

తలుపు మెల్లగా జరిపి ముందుకు లాగి తర్వాత విసురుగా తలుపుతోబాటు లోపలికి వెళ్ళిపోయాడు.

అవతలప్రక్క ఎవరో దబ్బున పడి కెవ్వున అరిచారు.

రామానుజం కాలు నిలదొక్కుకుని తలుపును అలాగే నొక్కిపట్టి వుంచాడు. అతడికి ముప్ఫయ్యేళ్ళుంటాయి. మనిషి క్రూరంగా వున్నాడు. గోధుమరంగు ఫాంటులోకి నల్లచారలచొక్కా టక్ చేశాడు. చిన్న పిల్లిగడ్డం, కన్ను సైజుకు నల్ల కళ్ళద్దాల బంగారు ఫ్రేమూ అతడికి మరింత క్రూరమైన వ్యక్తిత్వం వున్నట్టు చెబుతున్నాయి.

చేతులు మడతబడి, కాళ్ళు మెలికపడి అస్తవ్యస్తంగా తలుపుకీ, గోడకూ మధ్య నలుగుతున్నాడు.

తలుపును నొక్కిపట్టివుంచే నడవాలోకి చూశాడు. నడవా రెండు వైపులా కవిపించే మూలగది కావడంతో ఎటుప్రక్క ఎవరు వచ్చినా కనిపిస్తుంది. నడవాలో ఎవరూ లేరు.

"ఎవరు నువ్వు?" అడిగాడు రామానుజం.

అతడు మాట్లాడలేదు.

రామానుజం అటు తిరిగి అతడి మొహంమీద యీడ్చి తన్నాడు. చెక్కిలి ఎముక ఫట్‌మంది. రామానుజం ఆగ లేదు. కాలు నొప్పిపుట్టేవరకూ తన్నుతూనేవున్నాడు. తలుపు మూశాడు.

అతడికి స్పృహ తప్పింది. మొహం మీద ఎక్కడ పడితే అక్కడ చర్మం పగిలి మొహం రక్తంతో లక్క పిడతలాగా అయింది. అతడిని ప్రక్కకు యీడ్చి కాళ్ళూ చేతులూ బంధించాడు. తరువాత అతడి జేబులు వెతికాడు. పాంటు జేబులో పర్స్‌వుంది. పర్స్‌లోంచి శనిస్థాన్ కరె న్సీతోబాటు చిన్న కాగితం బయటపడింది.

కాగితంలో—క్రిష్టోఫర్ డిసౌజా,

14, మాస్కలేన్,

పరాచీ-174 అనివుంది.

రామానుజం నిట్టూర్చాడు. క్రిష్టోఫర్ ఇతడే అయి వుండాలి. ఇతడు తన గదిలోకి ఎందుకు ప్రవేశించాడు?

శనిస్థాన్ ప్రభుత్వం తరపున మాత్రం ఇతడు అక్రమ ప్రవేశం చేయలేదు. అంతవరకూ ఖాయం. ప్రభుత్వమే అయివుంటే రాజమార్గంలో తనను బంధించి న్యాయ స్థానంలో ప్రవేశపెట్టేవాళ్ళు.

రామానుజం కళ్ళు పెద్దవయ్యాయి. తాను రాయబార కార్యాలయం వద్ద చాలాసేపు తచ్చాడాడు. తనను ఒక వ్యక్తి కనిపెడుతూ అటుతిరిగి చిన్నదైన వైర్‌లెస్ పెట్టెలో మాట్లాడాడు. రాయబార కార్యాలయంలో జరిగిన హత్యా కాండకూ, వైర్‌లెస్ సెట్టులో మాట్లాడిన వాడికీ, తన గదిలోకి ప్రవేశించిన వాడికీ సంబంధం వుండివుండాలి.

గదికి తాళం పెట్టి హోటల్లోంచి బయటపడ్డాడు రామానుజం. టాక్సీ పట్టుకుని మాస్కో-లేన్‌లో దిగాడు. ఎపార్టుమెంట్ల నంబరు చూచుకుంటూ 14 వ నెంబర్‌కి యివతల ఆగాడు.

ఎపార్టుమెంటులో ముసలతడు వున్నాడు 25-28 మధ్య వయస్సు వున్న స్త్రీ పనిపాటలు చేసుకుంటోంది.

రామానుజం వీధిలో పరకాయించి చూచి, ఎపార్టుమెంట్ ముందుకు నడిచాడు. జేబులోంచి పిస్తోలు తీసి ముసలతడికి గురిపెట్టాడు.

ముసలతడు భయంగా చేతులెత్తి, "ఏం కావాలి?" అన్నాడు.

"క్రిష్టోఫర్ ఎక్కడికి వెళ్ళాడు?" అడిగాడు రామానుజం.

"లిల్లీ యింటికి."

"అదెక్కడ?"

"పార్లమెంట్ వీధి చివర. ఆకుపచ్చ రంగు డాబా."

రామానుజం పళ్ళు గిట్ట కరచాడు. ముగ్గురు మగవాళ్ళూ, ఒక ఆడదీ కలసే రాయబార కార్యాలయంలో హత్యాకాండ జరిపారు. ఆడది అచ్చగా మగాడిలాగా వుంటుందనీ, ముగ్గురూ ఆమెతో కలసి మెలసి బతుకుతారని భారతీయ పత్రికలు రాశాయి. వాటిని శనిస్థాన్‌లో చూశాడు రామానుజం.

లిల్లీయింటి ముందు టాక్సీ దిగాడు రామానుజం. ఆ యింటికి తాళం పెట్టివుంది. ఇంటి ముందు వైర్‌లెస్ సెట్టు పట్టుకుని రాయబార కార్యాలయం ముందు తచ్చాడినవాడు కాచుకూర్చున్నాడు. రామానుజం అతడి కంట పడకుండా తిరిగి టాక్సీలో కూర్చున్నాడు.

ఇంపీరియల్ హోటల్ ముందు టాక్సీ దిగి గదిలోకి నడిచాడు. క్రిష్టోఫర్ పండుకునివున్న స్థితిలో మార్పు వచ్చింది. అతడి చేతులు కట్లు విడిపోయి వున్నాయి. కండ ఒరుసుకు చేతులు నల్లబడ్డాయి. ఒరుసుకుపోయిన చోట రక్తం గడ్డ కట్టివుంది.

అతడి మొహాన్ని పైకెత్తాడు రామానుజం.

తల వాలిపోయింది. నోట్లోంచి చొంగకారి అట్టకట్టింది. క్రిష్టోఫర్‌లో ప్రాణంలేదు.

5

విల్సన్ చిందులు తొక్కాడు.

"క్రిష్టోఫర్ పొటాషియం సైనెడ్ కాప్స్యూల్ మింగి ప్రాణం తీసుకున్నాడు. అతడిని రామానుజం ఎలా పట్టుకోగలిగాడు? నాన్సెన్స్! అతడిని తక్కువగా అంచనా వేసి వుపేక్షించాం. రామానుజం ఎక్కడికి పారిపోయాడు? శని

స్థాన్‌లో రక్షణబలం ఏం చేస్తోంది? మనలో ఒకడు ఆత్మ హత్య చేసుకుని చావవలసిన అవసరం రామానుజం కల్పించాడు. క్రిష్టోఫర్ మొహం పచ్చడి పచ్చడిగా తన్ని వదలిపెట్టాడు రామానుజం!" వగర్చాడు విల్సన్.

లిల్లీ గదిలోంచి అక్కడికి వచ్చింది. ఆమె మొహం కోపంతో ఎర్రబడివుంది. పల్చటి చెక్కిళ్ళకు రంగుపూసినట్టుంది మొహం.

"వాడు మా ఇంటికి వచ్చాడట. నా గురించి ఆరా తీశాడట" అన్నదామె.

"మీ యింటికా?" అబ్దుల్ కోపంతో వూగిపోయాడు. అసలే కందదుంపలాగా వుంటాడేమో కోపంతో అతడి శరీరం మరింత కందిపోయింది.

విల్సన్ హుంకరించి, "అబ్దుల్! నువ్వు కూడా మారు వేషంలో వెళ్ళు. వాడు పరాచీ వదలివెళ్ళడు. అసలు రామానుజం యెవడు? ఈ దేశం ఎందుకు వచ్చాడు? ఈ విషయాలు సుప్రీమ్‌ని అడగాలి" అన్నాడు.

లిల్లీవైపు చూశాడు అబ్దుల్.

"ఏం ఇద్దరూ వెళ్తారా!" అరిచాడు విల్సన్.

"విల్సన్! అరవక! పనయ్యే మార్గం చూడు" అన్నాడు అబ్దుల్.

"అంటే?"

"రామబార కార్యాలయంలో మనం ముగించుకోవలసిన పని గురించి చూడు. మనం క్రిష్టోఫర్‌లాంటి నమ్మకస్తుడిని మరొకడిని చూచుకుని యీ దేశంలోంచి జెండా ఎత్తెయ్యాలి!"

"నాదో ఐడియా! మనకి వైర్‌లెస్ మెసేజ్ పంపేవాడిని మనం ఎంచుకుంటేనో...." అంది లిల్లీ.

"గుడ్ లిల్లీ!" ఆమె భుజంమీద తట్టాడు అబ్దుల్. "అతడి పర్సనాలిటీ కూడా భారీగా వుంటుంది. మంచి ఫైటర్!"

"అలాగే చూసుకుందాం! మీ యిద్దరూ వెళ్ళిరండి. వాడిని ప్రాణాలతో పట్టుకురండి!" అన్నాడు విల్సన్.

లిల్లీ, అబ్దుల్ చెయ్యీ చెయ్యీ పట్టుకుని ప్రక్క గదిలోకి వెళ్ళారు. అక్కడ వేషాలు మార్చుకుని యింటి వెనుకదారి ద్వారా యింట్లోంచి బయటపడ్డారు.

"ముందు మా యింటికి వెళ్దాం" అంది లిల్లీ.

అబ్దుల్ తల వూపాడు.

పావుగంటలో ఇద్దరూ లిల్లీ తండ్రి ముందున్నారు.

"రామానుజం ఎలా వున్నాడనా? మామూలుగా చామన ఛాయలో వున్నాడు. అయిదున్నరడుగుల ఎత్తుంటాడు. అంత లావూకాదు, అంత సన్నమూ కాదు. గచ్చకాయ రంగు పాంటులో తెల్లచొక్కా జొనిపాడు" అన్నాడు లిల్లీ తండ్రి.

"అతడు సరిగ్గా ఈ ఇంటికే ఎందుకొచ్చినట్టు? ఎలా వచ్చినట్టు?" అబ్దుల్ అన్నాడు, "క్రిష్టోఫర్ వద్ద ఈ ఇంటి అడ్రసు దొరికివుంటుంది. వాడు నీకు పేయింగ్ గెస్ట్ అవడంకాదు కాని రామానుజానికి యీ యింటి అడ్రసు తెలిసిపోయింది."

"అయితే ఏం అబ్దుల్? ఎన్నడూ లేనిది నువ్వు పిరికి కబుర్లు చెబుతావేం?" అంది లిల్లీ.

అబ్దుల్ పల్చటి గడ్డం తడుము కుంటూ, "భయపడటం లేదు లిల్లీ! మనం ఇక్కడ నుండి మన దేశానికి బిచాణా ఎత్తెయాలి కదా! క్రిష్టోఫర్ శవం ప్రభుత్వం పరమయి పోయింది. వాడినిబట్టి మన ఆచూకీ దొరకవచ్చు కదా!"

అన్నాడు.

"దొరకదనుకుంటాను. విల్సన్ ఆ విషయంలో ప్రత్యేక మైన ఏర్పాట్లు చేసినట్టున్నాడు."

"రామానుజం ఇంపీరియల్ వదలిపెట్టి ఎక్కడ బస చేశాడో తెలియాలి. పద...." లేచాడు అబ్దుల్.

6

రామానుజం పరుగుతీస్తున్నాడు. నిర్జనంగావున్న రోడ్ల మీద ఒంటరివాడిలాగా పరుగులెత్తుతున్నాడు. అతడికి మారూ నూటయాభై గజాల దూరంలో బూట్ల చప్పుడు వినిపిస్తోంది. లైట్ల వెలుగు చీకటిని పారదోలలేకపోతోంది. పరుగు ఆపి రామానుజం పోస్ట్‌బాక్స్ చాటున ఆగి చూశాడు. దూరంగా చీకట్లోంచి రెండు ఆకారాలు పరుగెత్తుకు వస్తున్నాయి.

రామానుజం బలంగా శ్వాసపీల్చి అలసట తీర్చుకుంటు న్నాడు. తనను వెంటాడుతున్న వాళ్ళలో ఒక పురుషుడూ ఒక స్త్రీ వున్నారు. తను రహస్యంగా దిగిన కాంటి నెంటల్ హోటల్ వాళ్ళకు ఎలా తెలిసిందో అర్థం కావటం లేదు.

రానురాను పరుగెత్తుకువస్తోన్న వాళ్ళు దగ్గరవు తున్నారు.

రామానుజం జేబులోంచి పిస్తోలూ, కత్తీ తీసి చెరోచేత్తో పట్టుకున్నాడు. అతడిని వెంటాడుతున్న, స్త్రీ పురుషుడూ పోస్ట్‌బాక్సును దాటి ముందుకు పరుగెత్తారు.

రామానుజం గురిచూచి పిస్తోలు పేల్చాడు. స్త్రీ తన కాలు పట్టుని నిలబడిపోయింది. పురుషుడు ఆగి, వెనక్కి చూచి పిస్తోలు ప్రేల్చాడు.

పోస్టుబాక్సు ఖణేల్‌మంది. రామానుజం చేతిలోని పిస్తోలు మరల ప్రేలింది.

"అబ్బా!" అన్నాడు పురుషుడు. మరుక్షణంలో రోడ్డు మీద ఖణేల్‌మని చప్పుడయింది. రామానుజం ముందుకు పరుగెత్తాడు. పిస్తోలుతో యిద్దరినీ కవర్‌చేశాడు. ఆ పరిసరాలలో జనసంచారంలేదు.

స్త్రీకి కాలిపిక్కకూ, పురుషుడికి చేతికీ గాయాలయాయి. బుల్లెట్లు యింకా శరీరాల్లోనే ఇరుక్కునివున్నాయి. ఇద్దరూ కూలబడి మూలుగుతున్నారు.

"నీ పేరు ఏమిటి? నన్ను ఎందుకు వెంటాడావు?" అడిగాడు రామానుజం.

పురుషుడు మాట్లాడలేదు.

రామానుజం అతడిని యీడ్చిపెట్టి కొట్టాడు. దంతాల చిగుళ్ళు కదిలి అతడి నోట్లో ఉప్పంగా తగిలింది.

"నన్ను కొట్టక! తర్వాత అనుభవిస్తావు" అన్నాడు బంధితుడు.

"నువ్వు బతికివుంటే...." రామానుజం స్త్రీ వైపు చూచి, "నువ్వెవరు? నీ పేరేమిటి?" అన్నాడు.

ఆమె కోపంగా చూచి పళ్ళు పటపటలాడించింది.

"రాయబార కార్యాయంలో దుర్మార్గంగా భారతీయులను చంపింది మీరేకదూ! క్రిష్టోఫర్ చచ్చాడని గుర్తించి మీరు నా వెంటపడ్డారు. రాయబార కార్యాలయం సంఘటనలో మగాడిలాంటి ఆడది కూడా ముడిపడి వున్నట్టు పత్రికలు రాశాయి. ఆ ఆడదానివి నువ్వే!" అన్నాడు రామానుజం.

తరువాత అతడు కత్తితీసి వాళ్ళముందు నిలబడ్డాడు.

"అబ్దుల్! నువ్వు వెర్రివెధవలాగా యితడిని కేవలం పరుగుతో వెంబడించాలన్నావు. వెంబడించాం. ఏమయింది? యితడు పోస్టుబాక్సు వెనుక దాక్కుండి మనలను పట్టుకున్నాడు."

"లిల్లీ! నాకు బుర్ర పనిచేయడంలేదు. కొంతసేపు వూరుకుంటావా?"

రామానుజం తనలో తాను నవ్వుకున్నాడు. ఆరితేరిన దుండగులు అవకాశం కలిసివచ్చి తన చేతిలో చిక్కిపోయారు. వాళ్ళకు మతులు స్థిమితం తప్పాయి. నాలుగో వ్యక్తి, ముఖ్యమైన కథానాయకుడూ ఈ మగవాడయి వుండడు. అతడు తాను సురక్షిత స్థానంలో వుండి తన అనుచరుడిని పంపించి వుంటాడు.

"రాయబార కార్యాలయంలో మా అన్నయ్య కాంతారావును ఎందుకు చంపారు? భారతదేశం అణురంగంలో తన పరిశోధనలు కొనసాగిస్తే ఎవరికి నష్టం?" అడిగాడు రామానుజం, కత్తి వాళ్ళ కళ్ళముందు ఆడిస్తూ.

అబ్దుల్ కానీ, లిల్లీ కానీ మాట్లాడలేదు. కత్తి ఎత్తి వాళ్ళ మొహాల వద్దకు తీసుకువచ్చాడు రామానుజం.

లిల్లీ తుపుక్కున వుమ్మింది. రామానుజం మొహం మీదకు వుమ్మి తుళ్ళింది. రామానుజం విసురుగా కత్తిని యిద్దరి చెక్కిళ్ళలో గుచ్చాడు. రక్తం చివ్వున చిమ్మింది. వాళ్ళ కేకలు ఆ ప్రదేశంలో దద్దరిల్లాయి.

లిల్లీ చెక్కిళ్ళ మీదనుండి కన్నీళ్ళు రక్తం కలిసి ధారగా కారుతున్నాయి. అబ్దుల్ తలత్రిప్పి చూశాడు. రామానుజం కత్తిని మళ్ళీ లేపాడు.

"వద్దు....వద్దు....ఆపు!" అరిచాడు అబ్దుల్.

7

విల్సన్ తాగుతున్నాడు. టీపాయ్‌మీద ఖాళీసీసాలు బోసిగా నవ్వుతున్నాయి. విల్సన్ తాగుతూ తాగుతూ మధ్యలో నవ్వుతున్నాడు. నవ్వు ఆపి వెక్కి వెక్కి ఏడ్చాడు.

షుమారుగా నాలుగు గంటలయింది. లిల్లీ, అబ్దుల్ కలిసి వెళ్ళి యింతవరకూ తిరిగిరాలేదు. అబ్దుల్ ఎక్కడికి వెళ్ళినా గంట గంటకూ తానెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ ఫోన్ చేస్తాడు. లిల్లీ అయితే ఇంతసేపు ఎక్కడా ఆగదు. రామానుజం ఈసారి కూడా గెలిచాడా?

విల్సన్‌కి ఒళ్ళు జలదరించింది. నిండు సీసా ఎందు కుని ఎ తిపట్టి గటగటా తాగాడు. సీసా ఖాళీ అయింది.

ఖాళీసీసా గోడలలోంచి మనిషి ఆకారం కనిపిస్తోంది. విల్సన్ ఉలిక్కిపడి సీసాను అడ్డం తప్పించాడు.

గదిలో అతడు నిలబడి వున్నాడు. అతడి చేతిలో నల్లటి వస్తువు మిలమిలలాడుతోంది.

"ఎవరు నువ్వు?" అరిచాడు విల్సన్.

"రామానుజం" అన్నాడతను.

విల్సన్ తల విదిలించాడు.

రామానుజం పిస్తోలు ఎత్తాడు. "మా అన్నయ్యను క్రిష్టోఫర్ కాల్చి చంపాడు. ఇదంతా నీ కుట్రవల్లనే జరిగింది. భారత రాయబార కార్యాలయంలో మీ ముఠా జరిపిన కుట్రకు ప్రతీకారంగా నీ అనుచరులు ముగ్గురునీ పై లోకానికి పంపాను. ఇక మిగిలింది నువ్వు...." అన్నాడు ట్రిగ్గర్ లాగి.

విల్సన్ మాట్లాడబోయాడు. కాని మాట్లాడలేక పోయాడు. బుల్లెట్ సూటిగా అతడి గుండెలో దిగ బడింది. □

ప్రతాప రవిశంకర్

వ్యామోహం



కోమల—

కోమలమైనది. అంతేకాదు. అందమైనది. ఆమె అందం చూస్తే పరవశం కలుగుతోంది.

కోమలకు నెలకు అయిదువందలకుపైగా సంపాదించి

పెట్టే వుద్యోగం వుంది. ప్రేమగా చూసుకునే భర్త వున్నాడు.

రెండు నెలల క్రితం ఖాళీగావున్న ఆ ఎదురు పోర్షన్ లోకి వచ్చారు వాళ్ళు. కోమల భర్త రాజారావు మెడికల్ రిప్రజెంటేటివ్. అతను క్యాంపుకు వెళ్ళాడంటే వారం రోజుల వరకూ తిరిగిరాడు. ఆ వారం రోజులూ కోమల— రాజారావు స్థానాన్ని నాకు ఇస్తే ఎంత బావుంటుందని అని పిస్తూవుంటుంది.

కాని నా కోరిక తీరేదేనా?

నేనొక నిరుద్యోగిని. గాఢాంధకారంతో నిండివున్న ఓ చిన్న గదిలో అజ్ఞాతవాసం గడుపుతున్న యువకుడిని. నెలకు అతికష్టం మీద మా మామయ్య నాకు మూడొందల రూపాయలు పంపుతాడు. ఆ మూడొందలతో ఆ సిటీలో నేను జీవనాన్ని యెంత హీనంగా గడుపుతున్నానో అర్థం చేసుకోండి.

కిటికీ దగ్గర కూర్చుని ఆమెనే ఎప్పుడూ అంటే ఆమె ఇంట్లో వున్నంతసేపూ గమనించటం నాకో ఉద్యోగం ఐపోయింది. ఈ విషయం మా మామయ్యకు తెలిసిందంటే ఆయన నాకు ఒక్క రూపాయ కూడ పంపించడు. ఆయన నాకు ఆ మూడొందలూ వూరికే పంపించటం లేదు. నాకు ఏదైనా ఉద్యోగం వచ్చిన వెంటనే ఆయన కూతురు సౌందర్యను పెళ్ళి చేసుకోవాలి కట్నం లేకుండా. దాని పేరు సౌందర్య. కాని అది హిడింబిలా వుంటుంది.

ఆ రాత్రి నేను నా గదికి చేసేసరికి పది గంటలు దాటు తోంది. నా గది తలుపులు మూస్తున్నప్పుడు కోమల ఇంటి ముందుకు ఎవరో ఓ మనిషి వచ్చి ఆగిపోయాడు.

తలుపులు మూసి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాను

చీకట్లో.

అతను చిన్నగా తలుపుమీద చప్పుడు చేశాడు. రెండు నిముషాలు గడిచిన తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా కోమల నిలబడివుంది.

అతడిని చూసి "ఇంత ఆలస్యమయ్యిందేమిటి?" అన్నది.

అతను చిన్నగా ఏదో అన్నాడు-లోపలకు వెళుతూ.

వెంటనే తలుపులు మూసుకున్నాయి.

నా గుండె కొట్టుకోవటం ఒక్క-క్షణం ఆగిపోయినట్లని పించింది.

కోమల సామాన్యమైన ఆడది కాదు.

ఈ నిజం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

అతడిని ఇంత ఆలస్యమయ్యిందేమిటి? అని అడిగిందంటే అతను వస్తాడని ఆమెకు ముందే తెలుసన్నమాట. ఆమె అతడికోసం ఎదురు చూస్తోంది.

ఓహ్ కోమలా....రాజారావును క్యాంపుకి పంపించి నువ్వాడుతున్న నాటకం ఇదా?

వాళ్ళిద్దరూ లోపల స్వర్గం అంచుల్లో విహారాలు చేస్తూ వుంటారని తల్చుకుంటే నాకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఏదో ఆరాటం....నేను కూడా ఏదో చెయ్యాలి. ఎలాగైనా కోమలి అందాన్ని అనుభవించాలి.

ఎలాగైనా సరే.

అందుకు నేనేం చెయ్యాలి?

2

తెల్లవారింది.

నేను నిద్రలేచేసరికి కోమల స్నానంచేసి కిటికీ దగ్గర నిల్చుని తల దువ్వుకుంటోంది. అప్రయత్నంగానే నన్ను

చూపింది. ఐతే నేను ఎప్పటిలా ఆమె అలా చూడగానే ముడుచుకుపోలేదు.

ధైర్యంగా నవ్వాను.

కోమల నా చొరవకు ఆశ్చర్యపోయింది.

నిముషం తర్వాత ఆమె నా చూపునించి పక్కకు తప్పుకున్నది.

ఆమె విషయంలో నేను ఏం చెయ్యదల్చుకున్నానో రాత్రే నిర్ణయించుకున్నాను. నేను అనుకున్న విధంగా చేస్తే కోమల తప్పకుండా నాకూ ఓ అవకాశాన్ని ఇస్తుందనుకుంటాను.

అందుకు ఒకటే మార్గం.

బ్లాక్ మెయిల్.

ఐతే ముందుగానే నేను అంతదూరం వెళ్ళదల్చుకోలేదు. ఆమె దొంగచాటు వ్యవహారాన్ని నేను తెలుసుకున్నట్టుగా పరోక్షంగా ఆమెకు తెలియజేస్తాను. కోమల తెలుసుకుని తనకు తానుగా నాకు ఆ అవకాశాన్ని కల్పిస్తుందేమో ముందుగా తెలుసుకోవాలనుకున్నాను.

రాత్రి పది గంటలు కావస్తుండగా అతను వచ్చాడు.

ఓ గంట గడిచింది.

గదిలో వెలుగుతున్న దీపాన్ని తీసేశాను.

తలుపులు దగ్గరకు మూసి రోడ్డుదాటి కోమల యింటి ముందుకు వెళ్ళి నిల్చున్నాను. ఆ రోడ్డు తొమ్మిది గంటలు దాటిందంటే నిర్మానుష్యంగా వుంటుంది.

ఒక్కసారి అటూ ఇటూ చూసి తలుపుమీద చిన్నగా చప్పుడు చేశాను.

ఒక్క నిముషం గడిచింది.

లోపల్నుంచి గుసగుసలు వినిపించాయి.

నవ్వుకున్నాను.

కోమల తలుపులు కొడుతున్నది తన భర్త ఐవుండొ చ్చని భయపడుతూ వుంటుంది.

ఇంకో నిముషం గడిచింది.

మళ్ళీ చప్పుడు చేశాను.

"ఎవరు?" కోమల అడిగింది.

"తలుపులు తియ్యండి."

రెండు నిముషాలు గడిచాయి.

తలుపు తెరుచుకున్నాయి.

ఎదురుగా కోమల—ఆమె జుట్టు రేగిపోయివుంది. బొట్టు చెరిగిపోయి వుంది. ఎలా వుండాలో అలాగే వుంది.

"నువ్వా!" అన్నది ఆశ్చర్యంగా.

"అవును. నా గదిలోకి తేలు వచ్చింది. చంపుదామను కున్నాను. ఇంతలోనే కరెంటు ఫెయిలయ్యింది నాగదిలో. అందుకే ఇలాంటి సమయంలో మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్య వలసి వచ్చింది. ప్లీజ్....మీ దగ్గర టార్చ్‌లైటు వుంటే ఓసారి ఇస్తారా? తేలును వెతకాలి" అన్నాను.

కోమల వెంటనే మాట్లాడలేదు.

ఒక్క క్షణంలో అక్కడినించి వెళ్ళి మరుక్షణంలో టార్చిలైటు తీసుకొచ్చి ఇస్తూ "ఇప్పుడే ఇవ్వొద్దు. రేపు ఇవ్వు" అన్నది.

"థాంక్ యూ....సారీ ....మంచి టైములో డిస్టర్బ్ చేశాను" అని నవ్వి అక్కడినించి వెనక్కు వచ్చేశాను.

తలుపులు మూసుకున్నాయి.

ఆరాత్రి కూడా ఎప్పటికో నిద్రపోయాను.

నేను లేచేసరికి కోమల ఇంటికి తాళం పెట్టివుంది. అప్పుడు ఉదయం ఎనిమిదిన్నర కావస్తోంది.

ఆ సాయంత్రం ఆరుగంటలకు ఆమె ఇంటికి వచ్చింది. అప్పుడే వెళ్ళి ఆమె టార్చిలైటును ఇవ్వాలనుకున్నాను.

కాని—ఎవరో ఒకరు చూస్తూవుండగా ఆ ఇంట్లోకి వెళ్ళటం నాకు ఇష్టంలేదు. అందుకే రాత్రి తొమ్మిది గంటల వరకూ ఎదురుచూపి ఆ తర్వాత టార్చి తీసుకుని గబగబా వెళ్ళి కోమల ఇంటి తలుపు తట్టాను.

తలుపులు తెరుచుకోగానే ఆమె ఆహ్వానించకముందే నేను ఇంట్లోకి వెళ్ళాను.

నా ఉద్దేశం ఆమెకు అర్థమైవుండాలి—అందుకే ఆమె నన్నేమీ అనలేదు. తలుపులు మూసి "కూర్చో" అన్నది.

కుర్చీలో కూర్చున్నాను.

ఆమే అన్నది "రాత్రి నువ్వు నిజంగా టార్చ్‌కోసం రాలేదని నాకు తెలుసు. మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యాలని మా గురించి నువ్వు తెలుసుకున్నట్టు నాకు తెలియజెయ్యాలని వచ్చావు" అన్నది.

ఉలిక్కిపడ్డాను.

కోమల తెలివితేటలు నిజంగా సుపర్బ్.

"అవును. అందుకోసమే వచ్చాను" అన్నాను.

"నా గురించి నువ్వు తెలుసుకుంటే నాకు తెలియజెయ్యాలని ఎందుకు అనుకున్నావు? నేను నీకు భయపడాలనా?" అన్నది.

"భయపడాలని కాదు. నాకు నువ్వు కావాలి. నీ అందం నా మతిపోయేలా చేసింది. ఎలాగైనా నిన్ను పొందాలనుకున్నాను. ఇంతలోనే నీ బలహీనత ఏమిటో నాకు తెలిసింది. అప్పుడు నాకు ధైర్యం వచ్చింది."

"ఇంతకీ నువ్వనేదేమిటి? నీకు ఓసారి లొంగిపోవాలని అంటావు. అంతేకదూ?"

"రియల్లీ. నా కోరిక అదొక్కటే" అన్నాను ఉత్సాహంగా.

కోమల నవ్వింది.

"మీ మగాళ్ళంతా ఇంతే. ఆడదాని బలహీనత తెలిపిందంటే ఆమెను పొందేవరకూ నిద్రపోరు. ఆల్‌రైట్ నా రహస్యం నీకు తెలిసింది. అందువల్ల నేను నీకు లొంగక తప్పదు. ఐతే ఆ లొంగటం ఈ ఇంట్లో కాదు. రేపు ఉదయమే ఏదైనా లాడ్జిలో ఓ రూము నీ పేరుమీద బుక్ చెయ్యి. రాత్రి సరిగ్గా పదకొండు గంటలకు నువ్వు ఆ గదికి వచ్చెయ్యి. నేను కూడా వస్తాను. ఓ రెండు గంటలు నీతో గడుపుతాను" అన్నది.

నా సంతోషానికి అవధిలేదు. ఇంత సులభంగా అందమైన కోమల నా కోరిక తీర్చటానికి ఒప్పుకుంటుందని అనుకోలేదు.

"ఇందుకోసం లాడ్జిలో ఓ గది బుక్ చేసుకోవటం ఎందుకు? ఈ ఇంట్లో వచ్చిన యిబ్బందేమిటి?" అన్నాను.

"ఇక్కడ కుదరదు. ఈ రాత్రి పదకొండు గంటలకు ఆయన క్యాంపునించి తప్పక వస్తాడు. వారం వరకు ఇంట్లోనే వుంటాడు. ఐనా ఫర్వాలేదు. ఆయనకు ఏదో చెప్పి నీ దగ్గరకు వస్తాను. ఇదే ఇబ్బంది" అన్నది చిన్నగా.

"సరే. రేపు ఉదయమే ఓ లాడ్జిలో రూము బుక్‌చేసి నీకు ఆ విషయాన్ని తెలియబరుస్తాను" అన్నాను.

ఉత్సాహంగా బయటికొచ్చాను.

నాకు గాల్లో తేలిపోతున్నట్టు అనిపించింది.

నాలాంటి అదృష్టవంతుడిని నేనే అనిపించింది.

కోమల చెప్పినట్టుగానే రాత్రి పదకొండు గంటలు

దాటుతున్నప్పుడు ఆమె భర్త రాజారావు క్యాంపునించి తిరిగి వచ్చాడు.

3

రాత్రి సరిగ్గా పదకొండు గంటలకు ఆ లాడ్జి మెట్లెక్కి నేను బుక్ చేసిన రూము దగ్గరకు వెళ్ళాను.

తాళం తెరిచి లోపలకు వెళ్ళాను.

చీకటిగా వుంది.

స్విచ్ నొక్కాను.

లైటు వెలిగింది.

వెలుగులో కనిపించిన ఆ దృశ్యం చూసి కొయ్యబారి పోయాను.

బెడ్ మీద వెల్లకింతలా పడివున్నాడు కోమల భర్త రాజారావు. ఆయన గుండెల్లో పిడివరకూ కత్తి దిగివుంది. నెత్తురుతో ఆయన షర్టు తడిపి ఎర్రగా భయం గొలిపేలా వుంది,

వణికిపోయాను.

ఎవరీ హత్య చేసింది?

ఎవరో మెట్లెక్కి నడిచివస్తున్న చప్పుడు వినపడింది, పరుగుదీయాలనుకున్నాను.

వెనక్కి తిరిగాను.

బయటకు రాబోతున్నప్పుడు ఓ మనిషి నాకు యెదురు వచ్చాడు. అతను ఆ లాడ్జి మేనేజర్. అతను నన్ను చూడగానే "మీకు ఫోన్ కాల్ వచ్చింది" అంటూనే లోపలి దృశ్యం చూసి "బాబోయ్ హత్య" అని అరిచాడు పెద్దగా నన్ను పట్టుకుంటూ.

అతడ్ని విదిలించుకుని వెళ్ళబోయాను.

కాని కుదర్లేదు.

మేనేజర్ బలంగా వున్నాడు.

అతని కేకను విని మిగిలిన గదుల్లో మనుషులు తలుపులు తెరుచుకుని బయటకు వచ్చారు.

అంతా నిముషాల్లో జరిగిపోయింది.

ఎవరో పోలీసులకు ఫోన్ చేశారు.

నేనో ట్రాప్‌లో యిరికించబడ్డానని నాకు సులభంగా అప్పటికి అర్థమయ్యింది. కోమల—అతని ప్రియుడు కలిపి ఈ హత్య చేసివుండాలి.

పోలీసులు వచ్చారు.

రాజారావును హత్యచేసినందుకు నన్ను అరెస్టు చేశారు.

కోమల భర్త హత్యవార్త విని దారుణంగా శోకించింది. ఆ హత్య తప్పకుండా నేనే చేసి వుంటానని అన్నది. అందుకు ఓ కథ కూడా చెప్పింది.

రామారావు (అంటే నేను) రోజూ మా ఇంటికి వస్తూ వుండేవాడు. అతను మా ఆయనతో స్నేహం చేశాడు. ఒక రోజు ఆయన లేని సమయంలో ఇంటికి వచ్చి నా శీలాన్ని నాశనం చెయ్యబోయాడు. నేనెలాగో తప్పించుకుని ఆయన రాగానే ఈ విషయాన్ని చెప్పాను. ఆయన రామారావును పిలిచి బాగా తిట్టి కొట్టబోయారు. అప్పుడు రామారావు ఆయనకు క్షమాపణలు చెప్పుకుని, ఎప్పటిలాగే స్నేహంగా వుందామని అన్నాడు. స్నేహంగా వున్నట్టు నటిస్తూనే ఆయన్ని నమ్మకంగా తమ లాడ్జిలో తీసుకున్న రూముకు పిల్చి హత్య చేశాడు. లేకపోతే ఓ గదిలో వుంటున్న రామారావు ఆ వూళ్లోనే వున్న ఓ లాడ్జిలో రూము తీసుకోవలసిన అవసరం ఏమిటి."

ఈ కథను పోలీసులు నమ్మారు—కాదు—కోమల

తన నటనా చాతుర్యంతో పోలీసులను నమ్మించింది.

నేను చెప్పిన అసలు నిజాన్ని పోలీసులు నమ్మలేదు.

నన్ను వదల్లేదు.

జైల్లో వుండగా కోమల నన్ను కలుసుకుంది.

"సారీ. నీ కోరిక నిన్నీ స్థితికి తీసుకువస్తుందని నువ్వు వూహించివుండవు. ఇదంతా ప్లాను ప్రకారం జరిగి వుంటుందని నువ్వు ఇప్పటికి తెలుసుకునే వుంటావు. ఎలాగైనా నేను నా ప్రియుడు దయాకర్ కలిపి నా భర్త పీడ వదిలించుకోవాలనే ఆలోచనలో వున్నాము. ఇంతలోనే ఆ గదిలో నా వైపు ఆకలి చూపులు చూసే నిన్ను చూసిన తర్వాత మేమిద్దరం కలిపి ఓ ప్లాను వేశాము. సరిగ్గా అంతా ఆ ప్లాను ప్రకారమే జరిగింది.

నీ పేరున నువ్వు ఆ లాడ్జిలో తీసుకున్న గదిలోకి మాట్లాడాలని ఆయన్ని తీసుకువెళ్ళాము. అక్కడ దయాకర్ నేను ఆయన్ని హత్యచేశాము. మమ్మల్ని ఎవరూ గమనించకుండ జాగ్రత్త తీసుకున్నాం. పదకొండు గంటలకు నువ్వు రాగానే ఆ లాడ్జి మేనేజర్‌కు దయాకర్ ఫోన్ చేశాడు. నీ పేరు గదినెంబరు చెప్పి నిన్ను పిలవమని. ఎందుకంటే అతను నిన్ను—గదిలో వున్న శవాన్ని చూడాలని లాడ్జి ఎదురుగా వున్న టెలిఫోన్ బూత్‌లోనించి దయాకర్ ఫోన్ చేశాడు.

అప్పుడు కూడా మేము అనుకున్నట్టుగానే జరిగింది. నా మీది కోరికతో నువ్వు ఈ నేరంలో హంతకుడిగా ఇరుక్కుపోయావు. ఏమైనా ఆడదానిమీద అంత వ్యామోహం మంచిదికాదు రామారావ్" అన్నది నవ్వుతూ.

నేను కూడా పెద్దగా నవ్వుతూ జేబులోనించి పాకెట్ టేప్‌రికార్డర్ బయటకు తీస్తూ "ఈ నేరంలో హంతకుడిగా

ఇరుక్కుపోకుండా నువ్వే బయటకు లాగావు కోమలా.... థాంక్ యూ" అన్నాను.

ఆమె అదిరిపడింది.

సరిగ్గా అప్పుడే పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్యామ్ ఇద్దరు కానిస్టేబుళ్ళు అక్కడికి వచ్చారు.

ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ "కోమలా....ఇదంతా కూడా ఓ ప్లాన్ ప్రకారమే జరిగింది. ఎందుకో నువ్వు గొప్ప నాటకం ఆడుతున్నావని నాకు అనిపించింది. ఎంక్వయిరీ చేస్తే నీకూ దయాకర్‌కీ సంబంధం వుందని తెలిసింది. అందుకే నువ్వు నిన్న రామారావును కలుసుకోటానికి వస్తే కుదరదని ఈ రోజు రమ్మనీ చెప్పి ఈ ఏర్పాటు చేశాను. నువ్వు నీ గురించి రామారావుతో చెప్పటానికే అతన్ని కలుసుకుంటావని నేను వూహించాను" అన్నాడు.

కోమల తల దించుకున్నది.

ఇన్‌స్పెక్టర్ శ్యామ్ నా చేతిలోనించి ఆ టేప్‌రికార్డర్ అందుకున్నాడు.

నాకు విముక్తి లభించింది. అప్పుడే కోమలను కస్టడీలోకి తీసుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్‌కి 'థాంక్స్' చెప్పాను.

అతను నవ్వి "కోమల చెప్పిన మాటలు నిజం. ఆడదాని మీద అంత వ్యామోహం మంచిది కాదు. ఆ వ్యామోహం మగాళ్ళను ప్రమాదాల్లోకే ఈడ్చుకు వెళుతుంది" అన్నాడు కోమల ప్రియుడు దయాకర్‌ను అరెస్టు చెయ్యటానికి బయల్దేరుతూ.

అప్పుడే నాకు కోమల అందం ఓ విషనాగు అందం అని అనిపించింది. కోమల మీద సౌందర్య ఇప్పుడు ఎంతో సౌందర్యంగా కనిపించసాగింది నాకు. □

దొంగలు..దొంగలు...

—చంద్రశేఖర అజాద్

నగరమంతా గగ్గోలు పుట్టింది. ఊరి శివార్లలో బందిపోటు దొంగలు స్వైరవిహారం చేశారు. ఊరికి కొంచెం దూరంగా నిర్మించబడ్డ కాలనీలో మొత్తం ఆరు ఇళ్ళు కొల్లగొట్టబడ్డాయి.

అందులో విశేషం ఏముందనటానికి మరో సంఘటన

కూడా జరిగిపోయింది.

జనం బాగా వుండే చోట కూడా రెండు ఇళ్ళు దోచుకో బడ్డాయి. అక్కడ ఎదురుతిరిగిన వారిద్దరిని పొడిచేశారు. అందులో ఒకాయన పరిస్థితి ఆందోళనకరంగా వుంది. మొట్టమొదటిసారిగా ఆ ఊర్లో ఇంత భారీఎత్తున దోపిడి జరగటంతో ఎక్కడ చూసినా ఈ విషయం గురించే చర్చలు జరుగుతున్నాయి.

పత్రికలన్నీ ఈ విషయం గురించి ఫోటోలతోసహా ప్రచురిస్తూ పోలీసు డిపార్ట్‌మెంటు అసమర్థతను యెత్తి చూపాయి. ఈ దోపిడీలు రాష్ట్ర రాజధాని నుండి ఇతర ప్రాంతాలకు వ్యాపించటంపట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కట్టుదిట్టంగా వాటిని ఎదుర్కొనాలన్నాయి.

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణంచటంపట్ల ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశారు. దోపిడీ దొంగతనాల్ని అరి కట్టలేని ఈ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశాయి.

ప్రభుత్వం వారు కూడా ఓ ప్రకటన చేశారు. దోపిడి దొంగల్ని పట్టుకోవటానికి అన్ని ఏర్పాట్లు జరిగాయని, త్వరలోనే వారిని బంధించగలమంటూ శపథం చేశారు.

ఆ ఊర్లో బేంకులన్నింటికి "సేఫ్టీ లాకర్లు కలవు" అని బోర్డులు తగిలించుకోవటం తప్పించి పెద్ద వ్యాపారం లేదు. ఒకటో అరో బుక్ అయ్యేవి. ఈ దెబ్బతో ఒక్క సారి వాటికి డిమాండ్ పెరిగింది.

సుబ్బారావు చేతిలో పత్రిక లాక్కొని సుబ్బారావు భార్య దోపిడీ విశేషాలమేరకు చదివింది.

సుబ్బారావు మామూలు గుమాస్తా. అది కూడా ఓ ప్రైవేట్ కంపెనీలో. వాళ్ళేమో నెల రోజులు తోముకొని

మూడొందలు చేతిలో పెడతారు. సుబ్బారావు అద్దెకుండేది ఓ పెంకుటిల్లు. దానికి అరవై రూపాయలు అద్దె. నీటికీ, కరెంటుకూ కలిపి మరో పదిహేను రూపాయలు అవుతాయి.

సుబ్బారావు సామానంతా కట్టగడితే రెండు గోతాలు నిండుతాయి. అయినాసరే సుబ్బారావుకి కూడా ఆందోళనగా వుంది.

అప్పారావుగారింటి నుండి కబురు.

"పేపరు కావాలి."

సుబ్బారావు భార్య పేపరిచ్చింది. ఆ పేపరు అప్పారావు గారిది కాదు. వెంకట్రావుగారిది. ఉషోదయాన పేపర్ రావటంతో మొదలవుతుంది. సంచార కార్యక్రమం మొదలయి అందరిచేత చదివించుకొన్నాక, అందరూ ఆఫీసులకు వెళ్ళిపోయేక పన్నెండు గంటల ప్రాంతంలో ఆయనకు చేరుతుంది. వెంకట్రావుగారు రిటైర్ అయిపోయాడు కాబట్టి, ఆయన తీరిగ్గా ఈ మూల నుండి ఆ మూల దాకా చదువుకొంటుంటారు.

ఆ పేటలో వున్న వారందరి యిళ్ళలోనూ యిదే చర్చ ...

దొంగలు....దొంగలు....!

"వాళ్ళ చేతుల్లో పెద్ద పెద్ద గొడ్డళ్ళున్నాయట. ఇదివరకటి దొంగతానాలు వేరుగా వుండేవి. ఎవరైనా తాళాలు వేసుకొని ఊరికెళితేనో, సినిమాకు వెళితేనో ఈ లోపు తాళాలతోనో, పగలగొట్టో దొంగతనం చేయటం ఓ పద్ధతి. మరోరకం కన్నాలువేసి రావటం జరుగుతుండేది. ఇంకెన్నో దొంగతనాల్లో జనం నిద్రపోతుండేవారు. ఉదయంలేచి చూసుకుంటే వారి గుండెలు బ్రద్దలయిపోయేవి. ముఖ్యంగా

వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. జనం చల్లగాలికి ఆరుబయట ఆదమరచి నిద్రపోతుంటారు. ఈ లోపు ఈ కార్యక్రమం జరిగిపోతూంటుంది.

మరిప్పుడు కాలం మారిపోయింది కదా. అందుకని దొంగతనాలు కూడా మారిపోయాయి. ఎవడికి ఎప్పుడు డబ్బులు కావలసివస్తే అప్పుడు మొహానికి ముసుగేసుకొని ఓ గొడ్డలి చేత్తో పట్టుకొని పేళ్ళు పగలగొట్టినట్లు తలుపులు బ్రద్దలు చేయటం. కావల్సింది పట్టుకురావటం....ఎవడైనా ఎదురు తిరిగితే తలమీద మోదితే ఛస్తే ఛస్తాడు. బ్రతికితే బ్రతుకుతాడు. అలాగే నలుగురు కలిపి వెళ్ళి రోడ్డుకడ్డంగా రాళ్ళు పేర్చి బస్సుల్ని. లారీల్ని ఆపి దోచుకోవడం. ఇటీవల ఓ దొంగతనంలో తుపాకులు వాడారట.

కాబట్టి మనదేశం ముందుకు పోవటం లేదని ఎవడైనా అంటే వాడిది బుద్ధితక్కువ. అమెరికా స్టైల్ దాదాపు మనకూ వచ్చినట్లే. అయితే మనం ఇంకా ముందుకు పోవాలి. అక్కడ రాత్రికి రాత్రే పెద్ద వంతెనల్నే దొంగతనం చేసుకుపోతారట. ఉదయం లేచి చూస్తే "ఇక్కడేదో వుండాలే అని తల బ్రద్దలు కొట్టుకోవాలట."

సుబ్బారావు వ్యాఖ్యానానికి అప్పారావుగారు నవ్వారు.

"చోరకళా నైపుణ్యమండి" అన్నాడాయన.

"ఆఫీస్‌కు టైం అవుతుందండి" అంటూ బయలుదేరబోయాడు సుబ్బారావు.

"ఇంకో విషయం చూశారా, పట్టపగలు దొంగతనాలు జరిగిపోతున్నాయి. ఆ పేరూ ఈ పేరూ చెప్పి రావటం. నోట్లో గుడ్డలు కుక్కి దోచుకోవటం మొన్న ఇలాగే మా

ఊళ్ళో ఓ అమ్మాయి చచ్చిపోయింది సార్" అన్నాడు అప్పారావు.

"అరరే" నొచ్చుకున్నాడు సుబ్బారావు.

ఈ సారి అప్పారావుగారి క్లాసు మొదలయింది. ఆయన దేశంలో జరుగుతున్న పగటి దొంగతనాల్ని సమీక్షించటం ప్రారంభించాడు. పావుగంట గడిచాక "సాయంకాలం తొందరగా రండి" అంటూ సుబ్బారావు శెలవు తీసుకొన్నాడు. గబగబ నాలుగు మెతుకులు కొరికి, మరో నాలుగు ముద్దలు క్యారియర్‌లో పెట్టుకొని ఆఫీస్‌కెళ్ళాడు.

అప్పుడు పనులన్నీ పూర్తి చేసుకొని ఆడవాళ్ళంతా ఓ చోటుకి చేరారు. ముందు ఆ పేటతో మొదలయి తాలుకా, జిల్లా, రాష్ట్ర, దేశపరిధులు దాటి విశాల ప్రపంచంలో జరుగుతున్న దొంగతనాల్ని ఎవరికి తెలిసిన మేరకు వారు వివరించారు. ఆఖరుకు ఒకటి రెండు విషయాల మీద అందరికీ ఏకాభిప్రాయం కలిగిందని చెప్పవచ్చు.

"ఏవిటో వదినా. దేశమంతా నాశనమైపోయింది."

మరిదేకాలం. కలికాలం. అంతా నాశనం కావటానికే వచ్చింది. లేకపోతే ఇలాంటివెప్పుడన్నా విన్నామా? ఏకంగా కత్తులూ, కటార్లు పట్టుకొని జనం మీద పడిపోతుం టేనూ."

"మరి పోలీసులేం చేస్తున్నారు?"

"వాళ్ళేం చేస్తారు. వాళ్ళకు తెలీకపోతే కదా ఇవన్నీ. ఎవడి కర్మ ఎట్టా కాలుతుందో.... ప్రాణం పోకుంటే సాలు."

"అవును బతికుంటే బలుసాకు తినొచ్చు."

2

సుబ్బారావు భార్యకు చాలా దిగులుగా వుంది. ఆమె అంట్లు తోముతూ, పాచి ఊడుస్తూ పదిసార్లకు పైగా

ఉలిక్కిపడింది. ప్రక్కకు తిరిగి చూసి ఎవరూ లేరని గ్రహించాక గుండెల మీద చెయ్యి వేసుకుంది.

ఆమె అంత భయపడటానికి కారణం ఆమె మెడలోని మూడు సవర్ల బంగారపు గొలుసు. ఆమెకు సుబ్బారావు తరపున పెళ్ళిలో చేయించింది అది.

ఆ గొలుసుకు చాలా గండాలు గడిచాయి. ఎప్పుడు అవసరమయితే అప్పుడు ఆ గొలుసు బ్యాంకులో పెట్టి డబ్బు తెచ్చుకునేవారు. తిరిగి దానిని విడిపించటానికి చాలా కాలం పట్టేది. ఓ సారి ఆమెకు జబ్బు చేస్తే ఆ గొలుసు జాతీయ బ్యాంకుకెళ్ళింది. మరోసారి చిన్నవాడి కాన్పుకోసం వెంకాయమ్మగారింట్లోకి వెళ్ళింది.

ఓసారయితే అదమ్మి అప్పులు తీర్చాలని సుబ్బారావు పట్టుబట్టాడు. కానీ తాను మాత్రం ససేమిరా అంటూ కూర్చుంది. ఎలా అయితేనేం ఆ గండం తప్పింది.

పెళ్ళయిన ఈ పది సంవత్సరాల్లో రెండు సంవత్సరాలు మాత్రం తానా నగను ధరించగలిగింది. మిగతా రోజులన్నీ అక్కడక్కడ తిరగటమే సరిపోయింది. ఇప్పుడీ పరిస్థితుల్ని చూస్తుంటే ఇది నిలబడేట్లు లేదు. నెల రోజుల క్రితమే అగ్రికల్చరల్ బ్యాంకునుండి విడిపించుకొచ్చింది. ఇంకా దాంట్లో వుంచినా బాగుండేది అనుకొంది.

సాయంకాలం సుబ్బారావు వచ్చాడు స్నానంచేసి బయటకు వెళ్ళబోతుంటే "చీకటి పడుతుంటే యెక్కడికి వుండండి" అంది.

"అప్పారావుగారింటికేనే."

"రోజూ కొట్టుకొనే సుత్తేగా బాబూ. ఉండండి. నాకు భయంగా వుంది."

"సరే నువ్వు కొట్టు" అనుకుంటూ కూర్చున్నాడు.

"అనవసరంగా ఆ గొలుసు బ్యాంకు నుండి తెచ్చామేమో" అంది.

"అదేమిటే వడ్డీ పెరిగిపోతుంది కదా"

"వడ్డీయే కదా పెరిగిపోయేది. అసలుంటుంది కదా."

"ఇలా దొంగతనాలు జరుగుతాయని అనుకొన్నామా. అప్పుడంతా ప్రశాంతంగా వుంది. ఎలా అయితే ఏంలే.... ఇంకా అలానే వుంచితే దాని డబ్బుకు అది సరిపోయేది."

"ఏం చేద్దామంటారు?" అంది.

"ఏముంది చెయ్యటానికి. అసలు అన్నం వండావా?"

"వండానులెండి. మీ కెప్పుడూ ఆ ఆరాటం తప్పించి నా గురించి పట్టించుకోరు."

"ఏం చెయ్యమంటావు. నీ గొలుసు తీసుకెళ్ళి లాకర్లో పెట్టమంటావా....లాకర్లో వుండటానికి ఎంతవుతుందో తెలుసా?"

"ఏవిటండి ఆ అరుపులు. మెల్లగా మాట్లాడండి. ఎవరైనా వింటారు. అసలే రోజులు మంచివికాదు."

"ఒకటే మార్గం. మనింటి చుట్టూ పోలీసుల కాపలా పెట్టించాలి."

"మీకేం వేళాకోళాలు. పదేళ్ళయినా ఓ గొలుసు చేయించటం చేతకాలేదు. ఈ ఒక్కటీ తాకట్లకే సరిపోతుంది. పైగా ఎగతాళి."

సుబ్బారావు నవ్వాడు.

"అవునే మరి మీ నాన్న రెండులక్షలు పోస్తే బాగా సంపాదించేవాడు దొరికేవాడు. ఎంత చెట్టు కంతగాలి."

సుబ్బారావు భార్య మూతి వంకరలు తిరిగింది.

"అన్నం పెడవాతావా?" అన్నాడు సుబ్బారావు.

"అయ్యో దాని కాలిశ్యం యెందుకు కానియ్యండి"

అంది.

సుబ్బారావు భోంచేశాడు. టైం ఏడుగంటలు దాటింది. పిల్లలు కూడ ట్యూషన్ నుండి వచ్చేశారు. వాళ్ళు పడు కొన్నారు. సుబ్బారావుకు ఏదన్నా ఆలశ్యంగా వస్తే తప్పించి అందరూ ఎనిమిది గంటలకే నిద్రపోతారు.

ఈ రోజు పదిగంటలు దాటుతున్నా సుబ్బారావు భార్యతో పాటు సుబ్బారావుకు కూడా నిద్రపట్టలేదు. అతనూ ఆలో చిస్తున్నాడు. భార్యతో వేళాకోళానికి అంటున్నాడు గానీ అతని మనస్సు కూడా ఆందోళన పడుతోంది. మూడు సవర్ల గొలుసంటే నాలుగువేలదాకా వుంది. తమకున్న ఒకే ఒక ఆస్థి ఆ గొలుసు. ఆ ధీమాతోనే ఎప్పుడయినా అప్పు చేయగలుగుతున్నాడు. దొంగల కీ ఇబ్బందుల్తో పనే ముంది.

"ఏవండీ" పిలిచింది.

"ఏమిటి" భార్యవైపు తిరిగాడు.

"దొంగ లొస్తారంటారా?"

"రారులే"

"నాకు భయంగా వుందండి."

"నేనున్నాగా."

"ఈ గొలుసు దిండ్లో దాస్తానండి."

"దొంగలు ముందు చూసేది దిళ్ళనే."

"అయితే ఏం చేద్దామంటారు."

"నువ్వే ఆలోచించు."

"పోపుల డబ్బాలో దాస్తానండి."

"పిచ్చిమొహమా. ఆడవాళ్ళు డబ్బు దాచుకునేది అక్కడే. దొంగలు తెలివిమీరిపోయారు."

"అయితే ఏం చెయ్యమంటారు."

"ఏం చేసినా సరే. అసలు దొంగలు రావటం జరిగితే వాళ్ళు అన్నీ వెతుకుతారు. దొంగలంటే ఎవరు. మన లాంటి వారేకదా."

"ఛీ....వూరుకోండి" అందామె.

"నాకోటి అనిపిస్తుంది. తలుపులు తీసి పడుకుంటే బాగుండుననిపిస్తోంది."

"లేకపోతే వాళ్ళు రావటం, అనవసరంగా శ్రమపడి తలుపులు బద్దలు కొట్టడం ఇవన్నీ ఎందుకు. ఏకంగా వాళ్ళకి స్వాగతం చెబితే సరిపోతుంది. కనీసం తలుపులన్నా మిగులుతాయి. లేకుంటే వాటా లేసుకొని రోజుకొకరు తమ ఇంట్లో విస్తే సరి."

"మీరు భలే సలహాలిస్తారు."

"ఏం చేస్తాం మరి."

"అసలు మీకు ఏ వేళలో వేళాకోళం చెయ్యాలో తెలీదు."

"అవును మరి కొందరు ఏడవలేక నవ్వుతారు."

"సర్లెండి నాకు గొలుసుయోగం వుంటే వుంటుంది. లేకుంటే పోతుంది" అందామె దిగులుగా.

"నీకేం బాధలేదు. అంతగా అయితే మనింట్లో కూడా గొడ్డలుంది. మన గొలుసు ఎవడైనా తీసుకుపోతే, నేనూ బయలుదేరి ఎక్కడో చోట తెస్తానులే" అన్నాడు ప్రక్కకు తిరుగుతూ.

"మీకు అదీ చేతవును" గొణుక్కుంది ఆమె.

సుబ్బారావింక మాట్లాడలేదు. అలానే పడుకున్నాడు. సుబ్బారావు భార్య దీర్ఘంగా ఆలోచించింది. ఎక్కడ దాస్తే బాగుండుననుకొంది. ఆఖరకు ఆమెకో ఆలోచన తట్టింది. చిన్న బుట్టలో పాతబట్ట లుంచుతారు. అవి కూడా ఎక్కువ

లేవు. వాటి నడుమ దాస్తే ఎవరూ ఊహించరు. అదే మంచిది.

లేచివెళ్ళి గొలుసు బట్టలక్రింద పెట్టింది. అప్పుడామెకు తృప్తిగా వున్నట్లనిపించింది. సుబ్బారావు మీద చెయ్యివేసి కళ్ళు మూసుకుంది.

నిద్ర పట్టేసింది.

3

ప్రశాంతంగా తెల్లవారింది.

ఆమె గొలుసుకోసం బట్టలో చేతులు పెట్టింది. అప్పటికే అవి చిందర వందరగా వుండటం ఆమె గమనించనే లేదు. కంగారుగా బట్టలన్నీ తీసి బయటపెట్టింది. గొలుసు కనపడటంలేదు. ఆమెకు గుండాగినంత పనయింది. వేసిన తలుపులు వేసినట్లున్నాయి. మరెలా జరిగింది? ఎలా పోయింది గొలుసు? నిద్రపోతున్న సుబ్బారావును వెంటనే లేపేసింది.

"ఏమిటే" నిద్రకళ్ళతో అన్నాడు.

"గొలుసు కనిపించటంలేదు."

షాక్ కొట్టినట్లయింది. నిద్రమత్తు వదిలిపోయింది.

"ఎక్కడ పెట్టావు."

"పాతబట్టలో."

"ఏమయింది మరి."

"అదే తెలియటంలేదు" ఆమె కంఠంలో ఏడుపుజీర.

సుబ్బారావుకు చెమటలు పట్టాయి. తమ తలుపువంక చూశాడు. బాగానే వుంది. అయితే ఆ తలుపును బయట నుండి సన్నటి కట్టెతో తియ్యవచ్చు. చాలాసార్లు వేరే గడియ పెట్టించమని ఇంటి ఓనర్‌గార్కి చెప్పాడు. ఆయన చేస్తానంటున్నాడుగానీ అలానే వుంది.

"రాత్రి మీ మాటలు విని ఎవరో వచ్చివుంటాడు."

"ఛీ....నోర్మూయ్" అన్నాడు కోపంగా.

ఆమె కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి.

"నువ్వు పెట్టింది అక్కడేనా జ్ఞాపకం తెచ్చుకో" అన్నాడు.

"ఇక్కడేనండి" అంది. ఆమెతోపాటు సుబ్బారావు దిండ్లు, దుప్పట్లు, పాత సూట్ కేసు, అన్ని సామాన్లు వెతికారు.

సుబ్బారావు భార్య ఏడుస్తోంది.

ఆమెను చూసి సుబ్బారావుకు జాలి కలిగింది.

"పోతే పోయేందిలే ఏడవకు" అన్నాడు.

ఆమె సుబ్బారావు గుండెలమీద వాలిపోయింది.

"ఈ సంగతి ఎవరికి చెప్పకు" అన్నాడు.

ఆమె తలూపింది.

4

ఆమె వారం రోజులు దాకా సరిగ్గా భోజనం చెయ్య లేదు.

ఆమె మనసంతా గొలుసుమీదే వుండిపోయింది.

నిజంగా దొంగలొచ్చి తమల్ని కొట్టయినా ఆ గొలుసు తీసుకెళ్ళి వుంటే సంతృప్తిగా వుండేది. జనం అందరితో చెప్పుకొని సానుభూతి సంపాదించవచ్చు. ఇప్పుడెలా పోయిందో కూడా తెలియదు.

ఓ వేళ ఆయన తీసి దాచారా అనే అనుమానం వచ్చింది. లేకుంటే ఎవరికీ చెప్పవద్దని ఎందుకంటాడు? ఆయనేం చేసుకుంటాడు? త్రాగటం, పేకాటలాంటి దురలవాట్లేం లేవు కదా? వెంటనే మరో అనుమానం వచ్చింది.

బయట ఎవరితోనన్నా తిరగటంలేదు కదా! దానికేమైనా

ఇచ్చారేమో? ఏమో ఈ మగవాళ్ళంతా. అయినా అంతపని చేస్తాడా? ఎదుగుతున్న పిల్లల గురించి ఆలోచించడా అనుకొంది.

ఈ వారం రోజుల్లో మూడుచోట్ల పెద్ద దొంగతనాలు జరిగిపోయాయి. దాదాపు రెండు లక్షలు దోచుకుపోయారు.

"ఇది కూడా అలాగే పోయిందనుకుంటాను" అనుకొని సమాధానపడటం ప్రారంభించింది.

సుబ్బారావు అంతర్లీనంగా చాలా బాధపడ్డాడు.

నెల రోజుల తర్వాత వాకిట్లోనే స్వాగతం చెప్పింది సుబ్బారావు భార్య.

"దొంగ దొరికింది" అంది సంతోషంగా.

"ఏ దొంగ?"

"మన గొలుసు దొంగ."

అప్పుడు చూశాడు. భార్య మెడలో మెరుస్తున్న గొలుసు.

"ఎవరామె" నవ్వుతూ....ఉత్సుకతతో అడిగాడు.

"పందికొక్కులాంటి ఎలుక" అందామె.

ఈసారి సుబ్బారావు నిర్ఘాంతపోయాడు.

"అవునండి. రేపు పండగ కదా. ఇల్లంతా దులుపుతున్నాను. బాగా బూజుపట్టింది కదా. అప్పుడు గోడమీద నుండి పడింది" అందామె సంతోషంగా.

"పాతబట్టలు కొట్టడానికొచ్చి లాక్కెళ్ళి వుంటాయి."

"నీతోపాటు ఎలకలకూ బంగారం అంటే ప్రేమే" అన్నాడు సుబ్బారావు.

"మీరేమనుకోనంటే ఓ మాట చెబుతాను" అందామె.

"ఏమనుకోను చెప్పు."

"మీరా గొలుసు పోయిందని ఎవరికీ చెప్పొద్దన్నారుగా."

"అవును మరి. గొలుసు పోతేపోయింది. ఆ సొను భూతి, ఆ వ్యాఖ్యానం మనం భరించలేం."

"అబ్బ.... వినండి"

సుబ్బారావు ఆమెవంక చూశాడు.

"ఆ గొలుసు మీరే తీసుకెళ్ళి ఎవరికన్నా యిచ్చారేమో అనుకొన్నా."

"ఎవరికన్నా అంటే?"

"అది కూడా తెలీదా."

అప్పుడు వెలిగింది సుబ్బారావుకి.

"ఓరినీ.... అదా.... నన్నెవరు ప్రేమిస్తారే. నీకయితే తప్పదు" అన్నాడు.

వారిద్దరి నవ్వులూ అప్పారావుగారింట్లో కినిపించాయి.

వాళ్ళెందుకలా నవ్వారో ఆరాతీయటానికి అప్పారావు గారు తయారయ్యేరు. □

దబాయింపు ధర్మం!

శ్యాంబాబు

దొంగసాక్ష్యం

వందెకరాల ఆసామీ రాజపల్లుకు ఏకైక సోదరి, యాభై ఎకరాల మాగాణికి సొంతదారు అయిన కామాక్షి పుట్టినిల్లు, మెట్టినిల్లు అయిన కపోతపురంలోనే లంకంత ఇంట్లో ఒక్కతే వుంటూ, పాలేళ్ళనూ, పనివాళ్ళనూ పెట్టు

కొని స్వయంగా వ్యవసాయం చూసుకొంటూ, శరీరతాపం తీర్చడానికి తప్ప మరో వ్యవహారం దేనికైనా మగాడి అవసరం లేదని నిరూపిస్తూ కాలక్షేపం చేస్తోంది.

కామాక్షి మొగుడు చనిపోయి పదిహేనేళ్ళు దాటుతోంది. అత్తవారూ, ఆడబిడ్డలు, మరుదులూ ఆ వూళ్ళోనే వున్నా తన భర్తవాటా తను పంచుకొని వేరే కాపురం పెట్టుకొంది. రాజపల్లి కూడా చెల్లెలు ప్రవర్తనను పట్టించుకోక, చూచీ చూడకుండా పోయేవాడు. అవసరమైతే చెల్లెల్నే వెనకేసు కొచ్చేవాడు కావడంతో కామాక్షికి పట్టపగ్గాలే కుండా వున్నాయి. రహస్యంగా పాలేరు సుబ్బన్నతో సంబంధం పెట్టుకొంది.

అయితే రాత్రి పడక అలుసు చూసుకొని పగలు పని ఎగ్గొట్టే ప్రయత్నమో, వెకిలివేషమో వెయ్యాలని ప్రయత్నిస్తే మాత్రం గొడ్లచావిడి గుంజకు కట్టించి కమ్చీతో ఒళ్ళు చిట్లగొట్టేది. కామాక్షికి మోతుబరులైన బంధువులందరి సపోర్టు వుండడంతో ఎవ్వరూ ఎదురు తిరగటానికి సాహసించలేదు.

రెండేళ్ళు కామాక్షితో రాత్రిసరసం వల్ల సుబ్బన్న పూర్తిగా విసిగిపోయాడు. యజమానురాలికి ప్రియుడు కావడంవల్ల సుబ్బన్నకు కలిసొచ్చిందేమీలేదు. పగలు పాలేరు పని మామూలే. చేయవలసిన పనిలో ఏమాత్రం చురుకుదనం లోపించినా కామాక్షి నోటి దురుసుకు మిగిలిన పాలేళ్ళముందు తలవంచుకోవలసి వచ్చేది. పగలంతా కాయి కష్టం చేసింతరువాత సాయంత్రం మాత్రం కడుపునిండా భోజనం పెట్టి రాత్రంతా నిద్రపోనీకుండా కామక్రీడల్తో కాల్చుకుతినేది.

కామాక్షిని ఏదోరంగా వదిలించుకోవాలని సుబ్బన్న

ఆలోచనలోపడిన తరుణంలో కపోతపురానికి పదిమైళ్ళ దూరంలోవున్న తరుగుపాలెం నుండి అతనికి పెళ్ళి సంబంధం వచ్చింది.

పిల్లపేరు మల్లి. నలుపైనా మిసమిసలాడే నవయవ్వనంలో కళ్లు చెదిరేలా వుంటుంది. మల్లి తండ్రి ఆ వూరి మోతుబరి దగ్గర పెదపాలేరు. మల్లిని చేసుకుంటే ఉదయం సాయంత్రం భోజనం పెట్టించి సంవత్సరానికి పదిబస్తాలు ధాన్యం ఇప్పించే షరతున తన రైతుదగ్గరే చినపాలేరుగా ఏర్పాటుచేస్తానని కబురు పెట్టాడు సుబ్బన్నకు....

సుబ్బన్నకు ఈ అవకాశం అదృష్టంగా తోచింది. కామపిశాచి కామాక్షితో విసిగిపోయిన మనసుకు మల్లి అందం అద్భుతంగానూ, అక్కడి పాలేరుపని మంచి అవకాశంగానూ అనిపించాయి. మూడో మనిషికి చెప్పకుండా పెళ్ళి ప్రయత్నాలు చేసుకోమని మల్లితండ్రికి చెప్పాడు.

రేపు పెళ్ళనగా ముందురోజు కామాక్షి దగ్గర పని మానేశాడు సుబ్బన్న.

"ఈ రోజునుండి పన్లోకి రాను!" అన్నాడు సుబ్బన్న.

"ఏం? ఏం మాయరోగ మొచ్చింది?" అన్నది కామాక్షి చిరాగ్గా....

"రేపు నా పెళ్ళి....పెళ్ళయినాక తరుగుపాలెంలోనే జీతానికి వుండిపోతున్నాను" అన్నాడు సుబ్బన్న తల వంచుకొని.

ఒక్కక్షణం నోటమాట రాలేదు కామాక్షికి....గత రెండేళ్ళుగా పగలు రాత్రి గొడ్డులా తన సేవచేసిన సుబ్బన్న యిలా హఠాత్తుగా పెళ్ళిచేసుకొని ఊళ్ళోంచి వెళ్ళిపోవడం ఆమె ఊహించని పరిణామం. ఏ మగాణ్ణయినా తను ఇష్టం లేక దూరంగా వుంచవలసిందేగాని, మగాడన్న వాడెవడూ

తనంతట తాను తనను కాలదన్నిపోవడమనేది ఇంతవరకూ ఆమె జీవితంలో ఎదురవ్వలేదు.

"నీకిక్కడేం తక్కువయిందని" అన్నది చివరికి నిండుకుండలా సుబ్బన్న ముఖాన్నే పరీక్షగా చూస్తూ.

సుబ్బన్న వంచిన తల ఎత్తలేదు. కామాక్షి కళ్ళల్లోకి చూసే ధైర్యంలేదు.

"నాకూ ముందూ వెనకా ఎవ్వరూ లేదుకదా! పెళ్ళయింతరువాత వాళ్ళతోపాటే అక్కడ వుండొచ్చని...." అంటూ నసిగాడు.

"ఛత్....వెధవ...." తుపుక్కున వుమ్మింది కామాక్షి. "ఇల్లరికం పోతున్నావన్న మాట ...ఇంతకాలం నువ్వేదో మగాడివనుకొన్నా...."

"అదికాదు" సుబ్బన్న నోట్లో మాట రావడంలేదు.

"అలా ఆడదానిమల్లే నేలచూపులు చూస్తావేం! నా ముఖంవైపు చూపి చెప్పు. నీ నిక్కడేం తక్కువయిందని" నిలదీసింది కామాక్షి. దాని కరుకు గుండెల్లో సుబ్బన్నను కమ్చీతో చితగ్గొట్టాలన్న కాంక్ష క్షణక్షణానికీ పెరిగిపోతుంది.

కళ్ళెత్తి కామాక్షి ముఖంలోకి చూశాడు సుబ్బన్న. ఎరుపుకు తిరుగుతున్న కళ్ళలోనూ, కాస్త వంకరతిరిగిన పెదవుల మూలల్లోనూ అంతులేని అహంకారం, తనను తిరస్కరించాడనే భావంతో అప్పుడే ఏర్పడుతున్న కసి తాలూకు ఛాయలు కన్పించాయి వాడికి. క్షణం గుండెల్లో భయమనిపించింది.

చటుక్కున కామాక్షి ముఖంలో భావాలు మారాయి. వంకర తిరుగుతున్న పెదాలు సమ్మోహనంగా నవ్వాయి. అరుణిమకు తిరుగుతున్న కళ్ళు కైపుగా చూస్తున్నాయి.

"ఎప్పటికైనా ఓ స్వంత మనిషి, స్వంత సంసారం వుండాలి కదా....అందుచేతే అక్కడికే వెళ్ళిపోదామను కున్నాను. చెప్పిపోదామని వచ్చాను" అన్నాడు సుబ్బన్న జారిన ధైర్యాన్ని కూడగట్టుకొని ఒకడుగు వెనక్కి వేస్తూ.

అప్పటికే మిగిలిన పనివాళ్ళు ఇద్దరు ముగ్గురు యింటి అరుగుల దగ్గరజేరి వీళ్ళ సంభాషణ వినడానికి ప్రయత్నిస్తు న్నారు. కామాక్షిదగ్గరకు వచ్చేముందే తోటిపనివాళ్ళకు కూడా విషయం చెప్పాడు సుబ్బన్న.

సుబ్బన్న మాటలకు కామాక్షి మనసులో కసి తాచు పాములా పడగెత్తింది. అయినా ముఖంమీద నవ్వుమాత్రం చెరగనీయలేదు. 'ఒరె బండసుబ్బిగా....ఈ కామాక్షి తడాఖా నీకింకా తెలియదు' అనుకొంది మనసులో.

పైకిమాత్రం, "అయితే అత్తారింట్లోనే వుండిపోతా నంటావ్?" అన్నది మామూలుగా.

కామాక్షిలో మార్పు సుబ్బన్నకు అయోమయంగా వుంది. అరిచి గోలచేస్తుంది అనుకొన్న మనిషి తాపీగా మాట్లాడంలో ఆంతర్యం అర్థంకాలేదు వాడికి. కామాక్షి ప్రశ్నకు జవాబుగా తలమాత్రం వూపేడు.

"ఇప్పుడే వస్తా.... ఒక్కక్షణం నిలబడు" అంది కామాక్షి గిరుక్కున తిరిగి యింట్లోకి వెళుతూ.

సుబ్బన్న గుండెల్లో రాయిపడింది. కమ్చీ తెచ్చి చిత గ్గొట్టదు గదా!

అరుగుల దగ్గర చేరిన పనివాళ్ళు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

లోపలికెళ్ళిన కామాక్షి తిరిగొచ్చింది. సుబ్బన్నతోసహా అందరూ ఆశ్చర్యంగా నోళ్లు తెరిచారు.

"ఇంద ఈ రెండొందలు పట్టుకెళ్ళు. పెళ్ళంటే చాలా

కర్చులుంటాయి. నేనిమ్మన్నానని జెప్పి వీరారాయిడిగారి మిల్లులో ఓ బస్తా ధాన్యం కూడా తీసుకో" అంది కామాక్షి వందరూపాయల నోట్లు ఇస్తూ.

సుబ్బన్నకు నోటమాటలేదు. కంటిచూపు వుందో లేదో తెలియదు.

"తీసుకోమంటే అలానోరెళ్ళబెట్టి చూస్తావేం.... ఊ.... పట్టుకెళ్ళు... అన్నట్లు పెళ్ళయినాక ఓసారి నీ పెళ్ళాన్ని తీసుకొచ్చి మా అందరికీ చూపించాలి మరి" అన్నది కామాక్షి చాలా దయగా.

వణికే చేతుల్తో డబ్బు అందుకొని దండం పెట్టాడు సుబ్బన్న.

2

దబదబ మోగుతున్న తలుపు చప్పుడుకి ఉలిక్కిపడి నిద్రలేచాడు సుబ్బన్న.

"సుబ్బన్నా! సుబ్బన్నా?" ఎవరో పిలుస్తోన్నారు.

గదిలో గుడ్డివెలుతుర్లో నులకమంచం మీద నగ్నంగా వున్న తమ శరీరాలకేసి ఓసారి చూసుకొన్నాడు సుబ్బన్న. పెళ్ళయి నెలరోజులు దాటుతున్నా తమకం తీరనేలేదు ఇద్దరికీ.... పెళ్ళయి రోజులు గడుస్తున్నకొద్దీ మల్లి ఒళ్ళు క్రొత్త అందాలు అంతరించుకొని సుబ్బన్నని మరింత కవ్వించి రెచ్చగొడుతోంది.

మంచంమీద నుండి లేవబోతున్న సుబ్బన్నను మెడ చుట్టూ చేతులువేసి మీదకు లాక్కుంది మల్లి .... "ఆళ్ళే పోతారులే.... పడుకో...." అన్నది అతన్ని పెనవేసుకు పోతూ.

బయట తలుపుమీద చప్పుడెక్కువయింది ... "రేయ్ సుబ్బన్నా...." గట్టిగా పిలుస్తున్నా రెవరో.

మంచం దిగక తప్పలేదు. "ఎవడెహే!" విసుక్కున్నాడు చిరాగ్గా పంచె చుట్టుకొంటూ.

ఆ వచ్చింది ఎవరోకాదు. కామాక్షి దగ్గర చిన్నపాలేరు వెంకటేశ్వర్లు. తనకు పెళ్ళయిపోయింతరువాత ప్రస్తుతం కామాక్షికి పబ్బం గడుపుతున్నది వాడేనని సుబ్బన్నకు తెలియదు.

"నేను వెంకటేశ్వరుల్ని" అన్నాడు వాడు సుబ్బన్న తలుపు తీయగానే గుసగుసలుగా.

"ఏమిటి ఈ వేళప్పుడొచ్చావ్?" విసుగ్గా అడిగాడు సుబ్బన్న.

"అమ్మగారికి సందెవేళ పాము కరిచింది. వచ్చేప్రాణం పోయేప్రాణంలా వుంది. నిన్నోమారు చూడాలనుందని చెప్పింది....వెంటనే బయలుదేరు—" అన్నాడు వెంకటేశ్వర్లు.

క్షణంలో మత్తు వదిలిపోయింది సుబ్బన్నకు ఓ ఆడది, అందునా చావుబతుకుల్లోవున్న మనిషి....చివరి క్షణాల్లో తనకోసం తహతహలాడ్డం....ఎలాంటి మగాడికయినా మరో ఆలోచన రానివ్వదు. అందునా తను వూరువదిలి వచ్చేప్పుడు కామాక్షి తనకిచ్చిన ధాన్యం, డబ్బు ఇంకా మరిచిపోలేదు సుబ్బన్న.

చకచక దండెంమీది చొక్కా తగిలించుకొని, తుండుగుడ్డ తలకు చుట్టుకొన్నాడు. మూలనున్న బాణాకర్ర అందుకొని, "లేచి తలుపేసుకో, తెల్లారేలోగా తిరిగొచ్చేత్తా!" అన్నాడు నిద్రమత్తులో జోగుతున్న మల్లితో.

"ఎక్కడికి ఈ ఏలప్పుడు?" అంది మల్లి దుప్పటి మీదకు లాక్కొంటూ.

"అమ్మగారిని పాము కరిచిందంట....సూచివచ్చేత్తా!"

అన్నాడు సుబ్బన్న బయటికి నడుస్తూ.

తరుగుపాలెం నుండి కపోతపురానికి నాలుగు మైళ్ళుం టుంది. డొంకదారి....దారికటూ ఇటూ పంటపొలాలు, మధ్య మధ్యలో తాటితోపులున్నాయి. కపోతపురం సరి హద్దుల్లో దొరగారి పెద్ద తాటిచెట్లతోపు వుంది. రాత్రి సుమారు రెండున్నర మూడు ప్రాంతంలో తోపులో ప్రవే శించారు ఇద్దరూ.

అమావాస్యకు ఇంకా రెండ్రోజులే వుండడంచేత రాత్రి చిమ్మచీకటిగా వుంది. తాడిచెట్ల తోపులో మరీ చీకటిగా వుంది. చీకటిలో నడవడం, పనిపాటలు చేసుకోవడం అల వాటయినవాళ్ళు కావడంవలన ఇద్దరూ నిర్భయంగా, చక చక నడుస్తున్నారు. చీకట్లో డొంకదారి మసకమసగ్గా కని పిస్తోంది. అలవాటులేని వాళ్ళకు ఏది దారో, ఏది పొదో, ఏది దిబ్బో తెలియదు ఆ చీకట్లో.

తోపుమధ్యలో వెంకటేశ్వర్లు ఆగిపోయాడు. నాలుగడు గులు వేసి వెంకటేశ్వర్లు రావడంలేదని గ్రహించి సుబ్బన్న కూడా ఆగాడు.

"ఆగావేం?" అన్నాడు వెనక్కు తిరుగుతూ.

సరిగ్గా అదే సమయానికి పది బాణాకర్రలు గాల్లో లేచాయి. జరిగిందేమిటో గ్రహించేలోపునే సుబ్బన్న వీపు మీద, భుజాలమీద అప్పుడే నాలుగయిదు దెబ్బలు పడి పోయాయి. చటుక్కున తన చేతిలోని బాణాకర్ర పైకెత్తి అడ్డం పెట్టుకోకపోతే దుడ్డుకర్ర దెబ్బలకు సుబ్బన్న తల పచ్చడయివుండేది.

"ఏసేయ్.... ఏసేయ్ ....బాదు.... బాదు" అరుపులు, కేకలు, గురితప్పిన కర్రలు నేలకు తగిలిన చప్పుళ్ళు ... చీకట్లో ఏం జరుగుతుందో, ఎవరు ఎవర్ని అంటున్నారో

తెలియడంలేదు.

జరుగుతున్నదేమిటో అర్థంకాని ఖంత కాడు సుబ్బన్న. అవతలి వ్యక్తులు ఎవరయినా, మొత్తానికి తనకు హాని చెయ్యాలనే వుద్దేశ్యంలోనే వున్నారని అర్థమయింది. బాణాకర్ర అడ్డం పెట్టుకునే నాలుగ్గజాలు దూరంగా పరిగెత్తాడు.

"పారిపోతున్నాడు... ఎయ్యండెహ...." ఎవరో అరిచారు....

గిరుక్కున వెనక్కి తిరిగాడు సుబ్బన్న. అతని చేతిలో బాణాకర్ర విష్ణుచక్రంలా తిరగసాగింది.

"చచ్చాన్రోయ్" శత్రువర్గంలో ఒకడి అరుపు.

"చంపండి నా కొడుకొని" మరో అరుపు.

చీకటి, నీడల్లాంటి ఆకారాలు, ఎవరెవరో తెలియడం లేదు. చీకట్లో కర్రకు కర్ర తగిలిన చప్పుళ్ళు, అరుపులు, మూల్గులు, కేకలు....సుబ్బన్న చేతిలో కర్ర జారిపోయింది. అంతా గందరగోళంగా, బీభత్సంగా వుంది. శరీరాల చమట కంపుతోనూ, సారావాసనతోనూ నిండిపోతోంది వాతావరణం. ఎవరు ఎవర్ని కొడుతున్నారో తెలియకుండావుంది.

చటుక్కున ఓ గెంతు గెంతి తోపులో చెట్లకు అడ్డం పడి పరిగెత్తసాగాడు. సుబ్బన్న కాస్తదూరం పారిపోయిన తర్వాతగాని, అతను తప్పించుకొన్నట్లు మిగిలినవాళ్ళకు తెలియలేదు.

"రేయ్ ...పిరికినాయాల పారిపోతున్నాడు పట్టుకోండెహె" ఎవరో అరిచాడు.

సుబ్బన్న ఆగలేదు. ఇదంతా తనను చంపడానికి కక్షతో కామాక్షి చేసిన పనని అతనికి అర్థమయిపోయింది. వెనక్కి తిరిగి చూడకుండా తరుగుపాలెం వైపు పరుగు

తీశాడు.

సుబ్బన్నను కాసేపు తరిమి ఆగిపోయారు ఆగంతకులు.

3

జిల్లా సెషన్స్ కోర్టు కపోతపురం కామందులతోనూ, తరుగుపాలెం వ్యక్తులతోనూ కిటకిటలాడుతోంది.

సరిగ్గా వుదయం పదకొండు గంటలు కొడుతూవుండగా సెషన్స్ జడ్జి కోర్టులో ప్రవేశించాడు. కోర్టు గుమాస్తా స్టేట్ వెర్సెస్ సుబ్బన్న ట్రయిల్ అనౌన్స్ చేశాడు.

ముద్దాయికోసం నిర్దేశింపబడిన బోనులో సుబ్బన్నను తీసుకొచ్చి నిలబెట్టారు పోలీసులు. భయంతోనూ, అవమానంతోనూ, బాధతోనూ పేర్కుపోయిన మొహం, మాసిన దుస్తులు, పెరిగిన గెడ్డం, దీనంగా వుంది సుబ్బన్న పరిస్థితి.

బోనులో సుబ్బన్న కనబడగానే ప్రేక్షకుల గాలరీలో కూర్చొన్న మల్లి వెక్కి వెక్కి ఏడవసాగింది. ప్రక్కనున్న బంధువులెవరో ఆమెను బయటికి తీసుకుపోయారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలియుగమూర్తి లేచి నిలబడి జడ్జికి అభివాదంచేసి ప్రారంభించాడు.

"యువర్ ఆనర్! ఫిబ్రవరి ఇరవై రెండవ తేదీ ఉదయం మూడుగంటల ప్రాంతంలో ముద్దాయి కారెపు సుబ్బన్న తన పాత యజమానురాలి ఇంట్లో బంగారునగలు దొంగిలించి పారిపోతూవుండగా ఆటకాయించిన వెంకటేశ్వర్లును హత్య చేసినందుకుగాను, హత్య మరియు దొంగతనం అనే రెండు నేరాలకు సంబంధించిన అభియోగాన్ని ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలతో ఋజువుచేస్తుంది."

జడ్జి తలవూపి ప్రొసీడ్ అవమన్నట్లు సైగచేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలియుగమూర్తి తన చేతిలోని

కాగితాలవైపు చూసి మళ్ళీ ప్రారంభించాడు.

"ప్రస్తుతం తరుగుపాలెం గ్రామనివాసియైన ముద్దాయి కారెపు సుబ్బన్న గతంలో కపోతపురానికి చెందిన శ్రీమతి కామాక్షివద్ద పాలేరుగా పనిచేస్తూ వుండేవాడు. రెండు నెలల క్రితం తరుగుపాలెంలోని ఓ అమ్మాయిని పెళ్ళాడి శ్రీమతి కామాక్షి దగ్గర పని మానుకొని తరుగుపాలెంలోనే పాలేరుగాజేరి ఆ గ్రామంలో స్థిరపడ్డాడు. సుబ్బన్న పని మానుకొని వెళ్ళిపోయే రోజున అతని పెళ్ళిఖర్చుల కోసం రెండువందల రూపాయల నగదు, బస్తా ధాన్యం కూడా యిచ్చి పనివారి ఎడల తన సానుభూతిని, దయను వ్యక్తం చేసింది శ్రీమతి కామాక్షి.

ఇకపోతే; గతనెల అంటే ఫిబ్రవరి ఇరవై రెండవ తేదీ తెల్లవారురూము మూడుగంటల ప్రాంతంలో తన యింట్లో అలికిడయి__నిద్ర మెలకువ వచ్చిన శ్రీమతి కామాక్షికి తన గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో తచ్చాడుతున్న సుబ్బన్న కనిపించేసరికి భయంవేసి కేకలు పెట్టింది. ఆ అరుపులకి చేజిక్కిన నగల్తో సుబ్బన్న బయటికి వుడాయించాడు.

ఆ రోజు రాత్రి యింటి కాపలాగా పడుకొన్న పాలేరిద్దరూ దొంగను పట్టుకొనే వుద్దేశ్యంతో సుబ్బన్నను తరమడం జరిగింది. వీరి కేకలకు ఊళ్లో మరికొంతమంది కూడా దొంగవెంటపడ్డారు. అందరికన్న ముందు తరుముతోన్న వెంకటేశ్వర్లు అనే పాలేరు సుబ్బన్నను అందుకొని పట్టుకోబోయేంతలో, సుబ్బన్న తన చేతిలోని బాణాకర్రతో వెంకటేశ్వర్లు తలపై మోదడం, ఆ దెబ్బకు అతనక్కడికక్కడే మరణించడం జరిగాయి. ఆ తర్వాత సుబ్బన్న మరికొందర్ని కూడా బాగా కర్రతో గాయపర్చడంతో మిగి

లినవాళ్ళు వెనక్కు తగ్గడం అతను తప్పించుకుపోవడం జరిగాయి.

మరునాడు వుదయం, గ్రామాధికార్లు మా సమాచారాన్ని అందుకొని ఆ ఏరియా పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుబ్బన్నను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన సమయంలోనే సుబ్బన్న ఇంటి చూరులో నుంచి శ్రీమతి కామాక్షి ఇంటినుండి దొంగిలింపబడిన నగల్ని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ముద్దాయి సుబ్బన్నపై దొంగతనం మరియు హత్య అనే రెండు నేరాలపై అభియోగం దాఖలు చేయబడింది. ఈ అభియోగాన్ని ఋజువుపరచేందుకు అవసరమైన సాక్ష్యాలను ఇప్పుడు ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టడానికి అనుమతివ్వవలసిందిగా కోరుకొంటున్నాను" అని కలియుగమూర్తి తన ప్రసంగమును ముగించాడు.

కలియుగమూర్తి ఎదురుగా టేబుల్ కవతల కూర్చున్న డిఫెన్స్ లాయర్ సి. జె. కళ్ళజోడు తీసి తుడుచుకొని మళ్ళీ పెట్టుకొన్నాడు. వయస్సు నలభై దాటుతున్నా ముప్పై ఏళ్ళ వ్యక్తిలా వున్నాడతను. ప్రాసిక్యూటర్ ఇంట్రడక్షన్‌ను చిరునవ్వుతో ఓపిగ్గా విన్నాడతను. ప్రాసిక్యూషన్ కేసు బలంగా వుంది. గట్టి ఋజువులున్నాయి. అయినా సుబ్బన్న కథనం నమ్మదగిందిగాను, పోలీసుల వెర్షన్ కాంకాక్టెడ్‌గానూ తోచిందతనికి. అంచేత ఎంతోమంది గట్టి క్రిమినల్ లాయర్లు టేకప్ చేయడానికి నిరాకరించిన ఆ కేసును తీసుకొన్నాడతను.

ప్రాసిక్యూషన్ తన సాక్షులను ప్రవేశపెట్టడానికి జడ్జి అంగీకరించాడు.

"ప్రాసిక్యూషన్ తరపున మొదటి సాక్షిగా పోలీసు ఇన్‌స్పెక్టర్ రాజారావును ప్రవేశపెడుతున్నాము" చెప్పాడు

కలియుగమూర్తి.

ఇన్‌స్పెక్టర్ రాజారావు బోనెక్కి ప్రమాణం చేశాక ప్రారంభించాడు కలియుగమూర్తి.

ముందుగా ఇన్‌స్పెక్టర్ వృత్తి, శిక్షణ, అనుభవం మొదలయినవాటి గురించి చిన్నప్రశ్నలు వేశాడు.

"ఇన్‌స్పెక్టర్! నిందితుడు, సుబ్బన్నను మీరు అరెస్ట్ చెయ్యడానికి దారితీసిన పరిస్థితులేమిటో చెప్పగలరా?" అడిగాడు కలియుగమూర్తి.

ఇన్‌స్పెక్టర్ తన చేతిలోని డైరీ ఒకసారి చూసుకొని గొంతు సవరించుకొని చెప్పసాగాడు.

"ఫిబ్రవరి ఇరవై రెండవ తేదీ వుదయం ఎనిమిది గంటలకు కపోతవరం గ్రామకరణం నుండి నాకు వర్తమానం అందింది. కపోతపురం శివారులో వున్న దొరగారి తోపులో శవం వుందని, ఆ శవం వెంకటేశ్వర్లు అనే వ్యక్తిదని, ఆ రోజు తెల్లవారుజామున శ్రీమతికామాక్షి ఇంట్లో దొంగతనానికి వచ్చిన సుబ్బన్న అనే వ్యక్తిని తరుముతూ వుండగా, సదరు సుబ్బన్న వెంకటేశ్వర్లుని బాణాకర్రతో కొట్టి చంపి పారిపోయాడనీ, వెంటనే వచ్చి తగు చర్యలు తీసుకోవలసినదని గ్రామనౌకరుకు ఉత్తరం వ్రాసిచ్చి పంపారు.

వర్తమానం అందిన వెంటనే తగిన సిబ్బందితో బయలుదేరి కపోతపురం వెళ్ళాను. ముందుగా హత్యాస్థలానికి వెళ్ళాను. తాటితోపు మధ్య వెంకటేశ్వర్లు శవం పడివుంది. తల బద్దలయి తలచుట్టూ రక్తం కారివుంది. గ్రామకరణంతోనూ, వెంకటేశ్వర్లు బంధువుల్తోను శవాన్ని ఐడెండిఫై చేయించిన తరువాత శవాన్ని మార్చురీకి పంపాము.

ఆ తర్వాత శ్రీమతి కామాక్షి నుండి, ఆ రోజు రాత్రి

సుబ్బన్నను తరిమిన మరికొంత మందినుండి స్టేట్‌మెంట్స్ తీసుకొన్నాను.

శ్రీమతి కామాక్షి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సుబ్బన్నను పాజిటివ్‌గా ఐడెంటిఫై చేశారు. ఇరవై రెండో తేదీ తెల్లవారుజామున రెండుగంటల ప్రాంతంలో తన గదిలో చప్పుడయి మెలకువ వచ్చినట్లు, ఎవరని పిలిచినా సమాధానం లేకపోయేప్పటికి మంచం ప్రక్కనే వున్న హరికెన్ లాంతరు వత్తి పెద్దదిచేసి చూశాననీ, ఆ వెలుతుర్లో తలుపు ప్రక్కనే నక్కివున్న సుబ్బన్న కనబడ్డాడనీ శ్రీమతి కామాక్షి చెప్పారు.

పక్కవూరిలో వుంటున్న సుబ్బన్న ఆ వేళప్పుడు తన గదిలో కనబడడం తనకు ఆశ్చర్యం భయం కలిగించాయని తనతన్ని పలకరించే లోపునే గదిలోనుండి బయటికి పరిగెత్తాడనీ, అప్పుడు తను సుబ్బన్న నిశ్చయంగా దొంగతనానికే వచ్చివుంటాడనే వుద్దేశ్యంతో 'దొంగ... దొంగ' అని అరిచాననీ, బయటవున్న తన పాలేర్లు సుబ్బన్నను తరిమారనీ శ్రీమతి కామాక్షి తెలిపింది.

తరువాత సుబ్బన్నను తరిమిన రెండవ పాలేరు యేసేబును ప్రశ్నించాను. యేసేబు చెప్పిందాన్నిబట్టి వెంకటేశ్వర్లు, తను 'దొంగ, దొంగ' అని అరుస్తూ సుబ్బన్నను తరిమామనీ, మరికొంత మంది కూడా తమతో కలిసారనీ, అందరికన్న ముందు వెంకటేశ్వర్లు వున్నాడని, తాటితోపు ప్రాంతంలో సుబ్బన్నకు బాగా దగ్గరయ్యాడనీ, అప్పుడు సుబ్బన్న వెనక్కి తిరిగి తన బాణాకర్రతో వెంకటేశ్వర్లు తలపై మోది వెనక వస్తున్నవాళ్ళను కూడ ఇద్దరు ముగ్గుర్ని గాయపరచి చేలకడ్డంపడి పారిపోయాడని యేసేబు స్టేట్‌మెంట్ ఇచ్చాడు...." ఇన్‌స్పెక్టర్ చకచకా చెప్పుకు

పోతున్నాడు.

కలియుగమూర్తి చిన్నగా చెయ్యెత్తాడు "జస్ట్ వన్ మినిట్ ఇన్‌స్పెక్టర్!"

ఆగి ఏమిటన్నట్లు చూశాడు ఇన్‌స్పెక్టర్....

"కామాక్షిగారి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకొన్నప్పుడు సుబ్బన్నను గుర్తించడం గురించి మాత్రమే చెప్పిందా లేక దొంగిలించబడిన వస్తువులను గూర్చి గూడా చెప్పిందా?"

"సుబ్బన్నను గుర్తించిన విషయంతోపాటు, అతను పారిపోయిం తరువాత తెరిచివున్న ట్రంకుపెట్టెను చూశానని, అందులో వుండవలసిన నాలుగుపేటల చంద్రహారం కనబడడంలేదని చెప్పింది...."

"థాంక్యూ! ఇక మీరు తర్వాత విషయం చెప్పండి!"

"యేపేబుతోబాటు మరో నలుగురు సాక్షులవద్ద కూడా స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకొని తరుగుబాలెం వెళ్ళాను. సుబ్బన్నను అతని ఇంటివద్ద అరెస్ట్ చేశాను. అతని ఇంటిని సోదా చేయగా గుడిసెచూరులో మసిగుడ్డతో చుట్టబడిన చంద్రహారం దాచిపెట్టబడినది దొరికింది."

"ఆ చంద్రహారం ఇదేనా?" ప్రాసిక్యూటర్ ఓ నాలుగు పేటల చంద్రహారం ఇన్‌స్పెక్టర్‌కు చూపించాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ చంద్రహారాన్ని తీసుకొని ఒక్క నిముషం పరిశీలనగా చూసి తను దానిపై వేసిన ఐడెంటిఫికేషన్ మార్కింగ్ చూసుకొని తృప్తిపడి, "ఇదే" అన్నాడు. చంద్రహారాన్ని ఎగ్జిబిట్ 'ఏ'గా కోర్టుకు దాఖలు చేశారు.

"గుడ్! ప్రొసీడ్!"

"దొరికిన చంద్రహారాన్ని శ్రీమతి కామాక్షి చెప్పిన

గుర్తుకు సరిపోయింది. తర్వాత ఆ హారాన్ని ఆమెతో కూడా ఐడెంటిఫై చేయించాము.

ఆ రోజే మా సిబ్బంది హత్యాయుధం, ఐ మీన్ హత్యకు వుపయోగించిన బాణాకర్రను దొరగారి తోపులో కను గొన్నారు. అది సుబ్బన్న వుపయోగించే ప్రత్యేకమైన బాణాకర్రని తరుగుబాలెంలో సుబ్బన్నతోపాటు పని చేసే ఇతర పాలేర్లు, కపోతపురంలో కామాక్షి దగ్గర పాలేర్లు కూడా గుర్తించారు."

బాణాకర్రను ఎగ్జిబిట్ 'బి'గా కోర్టుకు దాఖలు చేశారు.

"దట్సాల్ యువరానర్! డిఫెన్స్ క్రాస్ చేసుకో వచ్చు!" అన్నాడు కలియుగమూర్తి అంతటితో ఇన్‌స్పెక్టర్ డైరెక్ట్ ఎగ్జామినేషన్ ముగిస్తూ.

డిఫెన్స్ లాయర్ పి. జె. కళ్ళజోడు అద్దాలు తుడుచు కొంటూ లేచి నిలబడ్డాడు. నెమ్మదిగా బోను దగ్గరికి వెళ్ళి నిలబడ్డారు.

"ఇన్‌స్పెక్టర్! సుబ్బన్నను అరెస్ట్ చేసినప్పుడు అతని వాఙ్మూలాన్ని మీరు రికార్డ్ చేశారా?" అడిగాడు పి. జె.

ఇన్‌స్పెక్టర్ ఒక్క_క్షణం ఇబ్బందిగా కదిలాడు. "యస్. సుబ్బన్న దగ్గర కూడా స్టేట్‌మెంట్ తీసుకొన్నాను" అన్నాడు.

"సుబ్బన్న తన వాఙ్మూలంలో ఏం చెప్పాడో చెపు తారా?" అడిగాడు పి. జె.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలియుగమూర్తి కంగారుగా లేచి నిలబడ్డాడు. "ఐ అబ్జెక్ట్ యువరానర్! మై లెర్నెడ్ ఫ్రెండ్ డిఫెన్స్ లాయరు డైరెక్ట్ ఎగ్జామినేషన్లో చెప్పిం చిన విషయాన్ని క్రాస్ చేయకుండా అనవసరమైన విషయాల గురించి ప్రస్తావిస్తున్నారు."

పి.జె. నవ్వుతూ జడ్జివైపు చూశాడు. "నేరారోపణ చేసినప్పుడు ముద్దాయి యిచ్చిన వాఙ్మూలాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని నా ఉద్దేశం. ముద్దాయి వాఙ్మూలంలో నిజా నిజాలను కోర్టువారికి ఋజువు చెయ్యవలసిన బాధ్యత కూడా ప్రాసిక్యూషన్ వారికున్నది. కాని అవర్ లెర్నెడ్ ఫ్రెండ్ శ్రీకలియుగమూర్తి తన ప్రారంభోపన్యాసంలో గాని, ఇన్‌స్పెక్టర్‌ను డైరెక్ట్ ఎగ్జామినేషన్ చేసినప్పుడు గాని ఆ విషయాన్ని ప్రస్తావించకపోవడం, అనూహ్యంగా వుంది. అందుచేత ముద్దాయి అరెస్టయినప్పుడు యిచ్చిన స్టేట్‌మెంట్ సారాంశం తెలుసుకోవలసిన అవసరం వుందనుకొంటున్నాను."

ప్రాసిక్యూటర్ ముఖం క్షణం వెలవెలబోయింది. ఇన్‌స్పెక్టర్ గబగబా డైరీ పేజీలు తిరగెయ్యసాగాడు.

జడ్జి, ప్రాసిక్యూటర్ వైపు నిదానంగా చూసి, "అబ్జెక్షన్ ఓవర్‌రూల్డ్! యు కెన్ ప్రొసీడ్ మిస్టర్ పి.జె.!" అన్నాడు.

"థాంక్యూ యువరానర్" అని ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి "చెప్పండి ఇన్‌స్పెక్టర్. నిందితుడు సుబ్బన్న యిచ్చిన వాఙ్మూలం ఏమిటి?" అన్నాడు పి.జె.

"సుబ్బన్నను అరెస్ట్ చేసినప్పుడు వెంకటేశ్వర్లు హత్యలోగాని, శ్రీమతి కామాక్షి ఇంట్లో నగల దొంగతనంలోగాని తనకు సంబంధం లేదని బుకాయించాడు. హత్య జరిగినరోజు రాత్రి ఒంటిగంట సమయంలో హతుడు వెంకటేశ్వర్లు తన యింటికి వచ్చాడని, కామాక్షిగారికి పాము కరిచి చావు బ్రతుకుల్లో వుండి తననొక్కసారి చూడడానికి రమ్మంటుందని కబురుపెట్టిందని, అందుచేత అప్పటి

కప్పుడు బయలుదేరి కపోతపురం ప్రయాణమయ్యాననీ, దొరగారి తోపు దగ్గరికి వచ్చేసరికి యెవరో గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో తనపై దాడిచేశారనీ, తనూ ఆత్మరక్షణకు చేతిలో బాణాకర్ర వుపయోగించాననీ, ఆ గలాటాలో తన కర్ర జారిపోయిందనీ, భయంతో వెనుదిరిగి తరుగు పాలెం పారిపోయి వచ్చాననీ చెప్పాడు" ఒకక్షణం ఆగాడు ఇన్‌స్పెక్టర్.

"వెరీగుడ్ ఇన్‌స్పెక్టర్! సుబ్బన్న కథనంలో నిజానిజాలు కనుక్కోవడానికి మీరు ప్రయత్నించలేదా?" అడిగాడు సి.జె.

ఇన్‌స్పెక్టర్ ఇబ్బందిగా కలియుగమూర్తి వైపు చూశాడు .... "సుబ్బన్న చెప్పినవన్నీ అబద్ధాలని తెలుస్తోందిగా?"

ఒక్కక్షణం సి. జె. కళ్ళల్లో మెరుపులు మెరిశాయి. "ఇన్‌స్పెక్టర్! సుబ్బన్న చెప్పిన విషయాలు అబద్ధాలు అని ఎలా ధృవీకరించారు?"

"సుబ్బన్న ఇంటికి వెంకటేశ్వర్లు వచ్చినట్లుగా సాక్ష్యం లేదు. ఐ మీన్ అతని భార్యతప్ప మరెవ్వరూ సుబ్బన్న ఇంటికి వెంకటేశ్వర్లు వచ్చిన విషయం ధృవపరచలేదు. కాని సుబ్బన్న కామాక్షిగారింట్లో దొంగతనం చేస్తూ కన బడ్డాడు. అతన్ని కామాక్షిగారి పాలేర్లతోబాటు అతన్ని తరిమిన అనేకమంది చూశారు...." అన్నాడు ఇన్‌స్పెక్టర్ విసుగ్గా.

"ఇన్‌స్పెక్టర్! సుబ్బన్న యింటి చుట్టు ప్రక్కల ఇళ్లు ఎంత దూరంలో వున్నాయి?"

ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తున్నట్లుగా ఒక్కనిముషం సమాధానం చెప్పలేదు. "చెప్పండి!" అన్నాడు సి.జె. ఎంక

రేజింగా.

"సుబ్బన్న యిల్లు ఊరి చివరగా మిగతా ఇళ్ళకి కాస్త ఎడంగా వుంది."

"ఎడంగా అంటే....? అన్నిటికన్నా దగ్గరైన పొరు గిల్లు ఎంత దూరంలో వుంది?" అడిగాడు పి.జె.

"సుమారు వందగజాల దూరంలో వుండొచ్చు...."

"సుబ్బన్న యింటి చుట్టుప్రక్కల వీధిదీపాలు వున్నాయా?"

"లేవు" అన్నాడు ఇన్ స్పెక్టర్ ఆ విషయం చెప్పడానికి యిష్టం లేనట్లు.

"సుబ్బన్న యిల్లు మిగతా ఇళ్ళనుండి ఎడంగా వుంది, ఇంటి చుట్టుప్రక్కల వీధిదీపాలు లేవు. దీన్నిబట్టి ఒకవేళ రాత్రిపూట సుబ్బన్న ఇంటికి యెవరయినా వచ్చినా ఎవరూ చూడగలిగే అవకాశం లేదుగా?" అడిగాడు పి.జె.

ఇన్ స్పెక్టర్ మాట్లాడలేదు. పి. జె.ను మింగేసేలా చూశాడు.

"వెల్. ఆన్సర్ మై క్వశ్చన్ మిస్టర్ ఇన్ స్పెక్టర్. ఆ చీకటిరాత్రిలో సుబ్బన్న యింటికి వెంకటేశ్వర్లు వచ్చి వున్నట్లయితే చుట్టుప్రక్కల వున్న ఇళ్ళవాళ్ళు తెలుసుకొనే అవకాశం వుందా?"

కలియుగమూర్తి చటుక్కున లేచి నిలబడ్డాడు. "అబ్జక్షన్ యువరానర్! సాక్షిని హైపాథిటికల్ ప్రశ్నలకు జవాబులు ఇమ్మని వత్తిడి చెయ్యడం సమంజసంకాదు" అన్నాడు కోపంగా.

"యువర్ ఆనర్! సాక్షి ఒక అనుభవజ్ఞుడైన ఇన్ వెస్టిగేటింగ్ ఆఫీసరు. సుబ్బన్న ఇంటికి వెంకటేశ్వర్లు వచ్చాడని చెప్పేందుకు కేవలం మల్లి, అంటే సుబ్బన్న భార్య

సాక్ష్యం చాలదని ఇన్‌స్పెక్టర్ అభిప్రాయపడ్డారు. సంఘటనలు జరిగేప్పుడు సాక్షులు కాచుకొని వుండరు. వెంకటేశ్వర్లు రావడం మరెవరూ చూసే అవకాశం లేదని ఇన్‌స్పెక్టర్ గ్రహించారా లేదా అన్నది కోర్టు తెలుసుకోవాలని నా ఉద్దేశం" అన్నాడు పి.జె. తీవ్రంగా.

"కోర్టువారు ఏం తెలుసుకోవాలో మై లెర్నెడ్ ఫ్రెండ్ నిర్దేశించనవసరంలేదు. సుబ్బన్న వాఙ్మూలంలో నిజంలేదని భావించే హక్కు ఇన్‌వెస్టిగేటింగ్ ఆఫీసరుకు వున్నది. ఇన్‌స్పెక్టర్ ఏ కారణాలచేత సుబ్బన్న కథనం అంగీకరించలేదు అన్నది అప్రస్తుతం. మై లెర్నెడ్ ఫ్రెండ్ కోర్టును తప్పుదారి పట్టించాలని ప్రయత్నిస్తున్నారు" అన్నాడు కలియుగమూర్తి ఆవేశంగా.

"యువర్ ఆనర్! మై లెర్నెడ్ ఫ్రెండ్ అనవసరంగా ఆవేశపడుతున్నారు. నిందితుడి కథనం, ప్రాసిక్యూషన్ వారి కథనం వేరువేరుగా వున్నప్పుడు, నిందితుడి కథనంలో లోపాలేమిటో పూర్తిగా వివరించవలసిన బాధ్యత ప్రాసిక్యూషన్‌కు వున్నది. సుబ్బన్న భార్యకాక మరో వ్యక్తి కనుక వెంకటేశ్వర్లును సుబ్బన్న ఇంటివద్ద చూసి వుంటే ప్రాసిక్యూషన్ కథనం పూర్తిగా పటాపంచలవుతుందని వేరే చెప్పక్కరలేదు. అటువంటప్పుడు నిందితుడి కథనంలో నిజానిజాలు ఎస్టాబ్లిష్ చెయ్యడానికి ఇన్‌వెస్టిగేటింగ్ ఆఫీసరు పూర్తిగా ప్రయత్నించారా లేదా అన్నది తప్పనిసరిగా నిర్ణయించాలి" అన్నాడు పి.జె.

"ఆ విషయం డిఫెన్స్ తర్వాత ఆర్గ్యూ చేసుకోవచ్చు. కాని సాక్షిని ఊహాజనిత సంఘటనలమీద అభిప్రాయం చెప్పమని కోరడం సమంజసం కాదు."

"అబ్జక్షన్ సస్టైన్డ్! సాక్షి ప్రశ్నకు సమాధానం

చెప్పనవసరంలేదు" అన్నాడు జడ్జి రూలింగ్ ఇస్తూ.

కలియుగమూర్తి ముఖం జయప్రదంగా వెలిగి పోయింది.

సి. జె. చిత్రంగా భుజాలెగరేసి ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగాడు. ఇన్‌స్పెక్టర్ నుదుటపట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకొంటున్నాడు.

"వెరీవెల్ ఇన్‌స్పెక్టర్! సుబ్బన్న స్టేట్‌మెంట్ నిజమో అబద్ధమో నిర్ణయించడానికి అతని భార్య సాక్ష్యం తప్ప వేరే సాక్ష్యం దొరకలేదంటారు" అడిగాడు సి జె.

"అవును. సుబ్బన్న భార్య సాక్ష్యం నమ్మదగినదిగా నేను భావించలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఓ.కె. అంటె కామాక్షి, ఆవిడ పాలేర్లు యిచ్చిన సాక్ష్యం సుబ్బన్న స్టేట్‌మెంట్‌కు విరుద్ధంగా వుంది కనుక అతని కథనం అబద్ధం అని తేల్చారు. అంతేనా?"

"అవును."

"వెరీగుడ్ ఇన్‌స్పెక్టర్! అయితే కామాక్షి తన గదిలో సుబ్బన్నను పాజిటివ్‌గా ఐడెంటిఫై చేసినట్లు చెపుతున్నారు. ఆవిడ గదిలో మనిషిని గుర్తుపట్టడానికి సరిపడా వెలుతురు వున్నట్లు ధృవపరుచుకొన్నారా....?" అడిగాడు సి.జె.

విసుగ్గా చూశాడు ఇన్‌స్పెక్టర్ "గదిలో చప్పుడయి మెలకువ రాగానే ఎవరని పిలిచాననీ, సమాధానం లేక పోయేప్పటికి హరికెన్ లాంతరు వత్తి పెద్దది చేశాననీ, ఆ వెలుతురులో సుబ్బన్న స్పష్టంగా కనబడ్డాడనీ శ్రీమతి కామాక్షి చెప్పింది."

"ఉహుఁ ఆ హరికెన్ లాంతరు మనిషిని గుర్తించగల వెలుతురు ఇవ్వగలదని మీరు ధృవపరచుకొన్నారా?"

ఇబ్బందిగా కదిలాడు ఇన్‌స్పెక్టర్. మళ్ళీ అతని నుదుట మీద చిరుచెమటలు ప్రారంభమయ్యాయి.

"హరికెన్ లాంతరు వెలుగుతో మనిషిని గుర్తుపట్ట వచ్చు" అన్నాడు సమాధానంగా.

"అయామ్ సారీ ఇన్‌స్పెక్టర్! నా ప్రశ్నకు సరిగా సమాధానం యివ్వడంలేదు మీరు. శ్రీమతి కామాక్షి ఆ రోజు వుపయోగించిన హరికెన్ లాంతరు మీరు పరీక్షించి, మనిషిని గుర్తుపట్టగల వెలుతురు ఆ లాంతరు ఇవ్వగలదని నిర్ణయించారా?" సూటిగా అడిగాడు సి.జె.

మాట్లాడలేదు ఇన్‌స్పెక్టర్.

"ఇన్‌స్పెక్టర్ ప్లీజ్ ఆన్సర్ మై క్వశ్చన్! ఆ హరికెన్ లాంతరు మీరు పరీక్షించారా?"

"లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గొంతు పెకల్చుగొని.

"వెల్ యువర్ ఆనర్. శ్రీమతి కామాక్షి ఉపయోగించిన హరికెన్ లాంతరును డిఫెన్స్ ఎగ్జామినేషన్ నిమిత్తమై కోర్టుకు అప్పగించవలసిందని ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు సి. జె. జడ్జి వైపు తిరిగి.

ప్రేక్షకుల్లో కలకలం బయలుదేరింది. పత్రికా విలేఖరులు చరచర వ్రాసుకుపోతున్నారు.

హరికెన్ లాంతరును రెండురోజుల్లో కోర్టుకు అందజేయవలసిందని ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాన్ని జారీ చేశాడు జడ్జి.

"ఎగ్జిబిట్‌ను దాఖలుచేసిన తరువాత సాక్షి క్రాస్‌ఎగ్జామినేషన్ కొనసాగించడానికి అనుమతివ్వవలసిందిగా కోరుతున్నాను...." అన్నాడు సి.జె.

కేసు మరుసటిరోజుకు వాయిదా పడింది.

4

"యువర్ ఆనర్! నిందితుడి ఐడెంటిఫికేషన్ విషయమై డిఫెన్స్‌వారు లేవనెత్తిన అభ్యంతరం దృష్ట్యా హరికెన్ లాంతరును ఎగ్జిబిట్ ఆఫ్ ఎవిడెన్స్‌గా ప్రవేశపెట్టడానికి ఇన్‌స్పెక్టర్‌ను మరొక్కసారి రీ ఎగ్జామినేషన్ చెయ్యడానికి అనుమతి కోరుతున్నాను...." అడిగాడు కలియుగమూర్తి.

"ఎనీ అబ్జక్షన్ మిస్టర్ పి.జె?" అడిగాడు జడ్జి సాంప్రదాయాన్ని అనుసరిస్తూ.

లేదని చెప్పాడు పి.జె.

ఇన్‌స్పెక్టర్ బోనెక్కి మళ్ళీ ప్రమాణం చేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎగ్జామినేషన్ మొదలుపెట్టాడు.

"ఇన్‌స్పెక్టర్! నా చేతిలోని హరికెన్ లాంతరును గుర్తుపట్టగలరా?" అడిగాడు కలియుగమూర్తి.

తల వూపాడు ఇన్‌స్పెక్టర్...."అది ఈ రోజు ఉదయం మీరు అందజేసినది. దాని టాంకుమీద నా ఇనిషియల్స్ మార్క్ చేశాను...." అన్నాడు—ఇన్‌స్పెక్టర్.

"రైట్! హత్య జరిగినరోజు రాత్రి సుబ్బన్నను గుర్తించడానికి శ్రీమతి కామాక్షి వుపయోగించిన లాంతరు ఇదేనని ధృవపరచుకొన్నారా?"—

"యస్....కోర్టు ఆదేశాల మేరకు నిన్న సాయంత్రం శ్రీమతి కామాక్షి గృహం నుండి ఆ లాంతరు స్వాధీనం చేసుకొన్నాను. ఆమె ఇంట్లో ఇది తప్ప మరో లాంతరు కూడా లేదని ధృవపరచుకొన్నాను. ఈ లాంతరు చాలా కాలంగా యింట్లో వుంటున్నదని శ్రీమతి కామాక్షి చెప్పారు...."

"వెరీగుడ్! ఈ లాంతరు ఇచ్చే వెలుతురులో మనిషిని గుర్తించవచ్చని నిర్ణయించారా?"

"యస్.... ఈ హరికెన్ లాంతరు యిచ్చే వెలుగులో మనిషిని స్పష్టంగా. ఖచ్చితంగా గుర్తించవచ్చు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్ కాన్ఫిడెంట్‌గా.

"యువర్ ఆనర్! ఎగ్జిబిట్ 'సి'గా ఈ హరికెన్ లాంతరు దాఖలు చేస్తున్నాను...." కోర్టువారికి లాంతరు అందజేస్తూ చెప్పాడు ప్రాసిక్యూటర్.... "డిఫెన్స్ క్రాస్ చేసుకోవచ్చు."

పి. జె. లేచి నిలబడ్డాడు. లాంతరును పరిశీలనగా చూశాడు కళ్ళజోడు వెనుక అతని కళ్ళు చిత్రంగా మెరిశాయి. లాంతరు పైనా క్రిందా మరోసారి చూసి జాగ్రత్తగా ముందుకు నడిచాడు.

"ఇన్‌స్పెక్టర్! శ్రీమతి కామాక్షి యింట్లో కేవలం ఈ ఒక్క లాంతరే వున్నదా? రాత్రులు అన్ని గదుల్లోనూ ఈ లాంతరే వుపయోగిస్తారా?" అడిగాడు పి. జె.

"లేదు—ఈ లాంతరు ఒక ఎమర్జెన్సీ లైటులాంటిది. శ్రీమతి కామాక్షి యింట్లో ఎలక్ట్రిక్ దీపాలు వున్నాయి. ఎప్పుడయినా కరెంట్ పోతే మాత్రం ఈ లాంతరు వెలిగించి వుపయోగిస్తారని ఆవిడ చెప్పారు. ఫిబ్రవరి నెలంతా రాత్రి పది గంటల తర్వాత వూరంతా కరెంట్ సప్లయి ఆఫ్ చేయడం నిజమేనని ఆ ప్రాంతపు ఎలక్ట్రిసిటీబోర్డు ఆపరేషన్స్ ఇంజనీరు కూడా ధృవపరిచారు...." చెప్పాడు ఇన్‌స్పెక్టర్ విజయవంతంగా.

"దట్సాల్ యువర్ ఆనర్!" పి. జె. క్రాస్ ఎగ్జామినేషను ముగించాడు.

తర్వాత ప్రాసిక్యూషన్ సాక్షిగా శవపరీక్ష చేసిన మెడి

కల్ ఆఫీసర్ సాక్ష్యమిచ్చాడు.

పి జె క్రాసు చెయ్యలేదు.

ప్రాసిక్యూషన్ మూడో సాక్షిగా శ్రీమతి కామాక్షి బోనెక్కి ప్రమాణం చేసింది.

జరిగిన సంఘటనలన్నీ క్షుణ్ణంగా, విపులంగా చెప్పించాడు కలియుగమూర్తి. జాగ్రత్తగా, తొట్రుపాటు లేకుండా చెప్పింది కామాక్షి. ఎదురు బోనులో నిలబడ్డ సుబ్బన్న గుండెల్లో కోపం కుంపటి మంటలా రాజుకో సాగింది.

కలియుగమూర్తి డైరెక్టు ఎగ్జామినేషను అయ్యాక క్రాస్ ఎగ్జామినేషను చెయ్యడానికి పి. జె. లేచి నిలబడ్డాడు.

ఓసారి కోర్టు హాలంతా మెల్లిగా కలియజూశాడు. ఓ మూల బెంచీలో పల్లీ, మరికొందరు బంధువులు దూరంగా చూడ్డం కనబడింది—మెల్లిగా కామాక్షి బోను దగ్గిరికి నడిచాడు.

"చూడండి కామాక్షిగారూ....ముద్దాయి సుబ్బన్న మీకెన్నాళ్ళుగా తెలుసు," అడిగాడు.

"రెండేళ్ళు!" అన్నది కామాక్షి.

"ఈ రెండేళ్ళలో అతను నిజాయితీ తప్పి ప్రవర్తించడంగాని, లేక అతన్లో దొంగబుద్ధి వున్నట్లుగాని మీ రెప్పుడయినా గమనించారా?"

ఒక్క క్షణం ఆలోచించి సమాధానం చెప్పింది కామాక్షి, "లేదు!"

"అతను మీ దగ్గర పాలేరుతనం మానేసినందుకు అతనిపై మీకు కోపం కలిగిందా?"

ఈసారి సందేహించలేదు కామాక్షి, "లేదు....కాని మంచి పనివాడు పోతున్నందుకు కాస్త బాధ పడ్డాను.

ఒళ్ళు దాచుకోకుండా పనిజేసేవాడు సుబ్బన్న...."

"మంచిదమ్మా — ఫిబ్రవరి ఇరవై రెండున మీరు సుబ్బన్నను తీసుకురమ్మని హతుడు వెంకటేశ్వర్లుతో కబురుపెట్టారా?"

"లేదు...."

ఒక్క క్షణం సాలోచనగా చూశాడు కామాక్షివైపు సి. జె. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలియుగమూర్తి పెదములపై చిన్న చిరునవ్వు మెదిలింది. మొదటిరోజు సి.జె. హడావిడి చూసి అతనికి కాస్త అనుమానం వచ్చింది కేసు జయాపజయాల గురించి. కాని ఈ రోజు కామాక్షి సాక్ష్యం తరువాత సుబ్బన్నకు శిక్ష పడడం ఖాయమనితేలిపోయింది. సుబ్బన్న తనగదిలో వుండడం స్పష్టంగా చూపినట్లు సాక్ష్యం చెప్పింది కామాక్షి.

ఎగ్జిబిట్ 'సి', హరికెన్ లాంతరు ఎడమచేత్తో జాగ్రత్తగా అందరికీ కనిపించేలా పట్టుకొని బోను ముందు నిలబడ్డాడు సి.జె.

"కామాక్షిగారూ....ఈ లాంతరు మీదేనా?"

"అవును. నిన్న సాయంత్రం పోలీసు ఇన్‌స్పెక్టర్ గారు దాన్ని స్వాధీనం చేసుకుని నాకు రసీదు ఇచ్చారు" చెప్పింది కామాక్షి.

లాంతరును జాగ్రత్తగా ఓసారి అటూ ఇటూ త్రిప్పి చూశాడు సి.జె.

"ఇది మీ లాంతరేనని ఖచ్చితంగా గుర్తుపట్టగలరా?" అడిగాడు.

"గుర్తుపట్టగలను. టాంకులోకి కిరసనాయిలు పోసే రంధ్రం దగ్గర చిన్న సొట్ట పడివుంటుంది. చిమ్నీ పైకి, క్రిందకు దించే లివర్ కాస్త వదులుగా వుంటుంది. అదీ

గాక నా ముందే లాంతరు పై భాగాన నిన్న ఎర్ర పెయింట్‌తో '×' గుర్తు పెట్టారు ఇన్‌స్పెక్టర్‌గారు" చెప్పింది కామాక్షి గబగబా. ఆమె ముఖములో రవంత గర్వం కనిపించింది పి.జె.కు.

"ఈ లాంతరు మీరు ఎంత కాలం క్రితం కొన్నారో చెప్పగలరా?" అడిగాడు పి జె.

కామాక్షి గుర్తుతెచ్చుకునేందుకు కనుబొమలు కాస్త చిట్లించింది. "రెండేళ్ళు పైబడిందనుకుంటాను. సుబ్బారాయుడి షష్ఠికి సంతలో కొన్నాను" చెప్పింది ఓ నిముషం తరువాత.

"అంటే ఈ లాంతరును చాలాకాలంగా మీరు ఉపయోగిస్తూ వున్నారన్నమాట."

"అవును" విసుగ్గా అంది కామాక్షి.

జడ్జి కూడా ఆశ్చర్యంగా చూస్తున్నాడు పి.జె. చాదస్తానికి.

"మరొక్కసారి గుర్తు చేసుకొని చెప్పండమ్మా. సుబ్బన్న మీ యింట్లో దొంగతనానికి వచ్చినరోజు మీ గదిలో వున్న లాంతరు యిదేనా?...."—అడిగాడు పి. జె.

"అవును. ఇదితప్ప మాఇంట్లో మరో లాంతరులేదు." గట్టిగా చెప్పింది కామాక్షి.

తల అడ్డంగా వూపాడు పి.జె. మెల్లిగా జడ్జివైపు తిరిగాడు.

"యువర్ ఆనర్! ఈ సాక్షి పూర్తిగా అబద్ధం చెపుతుందని నేను ఋజువు చెయ్యగలననుకొంటాను. దయతో ఈ హరికెన్ లాంతరు క్రిందిభాగాన్ని ఓసారి చూడగోర్తాను" లాంతరును జడ్జి ముందు వుంచాడు పి.జె.

హఠాత్తుగా కోర్టు హాలులో టెన్షన్ పెరిగింది. గ్యాలరీలో ప్రేక్షకుల్లో ఉత్సుకతవలన గుసగుసలు పెరిగాయి.

"ఆర్డర్ .... ఆర్డర్ ...." అరిచాడు జడ్జి.

కళ్ళజోడు సవరించుకొని హరికెన్ లాంతరు కిరసనాయిలు టాంకు అడుగు భాగాన్ని పరీక్షగా చూశాడు. అక్కడ ఆ మెటల్ టాంక్ మీద ఎంబోజ్ అయి లాంతరు ఉత్పత్తి వివరాలు వున్నాయి. బాచ్ నెంబరు, ఏ నెల, ఏ సంవత్సరంలో తయారయినది రేకుమీద ముద్రింపబడి వున్నాయి. మార్చి '82 అని స్పష్టంగా కనబడుతోంది. జడ్జి కనుబొమలు పైకిలేచాయి.

"యువర్ ఆనర్ .... వెంకటేశ్వర్లు హత్య పంతొమ్మిది వందల ఎనభై రెండు ఫిబ్రవరి ఇరవై రెండవ తారీఖున జరిగింది. కాని ఈ హరికెన్ లాంతరు మార్చి ఎనభై రెండులో తయారయినట్లు లాంతరుటాంకు అడుగుభాగాన ఫ్యాక్టరీలో మెటల్ ఎంబోజ్ చేయబడిన వివరాలు తెలుపుతున్నాయి. అంటే హత్య జరిగిననాటికి ఈ హరికెన్ లాంతరు అసలు యింకా తయారుకాబడలేదు మార్చిలో తయారయిన లాంతరు వెలుతుర్లో ఫిబ్రవరిలో నిందితుణ్ణి సాక్షి యెలా గుర్తించగలిగిందో అనూహ్యంగా వుంది" అన్నాడు పి. జె. కళ్ళజోడు తీసి కోటు పై జేబులో పెట్టుకొంటూ.

పబ్లిక్ప్రాసిక్యూటర్ కలియుగమూర్తి కంగారుగా లేచి జడ్జి దగ్గరకు పరుగెత్తాడు.

కోర్టుహాలులో ఒక్కసారి కలకలం రేగింది. సాక్షి బోనులో కామాక్షికి వణుకు ప్రారంభమయింది.

జడ్జి ప్రాసిక్యూటర్ వైపు తీవ్రంగా చూసి కోర్టు అరగంట వాయిదావేసి చాంబర్స్లోకి వెళ్ళిపోయారు.

5

ఆ రోజు సాయంత్రం సుబ్బన్న విడుదలయ్యాడని వేరే చెప్పనవసరం లేదు.

"అయితే డాడీ! సుబ్బన్న వెంకటేశ్వర్లుని చంపలేదా? అతని బాణాకర్ర దొరగారి తోపులో యెలా వుంది? వెంకటేశ్వర్లు యెలా చనిపోయాడు?" ఇవి లా మొదటి సంవత్సరం చదువుతోన్న సి.జె. పెద్ద కొడుక్కి కలిగిన సందేహాలు. ఐస్‌క్యూబ్స్ తేలియాడుతోన్న పీటర్‌స్కాట్‌ను చప్పరించి సిగరెట్ వెలిగించాడు సి.జె.

"ఈ దేశపు న్యాయవ్యవస్థ గొప్పదనం బలహీనత కూడా అదేరా.... హరికెన్‌లాంతరు కాంకొక్టెడ్ ఎవిడెన్స్ అని ఋజువవగానే కామాక్షి సాక్ష్యం పనికిరాదని తేలిపోయింది. ఆ రాత్రి సుబ్బన్నను పాజిటివ్‌గా గుర్తించడానికి కామాక్షికి తప్ప మిగతావాళ్ళకు అవకాశంలేదు. కనుక ఆమె సాక్ష్యం అబద్ధమని తేలిపోవడంతో ప్రాసిక్యూషన్ కథనం పేకమేడలా కూలిపోయింది. సుబ్బన్నను వదలిపెట్టక తప్పలేదు. క్రిమినల్ లాయర్‌గా నా డ్యూటీ అంతవరకే. వెంకటేశ్వర్లుని ఎవరు హత్యచేశారో నిరూపించవలసిన బాధ్యత పోలీసులది—మనది కాదు."

"అయితే సుబ్బన్న కథనమే కరెక్టయి వుండొచ్చన్నమాట. అలా అయినా అతనే వెంకటేశ్వర్లుని చంపాడని అనుకోవచ్చుగా?" అడిగాడు సుపుత్రుడు.

"సిల్లీ! సుబ్బన్న కథ అబద్ధమని పోలీసులు ముందు తేల్చిచెప్పారు. సాక్ష్యం లేదన్నారు. మళ్ళీ అతనిది కరెక్టు అని నిరూపించడం ఇంపాజిబుల్. పైగా వెంకటేశ్వర్లుని చంపడానికి సుబ్బన్నకు మోటివ్ లేదు. పోనీ ఆ కొట్లాటలో సుబ్బన్న కర్ర తగిలి వెంకటేశ్వర్లు మరణించాడనుకుంటే

సుబ్బన్న కథనం పోలీసులు నమ్మినట్లు అంగీకరించాలి. అలా అంగీకరిస్తే సుబ్బన్న ఆత్మరక్షణకు తిరగబడినట్లు అంగీకరించాలి. అయినా ఆ చీకట్లో ఎవరెవర్ని కొడుతున్నారో చూడడం, గుర్తించడం ఇంపాజిబుల్. సుబ్బన్నకు బెనిఫిటాఫ్ డౌట్ యెప్పుడూ వుంటుంది. అన్నాడు. పి.జె. స్కాచ్ మరో గుక్క పుచ్చుకొంటూ.

పి.జె.—లాజిక్ అర్థంకావడానికి సుపుత్రుడికి ఒక నిముషం పట్టింది.

"అయితే దొంగ సాక్ష్యం సృష్టించి కోర్టును తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించినందుకు కామాక్షిపై చర్యతీసుకోవద్దా?" అడిగాడు

"లిటిల్ పాసిబిలిటీ! మన జడ్జీలు చాలా జంటిల్మెన్! కామాక్షిని చిన్న మందలింపుతో వదిలారు. పోలీసులకు మెదడుంటే కామాక్షి దొంగసాక్ష్యం చెప్పడానికి కారణంతో మళ్ళీ దొంకంతా కదపొచ్చు" అన్నాడు పి.జె. గ్లాసు ఖాళీచేస్తూ. □

మీరు క్షమించాలి!

యమదూతలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"జోతీ! జ్యోతీ!" తలుపు తట్టారు కరుణాకర్.

తలుపు తెరచుకుంది. జ్యోతి నవ్వుతూ చూచింది.

కరుణాకర్ లోపలకు వచ్చాడు.

"శుభవార్త! ఈ రోజు పత్రిక చూశావా?" అన్నాడు కరుణాకర్.

"వచ్చింది కానీ చూచే తీరుబడి లేకుండా పోయింది."

ఆమె టేబులుమీది వార్తాపత్రిక అందుకుంది.

కరుణాకర్ చకచక నాలుగోపేజీ తిప్పాడు. పేజీకి ఒక ప్రక్క బాక్స్ కట్టిన ప్రకటన అచ్చయింది.

కరుణాకర్ మెరుస్తూన్న కళ్ళతో పైకి చదవసాగాడు.

"ఆహ్వానం.

రాజా రంగయ్యవర్మగారి ఆస్తికి వారసు లెవరైనా వుంటే క్రింద సంతకం చేసినవారిని వారం రోజులలోగా కలుసుకోవలసింది. స్విస్ బాంకులో వున్న రాజావారి ఫిక్సెడ్ డిపాజిట్లు ఈ వారంలో చెల్లింపులకు సిద్ధమవుతున్నాయి.

ప్రకాశరావు

దివాన్.

రాజారంగయ్యవర్మగారి ఎస్టేట్

రంగపూర్."

"మీ తాతయ్యగారి ఆస్తి యింకా స్విస్ బాంకులో వుందా? ఆశ్చర్యం! ఏనాటి తాతగారు? ఏనాటి ఆస్తి? రంగపూర్‌లో వున్న ఎస్టేట్ కూలిపోయి శిథిలమైపోతే?" అంది జ్యోతి.

కరుణాకర్ నవ్వి, "ఎస్టేట్ శిలథిలమైపోతే యేం? స్విస్ బాంకులో దాచుకున్న సంపద శిథిలంకాదు. నేను ప్రకాశరావును కలుస్తాను" అన్నాడు.

"నేను ఒంటరిగా యిక్కడ వుండలేను బాబూ! మీతో బాటే వస్తాను."

"జ్యోతీ! ప్లీజ్. నా మాట విను. వ్యవహారం జరిగే చోట నువ్వుంటే నాకు ఆటంకంగా వుంటుంది."

"ఎంత కాలంలో తిరిగివస్తారు?"

"అటూ యిటూ ప్రయాణమే రెండు రోజులు పడుతుంది. అక్కడొక రోజుగానీ రెండు రోజులుగానీ వుండవలసి వస్తుందేమో!"

"అయ్యబాబోయ్—నాలుగు రోజులే! నేను వుండలేను బాబూ!"

కరుణాకర్ ఆమెను చిరాకుగా చూశాడు. "జ్యోతీ! మీ అమ్మనూ, నాన్ననూ రప్పిస్తాను. నిన్ను ఒంటరిగా వుంచుతానని ఎలా అనుకున్నావు?" అన్నాడు.

జ్యోతి యిక మాట్లాడలేదు. కరుణాకర్ ఒక నిర్ణయానికి రానేరాడు. వస్తే మాత్రం ఆగడు.

జ్యోతికి పెళ్ళయి ఏడాదయింది. కరుణాకర్‌ను ఆమె యింతవరకూ విడిచి వుండలేదు. తలిదండ్రులు తనకు తోడు వస్తారంటే ఆమెకు కొంత వుపశమనం చిక్కినట్టయింది.

కరుణాకర్ టెలిఫోన్ చేయసాగాడు. ట్రంక్‌కాల్ సులువుగానే దొరికింది.

అవతల శాంతయ్య ఫోన్‌లో దొరికాడు.

"మామయ్యా! మీరూ అత్తయ్యా కలిసి రేపు మా యింటికి రండి" అన్నాడు కరుణాకర్.

"ఇప్పుడా? పంట చేతికి అందివచ్చే సమయం! మీ అత్తయ్యను పంపిస్తానులే!" అన్నాడు శాంతయ్య.

జ్యోతి చటుక్కున రిసీవర్ లాక్కుంది.

2

జ్యోతి ఆత్రుతగా గుమ్మంలో కదులుతోంది. నడవాలో పచార్లు చేస్తున్నాడు శాంతయ్య. ముసలి వయస్సు! అనుకోని కష్టం. చెమటలు కక్కుతున్నాడు శాంతయ్య.

జ్యోతి తల్లి గుమ్మంలో చతికిలపడి కూర్చుంది ఆమె తనలో తానే గొణుక్కుంటోంది.

"అయిదు రోజులయింది. అల్లుడు యింతవరకూ వుత్తరం రాయడం కానీ, ఫోన్ చేయడం కానీ, తన క్షేమాన్ని భార్యకయినా తెలియపరచడం కానీ చేయలేదు. అల్లుడు రంగపూర్ క్షేమంగా చేరుకున్నాడా? ఎందుకు యింతవరకూ తిరిగిరాలేదు?" అన్నాడు శాంతయ్య.

వీరభద్రమ్మ మాట్లాడలేదు. గుడ్ల నీరు కుక్కుకుంటోంది.

జ్యోతి దీనంగా తండ్రిమొహం చూచింది.

"నాన్నగారూ! మీరొకసారి రంగపూర్ వెళ్ళి రాకూడదా?" అంది జ్యోతి.

శాంతయ్య తలూపాడు.

"మీ రొక్కరే వెళ్ళి ఏం చేస్తారు? ఎవరినయినా తోడు తీసుకువెళ్ళండి!" అంద వీరభద్రమ్మ.

"ఇంకా మనకు ఎవరున్నారు? కోరితే పోలీసుల సహాయం కోరాలి"

"అక్కడ ఏం జరిగిందో మనకు తెలియదు. పోలీసుల సహాయం కోరి అభాసుపాలవుతామేమో!"

తల్లీ, కూతురూ, తండ్రీ ఆలోచనలోపడ్డారు.

పోస్ట్‌మాన్ యింటిముందు సైకిల్ ఆపాడు. జ్యోతి కళ్ళలో వెలుగు కనిపించింది. చటుక్కున గుమ్మం దిగి సైకిలు వద్ద పరుగెత్తింది. పోస్ట్‌మాన్ ఆమె చేతిలో ఎర్రటి కవర్ వుంచి సైకిల్ ఎక్కి వెళ్ళిపోయాడు.

కవరును జ్యోతి పరకాయించి చూచింది. కవర్‌మీద శ్రీమతి జ్యోతి అని రాసి యింటి అడ్రసు రాసివుంది. కవర్ రాసినవారి అడ్రసు లేదు.

శాంతయ్యా, వీరభద్రమ్మా ఆమెను సమీపించారు.

జ్యోతి కవర్ చింపి తెల్లటి కాగితం తీసింది.

"జ్యోతీ!

నీ భర్త మా వద్ద క్షేమంగా వున్నాడు. అతడిని అలాగే క్షేమంగా ఒప్పచెప్పాలంటే అయిదు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. ఎక్కడ ఎలా అందించాలో తరువాత రాస్తాం. మీ యింటిమీద నిఘా వుంచాం. పిచ్చివేషాలు వెయ్యక! కరుణాకర్‌ను విడివిడి భాగాలుగా అందించవలసి వస్తుంది.

యమదూతలు."

చదివాక, జ్యోతి చేతిలోంచి కవరూ కాగితమూ జారి పడ్డాయి.

వీరభద్రమ్మ భోరున ఏడుస్తూ కూర్చుంది.

శాంతయ్య కొన్ని నిమిషాలపాటు నిశ్చేష్టుడైపోయి సులువుగానే తేరుకున్నాడు. అయిదు లక్షలు యమదూతల మొహాన కొడితే చాలు, తన అల్లుడు క్షేమంగా తిరిగి వస్తాడు. పోతే పోతుంది ఆస్తి! అయిదు లక్షలు పోయినమాత్రాన తాను కానీ అల్లుడు కానీ బికారులయిపోరు. కాని అంతటితో యమదూతలు తృప్తిపడతారా?

కూతురు అతడి భుజంపట్టి కుదపడంతో శాంతయ్య స్పృహలోకి వచ్చాడు.

"ఎవరో మన యింటివైపే చూస్తున్నారు" అంది జ్యోతి.

శాంతయ్య అటు తలతిప్పాడు.

అతడెవరో తలత్రిప్పి అటు తిరిగిపోయాడు.

"ఎవరో తెలుసుకునిరానా?" అన్నాడు శాంతయ్య.

"వద్దు. ఇంట్లోకి పోదాం. లోపల ఆలోచించుకుందాం?"

అంది వీరభద్రమ్మ.

ముగ్గురూ యింట్లోకి వెళ్ళిపోయారు.

"యమదూతలకు అయిదు లక్షలు చెల్లించినంత మాత్రాన వాళ్ళకు తృప్తి కలుగుతుందని అనుకోలేం" అన్నాడు శాంతయ్య.

"మీ ఆలోచనేమిటి?" అంది జ్యోతి.

"మనం ఏదో ఒక రకంగా పోలీసుల రక్షణ కోరితే మంచిదేమో!"

వీరభద్రమ్మ తిరిగి శోకం తీసింది.

శాంతయ్య ఆమెను చిరాకుగా చూచి, "ఆలోచన తోచ కుండా నీ ఏడుపేమిటే?" అన్నాడు.

వీరభద్రమ్మ శోకం ఆపి, "పోలీసుల జోక్యం చేసు కుంటే అల్లుడి ప్రాణానికే మోసం! యమదూతలు హెచ్చ రించారు కదా!" అంది.

ఇంట్లో స్మశాన నిశ్శబ్దం అలుముకుంది.

ఆ రాత్రికి ముగ్గురూ పేరుకు మాత్రం ఎంగిలిపడ్డారు. వీరభద్రమ్మా, జ్యోతీ ఏడుస్తూ మంచాలమీద వాలారు. శాంతయ్య తన గదిలో పచార్లు మొదలుపెట్టాడు.

ఆడవాళ్ళు కొద్దిసేపట్లోనే నిద్రకుపడ్డారు. శాంతయ్య వాళ్ళ విషయం నిర్ధారణ చేసుకుని పెరటిదారిలోంచి బయట పడ్డాడు. రోడ్డు నిర్జనంగా వుంది. ఎలక్ట్రిక్ దీపం తన మానాన తాను వెలుగు చూపిస్తోంది.

శాంతయ్య ఎలక్ట్రిక్ స్తంభం దాటబోయాడు.

"ఎక్కడికి?"

శాంతయ్య వులిక్కిపడి ప్రక్కకు చూశాడు. స్తంభం చాటున నీడలాగా మనిషి!

"....ఎ....వ....రు....?" శాంతయ్య వణికాడు.

"యమదూత."

శాంతయ్య యిక ప్రశ్నించవలసిన అగత్యం లేకుండా పోయింది. భయం భయంగా చూచి వెనక్కి తిరిగాడు. వెలుగుకు అడ్డంగా పొడవుపాటి చారలాగా నీడ అతడి ముందు పడింది.

శాంతయ్య తలుపు తెరుచుకుని యింట్లోకి పరుగెత్తాడు. పెరటిగుమ్మం మూసి తలుపులకు చేరగిలపడి వూపిరి తీసుకున్నాడు. తమ యింటికి యమదూతలు కాపలావున్నారు. తాను బయట పడలేడు. కాని బయటపడాలి. ఎలా?

యమదూతలను పట్టుకోగలగాలి. అదే సమయంలో తన అల్లుడిని ప్రాణాలతో దక్కించుకోగలగాలి.

శాంతయ్య ఆడవాళ్ళు పడుకున్న గదిముందు నిలబడ్డాడు.

ఆడవాళ్ళు కదులుతున్నారు. వాళ్ళకు మెలకువ వచ్చి వుండాలి.

"అమ్మా, జ్యోతీ!" అన్నాడు శాంతయ్య.

జ్యోతి లేచి యివతలకు వచ్చింది.

3

పనిమనిషి అంట్లు తోమింది. వాకిలి వూడ్చి నీళ్ళు చిమ్మింది. పెరట్లో మొక్కలకు పాదులుచేసి గెత్తంవేసింది. వాకిట్లో నిలబడి "అమ్మా! ఎల్లొస్త!" అంది.

శాంతయ్య ఆమెవైపు తడిసిన కళ్ళతో చూస్తున్నాడు. పనిమనిషి తడిచేతులు చీరకొంగుతో తుడుచుకుంటూ రోడ్డెక్కింది. తల వొంచుకుని నడుస్తోంది. రోడ్డుకి అవతల ప్రక్క కారు ఆగివుంది.

పనిమనిషి క్రీగంట కారును గమనించింది. తరువాత తనకు ఏమీ పట్టనట్టుగా ముందుకు సాగిపోయింది. కారు

ఇంకా అక్కడే వుంది. పనిమనిషి రోడ్డు మలుపు తిరిగి ఆగి వెనక్కి చూచింది. తనను యెవరూ అనుమానించడం లేదు.

పనిమనిషి అటూ యిటూ చూచి దారినపోయే ఖాళీ టాక్సీని ఆపింది. టాక్సీ డిటెక్టివ్ శిరీష్ ఇంటి ముందాగింది. బాడుగ చెల్లించి ఆమె యింటి గుమ్మం ముందు నిలబడింది. కాలింగ్‌బెల్ నొక్కింది.

తలుపు తెరుచుకుంది. డిటెక్టివ్ శిరీష్ పలకరింపుగా చూచి "ఏం కావాలమ్మా?" అన్నాడు.

ఆమె చేతులు జోడించి, "మా నాన్నగారు శాంతయ్య మీకు తెలుసునట. నా భర్త రంగపూర్ వెళ్ళి నాలుగు రోజులయింది. ఇంతవరకూ రాలేదు" అంది.

"అలాగా అమ్మా, నీ పేరు జ్యోతి కదూ!" అన్నాడు శిరీష్.

ఆమె తలూపింది.

"ఏమిటీ వేషం?"

"మా యింటి ముందు శత్రువుల నిఘావుంది. అందుకే యిలా మారువేషంలో వచ్చాను."

శిరీష్ లోపలకు దారి యిచ్చాడు. ఆమె కన్‌సల్టింగ్ రూంలో కూర్చుంది. బల్లకి అవతల రివాల్వింగ్ కుర్చీలో శిరీష్ కూర్చున్నాడు. జ్యోతి అంతవరకూ జరిగిన సంఘటనలను పూసగుచ్చినట్టుగా చెప్పింది.

"కరుణాకర్‌గారు రంగపూర్ వెళ్ళి తిరిగిరాలేదు. కేవలం వారసత్వపుటాస్తి కోసం వెళ్ళారని చెప్పగలవా?"

"అవునండి. పత్రికలో ప్రకటన పడ్డాకనే ఆయన చూచి వెళ్ళారు."

"ఏ రోజు పత్రికో చెప్పగలవా?"

జ్యోతి చెప్పింది. శిరీష్ పత్రికల వరుసల్లోంచి ఆ రోజు నాటి స్థానిక దినపత్రిక తీశాడు. రంగపూర్ దివాన్ ప్రకటన చదివాడు.

"స్విస్ బాంకులో వున్న నిధులేమిటి? ఇవి యిప్పుడు చెల్లింపులకు రావడం ఏమిటి? ఇంతకాలమూ వాటి విషయంలో కరుణాకర్ ఏమీ చెప్పలేదా?"

"చెప్పలేదు. రంగపూర్ ఎస్టేట్ నుండి వారసత్వంగా రావలసిందేదో వారికి రానే వచ్చింది. ఇక పాడుపడి పోయిన రంగపూర్ ఎస్టేట్ నుండి మా వారు ఏమీ ఆశించ లేదు. స్విస్ బాంకు నిధుల సంగతి ఆయనకు తెలిసి వుండదు."

"దివాన్ ప్రకాశరావు నీకు తెలుసా?"

"ఆయనతో నాకు ముఖపరిచయం లేదు."

"ఇప్పుడు నీకు నా వల్ల జరగవలసిన సహకారం ఏమిటో చెప్పు జ్యోతీ!"

జ్యోతి తడబడింది. "మీరు రంగపూర్ వెళ్ళిరాగలరా?" అంది.

"శత్రువులు యిక్కడ మీ యింటిమీద నిఘావేశారు. నేను రంగపూర్ వెళ్ళిరావడంవలన ప్రయోజనం ఏమిటి?"

"మా వారిని శత్రువులు నిజంగానే అపహరించారా? దివాన్ ప్రకాశరావుకు యీ అపహరణతో ఎంతవరకూ సంబంధం వుంది? శత్రువులకు వాళ్ళు కోరినట్టుగా అయిదు లక్షల రూపాయలు యిచ్చేస్తే మా వారిని వదులుతారా? కేవలం అయిదులక్షల రూపాయలకోసమే యిలా నాటక మాడారా? ఇంకా యింతకుమించిన కుట్ర ఏమైనా అసలు జరుగుతుందా? ఈ విషయాలు తెలుసుకోవాలి."

శిరీష్ తలూపి, "మంచిది. చాల దూరం ఆలోచించావు. భవిష్యత్తులో ఇలాంటి కుతంత్రం మరల జరగకూడదు" అన్నాడు.

"అవునండి. మా నాన్నగారు కూడా అలాగే అన్నారు."

"ఈ లోపుగా యిక్కడ శత్రువులతో మీరు సరిపెట్టుకు రాగలరా?"

"సరిపెట్టుకురాగలమనుకుంటానండి. మాకు అపకారం చేసేవాళ్ళయితే, ఎలాంటి రక్షణాలేకుండా వున్నవాళ్ళం. ఇంట్లో చొరబడి డబ్బు ఎత్తుకుపోవచ్చును. మమ్మల్ని ముగ్గుర్నీ గాయపరచవచ్చును. అలాంటి ప్రయత్నమేదీ జరగలేదు. అంతేకాదు. రాత్రి నాన్నగారు పెరటిగుమ్మం లోంచి బయటపడి మిమ్మల్ని కలుసుకోవా లనుకున్నారు. అప్పుడు శత్రువులు కనిపెట్టి కూడా మందలించి యింట్లోకి త్రిప్పిపంపేశారు."

"నేను నీ కోరిక ప్రకారమే రంగపూర్ వెళ్ళివస్తాను. ఇక్కడ మఫ్టీలో పోలీసుబలగాన్ని కాపలా వుండేలాగా ఏర్పాటు చేస్తాను."

జ్యోతి చేతులు జోడించింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఫరవాలేదు జ్యోతీ! కరుణాకర్‌ను భద్రంగా తీసుకు వచ్చి నీకు ఒప్పచెబుతాను. నన్ను నమ్ము."

"థ్యాంక్స్ సార్! మీమీద నాకు పూర్తి నమ్మకం వుంది."

జ్యోతి లేచింది.

"కరుణాకర్ ఫోటో వుందా?"

జ్యోతి పమిటచాటు నుండి కవర్ తీసి అందించింది.

4

"ఆశ్చర్యంగా వుంది. కరుణాకర్ ఇక్కడికి వచ్చాడా?" అన్నాడు ప్రకాశరావు.

డిటెక్టివ్ శిరీష్ అతడిని పరిశీలనగా చూశాడు. ప్రకాశరావుకు అరవై ఏళ్ళుంటాయి. శరీరం సన్నగా ఉక్కు కడ్డీలాగా వుంది. గ్లాస్కోపంచె మీద పెద్దాపురం శిల్కు చొక్కా వేసుకున్నాడు. వ్రేళ్ళకు వుంగరాలూ, కాళ్ళకు పల్చటి తోలు చెప్పులూ ప్రక్కపాపిట తీశాడు.

శిరీష్ మందహాసం చేశాడు.

"కరుణాకర్ యిక్కడ దిగినట్టు నాకు రూఢిగా తెలిసింది" అన్నాడు.

ప్రకాశరావు చురుకుగా చూచి, "రంగపూర్‌లో అడుగు పెట్టివుండవచ్చు. నన్ను కలిసివుండకపోవచ్చు కదా!" అన్నాడు.

"అవును."

"కరుణాకర్ మీకేమవుతాడు?"

"స్నేహితుడు. అతడూ నేనూ కలసి ఒక వ్యాపారంలో వాటా కొందామనుకున్నాం."

"అలాగా, ఏమిటా వ్యాపారం?"

శిరీష్ చెప్పలేదు. పెదిమలు చప్పరించి వూరుకున్నాడు.

"కరుణాకర్ నన్ను కలుసుకొనకుండా ఏమవుతాడు?" అడిగాడు ప్రకాశరావు.

"ఆ ప్రశ్న నేను వేయవలసింది!"

"కావచ్చును."

"స్విస్ బాంకునుండి ఏమాత్రం సొమ్ము చెల్లింపులకు వచ్చింది?"

"స్విస్ బాంకా? సొమ్మా? ఏ విషయం గురించి

మాట్లాడుతున్నారు?"

శిరీష్ నుదురు చిట్లించాడు. జేబులోంచి పేపర్ కటింగ్ తీసి చూపించాడు.

"నాన్సెన్స్! ఈ ప్రకటన నేనివ్వలేదు" అరిచినంత పనిచేశాడు ప్రకాశరావు.

"మీ పేరుమీద మరెవరైనా యీ ప్రకటన యిచ్చి వుంటారా?"

"ఇలాంటి తలా తోకాలేని ప్రకటనలివ్వడానికి యెవరి కయినా డబ్బు పులిసిపోయివుండాలి!"

"ప్రకాశరావుగారూ! మీ ఎస్టేట్ ఒకసారి చూడాలి."

ప్రకాశరావు వ్యంగ్యంగా నవ్వి, "మా ఎస్టేటా? గొప్ప మాట సెలవిచ్చారు. రాజా రంగయ్యగారి ఎస్టేట్. అయినా యిప్పుడు అక్కడేం వుంది? కూలిపోవడానికి సిద్ధంగా వుంది" అన్నాడు.

శిరీష్ కూడా నవ్వి, "ఒకప్పటి చరిత్రకు సాక్ష్యం మీరు పనిచేసిన ఎస్టేట్. చూచి వెళ్ళిపోవడానికి మీకు అభ్యంతరం లేదు కదా!" అన్నాడు.

ప్రకాశరావు లేచాడు "పదండి!" అన్నాడు.

ఇద్దరూ యింట్లోంచి బయటపడ్డారు. గుమ్మం వద్దనే నిలబడిపోయివున్న నౌకరు వాళ్ళను వెంబడించాడు.

ప్రకాశరావు యింటికి అరమైలు దూరంలో వుంది ఎస్టేట్. పాతకాలంనాటి భవనాలూ, వాటిని చుట్టి వస్తోన్న నల్లటి రాతిగోడా. పుచ్చిపోయి శిథిలమైపోతోన్న చెక్కా పనితనమూ కూలిపోతోన్న రాజా రంగయ్యవర్మగారి వైభవానికి నిరూపణలుగా మిగిలాయి.

సింహద్వారంలోంచి ముగ్గురూ లోపలకు నడిచారు. వాతావరణ పరిస్థితులకు లొంగిపోయిన కట్టడాలు కొన్ని

ప్రక్కకు ఒరిగిపోతున్నాయి. పగిలిన గోడలలోంచి రాళ్ళు వికృతంగా చూస్తున్నాయి. ముగ్గురూ విశాలమైన భవనంలో అడుగుపెట్టారు.

గబ్బిలాలు అసహ్యంగా వాళ్ళను రాచుకుంటూ బయటకు పారిపోయాయి. గోడలు చెదలుపట్టి వున్నాయి సాలెగూళ్ళు ఛేదించుకుంటూ లోపలికి నడిచాడు శిరీష్. భవనమంతా సాలెగూళ్ళే!

ప్రకాశరావు మెయిన్ హాలులో ఆగిపోయాడు. నౌకరును మాత్రం శిరీష్ వెంట పంపించాడు.

భవనంలోకి ప్రక్కనుండి కూడా రావడానికి దారులున్నాయి. వాటికి తలుపులు మూసివున్నాయి. పైన అమర్చిన వెంటిలేటర్స్‌లోంచి వెలుగు పడుతోంది.

తలుపులకు సాలెగూళ్ళు లేవు. నేలవైపు చూశాడు శిరీష్.

భవనం మొత్తం చుట్టివచ్చి మెయిన్ హాలులో నిలబడ్డాడు శిరీష్.

బట్టలనిండా సాలెగూళ్లు అంటివున్నాయి.

ప్రకాశరావు నవ్వి, "మీ ఆకారం వింతగా వుంది!" అన్నాడు.

శిరీష్ నవ్వి వూరుకున్నాడు.

"ఇక వెళ్దామా!" అన్నాడు ప్రకాశరావు.

శిరీష్ బయటికి దారితీశాడు.

"ఈ రోజు రంగపూర్‌లో ఆగండి! మా ఆతిథ్యం స్వీకరించండి!"

"సారీ ప్రకాశరావుగారూ! కరుణాకర్‌ను వెతుక్కోవాలి."

"ఆల్‌రైట్ మీ యిష్టం!"

డిటెక్టివ్ శిరీష్ అతడి వద్ద సెలవు పుచ్చుకొని లాడ్జికి తిరిగివచ్చాడు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కి డయల్ చేసి వైజాగ్‌కి ట్రంక్ కాల్ బుక్ చేశాడు.

పావుగంటలో కాల్ అందింది.

"సారధీ!" అన్నాడు శిరీష్.

"సార్! కరుణాకర్ దొరికాడా?" అన్నాడు అసిస్టెంట్ సారధి.

"ఇంకా దొరకలేదు సారధీ! స్థానిక దినపత్రికలో ఆ ప్రకటన ఎవరిచ్చారో, డబ్బు ఎలా ముట్టిందో దర్యాప్తు చెయ్యి. చాలాముఖ్యం. ప్రకటన ఇచ్చినవారి సంతకం సేకరించు."

"అలాగే సార్. మీకు లాడ్జికి ఫోన్ చేయనా?"

"వద్దు. రాత్రి తొమ్మిదింటికి నేనే ఫోన్ చేస్తాను. ఫోన్ వద్దనే వేచివుండు."

"ఎస్ సార్!"

"జ్యోతి విషయంలో చెప్పవలసిందేమీ లేదు కదా!"

"లేదు సార్!"

శిరీష్ రిసీవర్ పెట్టేశాడు.

5

డిటెక్టివ్ శిరీష్ పల్లెటూరి రైతులాగా వేషం వేసుకున్నాడు. గూడకట్టు పంచెమీద చేతుల బనీను తొడిగాడు. చెవిలో కలింపాటి చుట్ట యిరుక్కొని వుంది. గుబురు జుత్తు, బుర్ర మీసాలు, కిర్రు చెప్పులు! చిన్న సంచి!

శిరీష్ మట్టూ చూచి పొలాలకు అడ్డంపడ్డాడు. మధ్య మధ్య వెనక్కి తిరిగిచూస్తూ తనని ఎవరూ—అనుసరించడంలేదని నిర్ధారణ చేసుకున్నాడు. గంటసేపుపాటు నడిచాడు.

దూరంగా రంగపూర్ ఎస్టేట్ కనిపిస్తోంది. ఎస్టేట్ చుట్టుప్రక్కల నిర్జనంగా వుంది. అస్తమిస్తున్న సూర్య కాంతి పేలవంగా ఎస్టేట్ భవనాలమీద పడుతోంది. శిరీష చెట్టుచాటున ఆగాడు.

సంచి తడుముకున్నాడు. బాటరీలైటూ, పిస్తోలూ, ముక్కలరొట్టె, మంచినీళ్ళసీసా తగిలాయి. వాటిప్రక్క కొవ్వొత్తుల పాకెట్టువుంది. బనీనుజేబులో అగ్గిపెట్టెవుంది.

కనుచీకటి పడుతోంది. నిర్జనమైన ప్రాంతంలో గుడ్ల గూబలు అరుస్తున్నాయి. ఎక్కడో నక్కలు వూళ వేస్తు న్నాయి. ఎస్టేట్ భవనాలు చీకట్లో మునిగిపోతున్నాయి. శిరీష్ చెట్టు చాటునుండి ముందుకు కదిలాడు.

సింహద్వారంలోంచి ముందుకు నడిచాడు. భవనం తలుపు మెల్లిగా తెరచాడు. తలుపు తెరచుకుంటున్న చప్పుడు తప్ప యెక్కడా యెలాంటి అలికిడి లేదు. మెయిన్ హాలులో ప్రవేశించి తలుపు మూశాడు. నల్లటి చిక్కటి చీకటి! చీకటిలో ఒక ముఖ్య భాగంలా శిరీష్ రెండు నిమిషాలపాటు కదలకుండా నిలబడ్డాడు.

బాటరీలైటు వెలిగించాడు శిరీష్. వెలుగు వలయం మెయిన్ హాలులో తిరుగుతోంది. ప్రక్క గుమ్మంవద్ద ఆగాడు. తరువాత లోపలికివెళ్ళి ప్రక్క దారిలో ఆగాడు.

అక్కడ సాలెగూళ్ళు యెందుకు తెగివున్నాయి? మెయిన్ హాలులోనూ, ఇతర గదులలోనూ సాలెగూళ్ళు తెగి లేవు. కేవలం లోపలి గదిప్రక్క గుమ్మంవద్ద మాత్రమే తెగి వున్నాయి. అంటే ఆ దారిని ఎవరో వుపయోగించుకుంటూ వుండివుండాలి.

తెగి పడివున్న సాలెగూళ్ళు తణిఖీ చేశాడు శిరీష్. సాలె గూళ్ళు తెగి పడివుండటమే కాదు, గుమ్మంమీద ఎర్రటి,

పసుపు పచ్చటి మరకలయాయి. ఆ మచ్చలేమిటో సులువుగా వూహించగలిగాడు శిరీష్. బ్యాటరీలైటు వెలుగులో నేలమీద అన్నం మెతుకులు కనిపించాయి. ఉదయం ప్రకాశరావుతో వచ్చినపుడు కనిపించినవవే. వంగి మెతుకు లేరబోయాడు. అతడి ఒళ్ళు జలదరించింది.

తలుపు అవతల చప్పుడయింది. నేలమీద లోహపు పాత్ర వుంచినట్టు చప్పుడయింది. గొళ్ళెం తెరచుకుంటోంది. శిరీష్ చటుక్కున బ్యాటరీ లైటు ఆర్పాడు. అడుగుల చప్పుడు కాకుండా ప్రక్క హాలులోకి నడిచాడు.

తలుపు తెరచుకున్నట్టు చప్పుడయింది. శిరీష్ గుమ్మం చాటునుండి చూడసాగాడు.

ఎవరో వ్యక్తి లోపలకు ప్రవేశించాడు. అతడి చేతిలో చిన్నసైజు హరికేన్ లాంతర్ వెలుగుతోంది. శిరీష్ అతడిని గుర్తుపట్టాడు. ప్రకాశరావు వెంట బయల్దేరి వచ్చిన నౌకరు. మరో చేతిలో స్టీలు కారియర్ వుంది.

నౌకరు లోపలకు వచ్చాడు. తలుపు మూశాడు. తరువాత లోపలి గదిలోకి నడిచాడు. గది గోడవద్ద ఆగాడు. గోడ మూలలో క్రింద చేతితో తడిమాడు.

డిటెక్టివ్ శిరీష్ గుడ్లప్పగించి చూడసాగాడు.

గోడలో నలుచదరంగా ముక్క ప్రక్కకు తప్పుకుంది. నౌకరు గోడకు అవతలకు వెళ్ళాడు. హరికెన్ లాంతర్ వెలుగు క్రమంగా చీకట్లో కలిసిపోయింది.

డిటెక్టివ్ శిరీష్ ఓపికగా కాచుకున్నాడు.

ఇరవై నిమిషాల తర్వాత క్రమంగా వెలుగు ప్రత్యక్షమయింది. నౌకరు స్టీలు కారియర్‌తోనూ, హరికెన్‌లాంతరుతోనూ గోడ యివతలకు వచ్చాడు. గోడమూల తడిమి నలుచదరంముక్క మూసేశాడు. తరువాత వచ్చినవాడు

వచ్చినట్టే గుమ్మంలోంచి బయటపడ్డాడు.

శిరీష్ చెవులోరగా వుంచి అడుగుల చప్పుడు వినసాగాడు. చప్పుడు క్రమంగా దూరమయింది.

గోడలో నలుచదరపుమక్కను తప్పించి శిరీష్ అటు నడిచాడు. క్రిందకు మెట్లున్నాయి. శిరీష్ మెట్లు దిగాడు. విశాలమైన హాలు ఎదురయింది. అక్కడక్కడా కొవ్వొత్తులు వెలిగించి పెట్టారు.

బాటరీలైటు కాంతిని హాలులో అంతటా పడేలాగా తిప్పాడు. హాలులో రెండు కుర్చీలున్నాయి. రెండుకుర్చీలలో యిద్దరు కూర్చున్నారు. వాళ్ళను రెక్కలు విరచి కుర్చీలో వెనక్కి కట్టేశారు. ఇద్దరికీ నోటికి ప్లాస్టరంటించి వుంది.

కరుణాకర్‌ను గుర్తుపట్టాడు శిరీష్. అతడి ప్లాస్టర్ తప్పించాడు. కరుణాకర్ బొంగురు గొంతుతో అడిగాడు.

"ఎవరు మీరు?"

"స్నేహితుడిని. ఈయన దివాన్ ప్రకాశరావు కదూ!" అన్నాడు శిరీష్.

6

జ్యోతి టెలిఫోనులోకి పిచ్చెత్తినదానిలాగా చూస్తోంది.

"నాకు తెలుసు. నువు పోలీసులకు యెలా సమాచారం యివ్వగలిగావో...." అంటున్నాడు అవతలి వ్యక్తి.

"ఎలా యిచ్చాను? యేమిటి మీ రనేదేమిటి?" అరిచింది జ్యోతి.

"బుకాయించక. డిటెక్టివ్ శిరీష్‌ను రంగపూర్ పంపించావు. కరుణాకర్ అమాకీ అతడివల్ల యేం తెలుస్తుంది? తెల్లవారేసరికి అయిదులక్షల రూపాయలు బ్రీఫ్‌కేస్‌లో సర్ది వుంచు. మా మనిషి మీ యింటికి వస్తాడు.

" 'కరుణాకర్ క్షేమం!' అంటాడు. బ్రీఫ్‌కేస్ అతడి

కిచ్చెయ్యి. కరుణాకర్ సాయంకాలానికల్లా యింట్లో వుంటాడు. నువు ఏ మాత్రం అతితెలివి చూపించినా కరుణాకర్ శవం మాత్రమే సాయంకాలానికి యింటికి చేరుకుంటుంది" అన్నాడు అవతలి వ్యక్తి.

జ్యోతికి గుండె లవిసిపోయాయి. "అయిదులక్షలా? రాత్రికి రాత్రి ఎక్కడినుండి వస్తాయి?" అంది. "ప్లీజ్.... యింకా గడువు కావాలి!"

"వీల్లేదు. మీ నాన్నను రాత్రి సర్వీసు వున్న గుడ్ విల్ బాంక్ కి పంపించు. అక్కడ నీకు సేవింగ్స్ బాంక్ అక్కౌంట్లో ఆరులక్షల డెబ్భైవేలున్నాయని మాకు తెలుసు."

జ్యోతి మాట్లాడలేక పోయింది.

అవతల క్లిక్ మంది. జ్యోతి తన చేతిలోని రిసీవర్ ను క్రెడిల్ చేయబోతూ బయటికినడిచింది. మధ్యాహ్నం నుండి యింటికి కాపలా లేదు. సాయంకాలం ఆరున్నరవుతోంది. బాంకింగ్ సర్వీసు మరో గంటన్నరపాటు మాత్రమే వుంటుంది. ఈలోపునే తండ్రితో కలసి వెళ్ళి అయిదు లక్షలు విత్ డ్రాచేసి తీసుకురావాలి.

సోఫాలో తల పట్టుకుని కూర్చున్నాడు శాంతయ్య. కూతురు అతడిని సమీపించింది.

"విన్నాను తల్లీ! విత్ డ్రాచేసి తీసుకువస్తాను. కాగితం రాపియివ్వు" అన్నాడు శాంతయ్య.

జ్యోతి విత్ డ్రా స్లిప్ నింపుతూండగా టెలిఫోను గణ గణ లాడింది. జ్యోతి రోడ్డుమీదకు ఒకసారి చూచి రిసీవ రందుకుంది.

"జ్యోతిగారూ! నేను సారధిని మాట్లాడుతున్నాను."

"సారధిగారూ! ఏమిటి విశేషం?"

"దినపత్రికలో ప్రకటన యిచ్చింది దివాన్ ప్రకాశ

రావే. ప్రకటనకు డబ్బు యిచ్చింది కూడా ప్రకాశరావే."

"అయితే స్విస్ బాంకులో వున్న సొమ్ము చెల్లింపులకు రావడం యథార్థమేనన్నమాట!"

"మా గురువుగారు వస్తేకాని ఆ విషయం తెలియదు."

"అలాగా .... ఇప్పుడు మీరు ఫోను చేశారు. ప్రత్యేకమైన కారణం వుందా?"

"ఏమీలేదు. కేవలం ధైర్యం చెప్పడానికే!"

"థాంక్యూ."

"జ్యోతిగారూ! మీకు శత్రువులు ఫోను చేశారా?"

"అబ్బె .... బ్బే ...."

"వెరీగుడ్ ...." అవతల క్లిక్ మంది.

జ్యోతిరిసీవర్ పెట్టేసి అరచేతులతో మొహంకప్పుకుంది.

రిసీవర్‌ను హుక్‌కి తగిలించి సారధి నిట్టూర్చాడు. జ్యోతి ఖచ్చితంగా అబద్ధం చెబుతోంది. ఆమె టెలిఫోన్ను శిరీష్‌గారు టాప్ చేయించారు. శత్రువులు ఆమెకు తెల్లవారుజామున అయిదులక్షలందించమని హెచ్చరిక చేయటం తనూ ఫోనులో విన్నాడు.

శాంతయ్య ఈపాటికి బ్యాంకికి బయల్దేరి వుంటాడు. శత్రువులు ఈ రాత్రికి రాత్రే డబ్బు తీసుకోవచ్చును. తెల్లవారేవరకు ఎందుకు గడువు నిర్ణయించారు?

సారధి బుర్రలో తళుక్కుమంది. తన అనుమానం ఎంతవరకు నిజం?

చేతి గడియారం చూసుకున్నాడు సారధి. రాత్రి తొమ్మిదికావస్తోంది. టెలిఫోను సెట్టుకుదగ్గరగా నిలబడ్డాడు.

తొమ్మిది దాటుతూండగా టెలిఫోను గణగణ లాడింది.

సారధి మరుకుగా రిసీవరందుకున్నాడు.

"సారధీ!" శిరీష్ పిలిచాడు.

"సార్! కరుణాకర్ దొరికాడా?"

"దొరికాడు. ప్రకాశరావు కూడా అతడితోపాటు బందీ అయివున్నాడు, ఇద్దరినీ వెంటపెట్టుకుని టాక్సీలో బయల్దేరుతున్నాను."

"చాల మంచిది సార్. తెల్లవారుజామున జ్యోతి శత్రువులకు అయిదులక్ష లివ్వవలసి వుంది. శాంతయ్య యీ పాటికి డబ్బు తెచ్చి యింట్లో వుంచివుంటాడు."

"అలాగా! వాళ్ళు యీ రాత్రికి రాత్రే డబ్బు తీసుకు వెళ్ళరన్నమాట!"

"అవును సార్! నాకూ అదే సందేహం వచ్చింది. వాళ్ళు ఎందుకని తెల్లవారేవరకూ ఆగుతున్నారు?"

"నేను అక్కడికివచ్చాక చెబుతాను" అవతల క్లిక్ మంది.

సారధి యింట్లోంచి బయటపడ్డాడు. డాట్సన్ కారును బయల్దేరతీపి పోలీస్ స్టేషను ముందాగాడు.

8

"డామిట్! నువు రాత్రి వెళ్ళినప్పుడు వున్న వెధవలు వుదయానికి ఎలా మాయమవుతారు?" చిందులు తొక్కాడు ప్రకాశరావు.

నౌకరు తల వాల్చుకున్నాడు.

ప్రకాశరావు అతడిమీదకు దూకబోయాడు. గుమ్మంలోకి చూచి స్థాణువై పోయాడు.

"నువ్వా?" అన్నాడు.

"అవును ప్రసాదరావూ.... వురఫ్ ప్రకాశరావ్! నువు స్విస్ బాంకిలో డబ్బు రానున్నదని తెలుసుకున్నావు. అసలు దివాన్‌ని బంధించి నువ్వే దివాన్ ప్రకాశరావుగా

చలామణీ అవుతున్నావు. వారసులుగా వచ్చేవారిని బంధించి సంతకాలు పెట్టించి స్విస్ బాంకులో న్యాయబద్ధంగా చెల్లింపు కావలసిన సొమ్ము నీ కైవసం చేసుకోవాలనుకున్నావు. అంతేగాకుండా రెండో ప్రక్క వారసులను దాచి వుంచి బ్లాక్ మెయిల్ చేసి వారసుల బంధువుల నుండి లక్షలు లాగాలని పథకం వేశావు.

కరుణాకర్ నీ పాలపడ్డాడు. నీ గూండాలు కరుణాకర్ యింటిమీద మొహరించారు. నీవు స్వయంగా కరుణాకర్ యింటికి వస్తానని, డబ్బు స్వయంగా అందుకుంటానని నీ గూండాలకు ఆదేశం యిచ్చావు. వాళ్ళు పట్టుబడి అప్రూవర్లుగా మారారు. పాపం నీ పథకం బెడిసికొట్టింది....” అన్నాడు శిరీష్.

శిరీష్‌వైపు పళ్ళు పట పట లాడించసాగాడు ప్రసాదరావు. అప్పుడే బయట పోలీస్‌వ్యాన్ ఆగింది. □

పొట్టి భార్య?



భైరవి

కె.వి.రమణ

"ఇన్‌స్పెక్టర్‌గారూ! గత వారం రోజులుగా మా అమ్మాయి కనిపించడంలేదు. దయచేపి మీ రామెను వెతికి మా కప్పగిస్తారనే ఆశతో వచ్చాను" వినయంగా నమస్కరిస్తూ అన్నాడా వ్యక్తి.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ అతనికి కుర్చీ చూపిస్తూ "కూర్చోండి" అన్నాడు మర్యాదగా.

ఆ వ్యక్తికి సుమారు నలభై ఐదేళ్ళ వయసు వుంటుంది. బక్కపలచని ఒళ్ళు, నల్లని శరీరచ్ఛాయ మరింత ప్రస్ఫుటమయేలా తెల్లని పాంటులో అదే రంగు పొడుగు చేతుల షర్టు టక్ చేశాడు. పాంటుకు బిగించిన బెల్టు దానిని కిందకు జారిపోకుండా కాపాడుతోంది.

అతడు కుర్చీలో కూర్చున్నాడు.

"వూఁ! ఇప్పుడు చెప్పండి! మీ అమ్మాయి వయసెంత! ఎప్పుడు ఎలా తప్పిపోయింది? అన్నీ వివరంగా తెలియజెప్పాలి."

తలూపాడు ఆ వ్యక్తి. చిన్నగా దగ్గి గొంతు సవరించుకున్నాడు.

"అమ్మాయికి ఇరవై ఎనిమిది సంవత్సరాలుంటాయండి. పేరు మేరీ. జనార్ధనరావనే ఆయన దగ్గర పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తోంది. జనార్ధనరావు వ్యాపారవేత్త. బాగా డబ్బుగల మనిషి. గత ఆదివారం ఒకటో తారీఖున సాయంత్రవేళ ఆఫీస్ పనిమీద వెళుతున్నానని చెప్పి బయల్దేరిన మేరీ ఇప్పటివరకూ తిరిగిరాలేదు."

చిన్నగా నవ్వాడు షరీఫ్.

"చూడండి...." ఆగిపోయాడు షరీఫ్. "పరమాత్మ సార్!" అందించాడా వ్యక్తి.

"చూడండి పరమాత్మగారూ! మీ అమ్మాయి చిన్నపిల్లేంకాదు. పైగా వుద్యోగం కూడా చేస్తున్నదంటున్నారు. ఆ విషయం అటుంచండి. వీధిలోకి వెళ్ళిన ఆడపిల్ల చీకటిపడే వేళకు తిరిగిరాకపోతే అమ్మాయి తలిదండ్రులు ఎకాయెకిని వచ్చి మామీద పడడం సాధారణ

విషయం. మరి మీరేమో మీ అమ్మాయి మాయమయి వారంరోజు లయిందంటున్నారు. అంటే....ఇది మీకు...." అని ఆగిపోయాడు షరీఫ్.

నిట్టూర్చాడు పరమాత్మ. "ఇన్‌స్పెక్టర్‌గారూ! మీ అనుమానం నిజమే. మేరీ అపుడపుడూ అదీ ఈ మధ్యనే రెండు మూడు రోజులు ఇంటికి రాకపోవడం మామూలు విషయమయింది.

కానీ ఏంచెయ్యను. మేరికి నేడో రేపో ఆ ఇరవై యెని మిది కూడా నిండిపోతాయి. పెళ్ళంటూ జరిగితే నలుగురు పిల్లల తల్లి అయ్యేది. అసమర్ధుణ్ణి నేను. నా సంపాదన యింటి ఖర్చులో సగానికే సరిపోతుంది. మిగిలిన ఖర్చంతా మేరీ జీతంమీదే ఆధారపడివుంది. ఈ స్థితిలో ఆమెకు పెళ్ళి చేసి పంపే ధైర్యంలేక ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఏది ఏమయినా మేరీ ఇన్నాళ్ళు యిల్లువిడిచి వుండ లేదు. అందుకే ఆమెకు ఏదయినా ప్రమాదం జరిగి వుండొచ్చునని భయపడుతున్నాం" అన్నాడు పరమాత్మ.

షరీఫ్ తలవూపుతూ "మంచిది. మీరీ విషయమై ఒక రిపోర్టు ఇచ్చివెళ్ళండి. మిగతా విషయాలు మేం చూసు కుంటాం" అన్నాడు.

2

పోలీసు జీపు విశాలమయిన కాంపౌండు గోడ దాటి సుందరమయిన ఓ పెద్ద భవంతి ముందాగింది. ఆ భవంతి వ్యాపారవేత్త జనార్దనరావు ఆఫీస్ కమ్ రెసిడెన్స్.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్, హెడ్ ఐరావతాలను మర్యాద పూర్వకంగా ఆహ్వానించాడు జనార్ధనరావు. ఆరడుగుల ఎత్తూ అందుకు తగ్గ శరీరమూ కలిగిన జనార్ధనరావుకు దాదాపు నలభై యేళ్ళ వయసుంటుంది. డబ్బుతో వచ్చే

దర్పం కళాకాంతులు అతనిలో వెల్లివిరుస్తున్నాయి.

అంత విశాలమయిన భవంతిలో జనార్ధనరావు ఏకాకి. అతని భార్య పెళ్ళయిన ఏడాదికే అంటే సుమారు పదేళ్ళ కిందటనే చనిపోయింది. ఆ తర్వాత మరి ఈనాటి వరకూ అతడు పెళ్ళి చేసుకోలేదు.

జనార్ధనరావు నవ్వుతూనే మర్యాదగా "తమ రాకకు కారణమేమిటి?" అని ప్రశ్నించాడు షరీఫ్‌ని.

"మీ పర్సనల్ సెక్రటరీ మేరీవిషయంలో కొంత సమాచారం కోసం వచ్చాం. వారం రోజులుగా ఆమె కనబడడం లేదని ఆమె తండ్రి మాకు రిపోర్టిచ్చాడు. ఈ విషయంలో మీరేమైనా చెప్పగలరా?"

తల అడ్డంగా వూపాడు జనార్ధనరావు. "సారీ నాకేం తెలీదు. నేనూ ఆమె ఇన్నాళ్ళుగా డ్యూటీకి ఎందుకు రాలేదా అని చూస్తున్నాను. అదీ గాక మేరీ ఈ మధ్య సరిగా డ్యూటీకి రావడం లేదు. ఆ విషయమే ఆమెను సంజాయిషీ అడగాలనుకుంటున్నాను. ఇంతకూ ఏమయిందామెకు!" ప్రశ్నించాడు జనార్ధనరావు.

నవ్వాడు షరీఫ్. "అది తెలుసుకోవాలనే మేం బయల్దేరింది."

"ఏమిటో ఇన్‌స్పెక్టర్ నాకంతా అయోమయంగా వుంది. ఈ ఆడపిల్లలతో వచ్చిన చిక్కే అది. రాగిణి హఠాత్తుగా మానేస్తే ఈ మేరీని పెట్టుకున్నాను. ఈమె కూడా అంతే చేసింది" నిట్టూరుస్తూ అన్నాడు జనార్ధనరావు.

ఈజీగా కూర్చున్నవాడల్లా నిటారుగా లేచాడు షరీఫ్. "అంటే మీ దగ్గర ఇంతకుముందు రాగిణి అనే అమ్మాయి పనిచేసేదా? ఎన్నాళ్ళక్రితం? హఠాత్తుగా మానేసిందంటే

పనిలోకి రావడం మానేసిందనా లేక మేరీలాగనే అదృశ్య మయ్యిందా?" ప్రశ్నల వర్షం కురిపించాడు ఇన్స్పెక్టర్.

"ఆమెదీ ఇదే మోస్తరు కేసు. చెప్పాపెట్టకుండా గైరు హాజరు. ఇప్పటికి నాలుగయిదు మాసాలయినట్టుంది. ఆమె కోసమని చూసీ చూసీ మరి రాదని నిశ్చయమయ్యాక ఈ మేరీని అప్పాయింట్ మెంట్ చేసాను."

"మరి రాగిణి ఏమయిందో మీకు తెలియలేదా?"

"వుహూఁ"

"వుద్యోగరీత్యా ఆమెకు రావలసిన డబ్బు లావాదేవీల గురించయినా ఎవరూ రాలేదా?"

"రాలేదు. రాగిణి ఒంటరిదనుకుంటాను. వుద్యోగానికి ఇంటర్వ్యూ కొచ్చినప్పుడు తన కెవరూ లేరనీ, వూళ్ళో ఎవరో ఒక ముసలమ్మకు చెందిన చిన్న పెంకుటింటి గదిలో అద్దెకు వుంటున్నాననీ, వుద్యోగం తనకు చాలా అవసరమనీ ప్రాధేయపడింది. ఆ కారణంగా జాలిపడి ఆమెను వుద్యోగంలోకి తీసుకున్నాను. అయినా అందుకు బాధపడాల్సిందేమీ లేదు. రాగిణి చాలా పర్ఫెక్టు కష్టపడి పని చేసేది. ఏమయ్యిందో మరి!" పెదవి విరిచాడు జనార్ధనరావు.

"రాగిణి విషయంలో మీరు కొంత శ్రద్ధ తీసుకొని వున్నట్టయితే ఏమి జరిగిందో తెలిసుండేది."

ఆ మాటకు పెద్దగా నవ్వాడు జనార్ధనరావు. "ఇన్స్పెక్టర్! మీరు మరీ అమాయకుల్లే వున్నారు. ఈ కాలం యువతులు మనం వూహిస్తున్నంతగా అమాయకులేంకారు. రాగిణి తనకు నచ్చిన వాణ్ణెవడ్నో చేసుకొని హాయిగా ఎక్కడో వుండి వుంటుంది. అనవసరంగా మీరు బుర్ర బద్దలు కొట్టుకోకండి" అన్నాడు.

షరీఫ్ కూడా నవ్వేస్తూ "అదే జరిగితే ఏ బాధా లేదు. ఏసీ హాః అనుమానం వచ్చాక నివృత్తి చేసుకోవాలి కదా. మీ ఆఫీసులో రాగిణి ఎడ్రసు బహుశా వుండే వుంటుంది. దయచేసి తెప్పిస్తారా" అన్నాడు.

"ష్యూర్?" అంటూ పని కుర్రాణ్ని పిలిచి "గుమస్తా! నటేశాన్నడిగి మన పాత సెక్రటరీ రాగిణి ఎడ్రసు ఇవ్వ మన్నానని తీసుకురా" అని చెప్పి పంపాడు జనార్ధనరావు.

ఆ కుర్రాడు కొద్దిసేపట్లో ఓ చీటీ తెచ్చి జనార్ధనరావు కందించాడు. అతడు దానిని షరీఫ్ కివ్వగా జేబులో భద్ర పరుస్తూ అక్కడినుండి సెలవు తీసుకు బయల్దేరాడు షరీఫ్.

3

గుమ్మానికి ఆనుకొని బియ్యంలో రాళ్ళు ఏరుతున్న ముసలమ్మ ఖాకీ దుస్తుల్ని చూస్తూనే ఖంగారుగా లేచి నిల బడుతూ, "ఎవరు కావాలి బాబూ" అని అడిగింది మర్యాద పూర్వకంగా.

షరీఫ్ చాలా సౌమ్యంగా "సుమారు నాలుగయిదు నెలల క్రితం మీ యింట్లో రాగిణి అనే అమ్మాయి అద్దెకు వుండేది కదూ?" అని ప్రశ్నించాడు.

"అవును బాబూ" అంటూ కుర్చీ తెచ్చి వరండాలో వేసింది ముసలమ్మ.

కుర్చీలో ఆశీనుడయ్యాడు షరీఫ్.

"రాగిణి విషయంలో మీకు తెలిసిందంతా చెప్పండి. ఆమె ఇప్పుడు ఎక్కడ వుంటున్నదీ, ఏం చేస్తున్నదీ మీకే మయినా తెలుసా?"

"ఆ పిల్ల అసలు ఏమయిందీ నాకు అంతగా తెలియదు బాబూ! పోయిన ఆగష్టు ఇరవై ఆరో తారీఖున ఆవేళ ఆది వారం కూడానూ సాయంత్రం ఐదింటికి తయారయి బయ

ద్దేరుతూ నా దగ్గరకొచ్చింది రాగిణి. తారీఖూ సమయం ఇంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నానంటే ఆవేళ మా మనవడి పుట్టినరోజు బాబూ!

రాగిణి నాతో "నేను పనిమీద ఆఫీసుకు వెళుతున్నాను బామ్మగారూ" అంది. నేను "ఇవ్వాళ ఆదివారం కదా! ఈ రోజేం ఆఫీసు. ఓ గంటలో మా మనవడి పుట్టినరోజు కార్యక్రమం వుంది. వాడి నెత్తిన నాలుగక్షింతలు వెయ్యవా" అన్నాను. రాగిణి "నాకు జ్ఞాపకం వుంది బామ్మగారూ. ఎంత! ఓ గంటలో వచ్చెయ్యనా!" అని వెళ్ళింది.

అంతే! అదే ఆమెను నేను కడసారిగా చూడడం. కొద్దిరోజులు పోయాక ఆమె పేరుమీద నాకో వుత్తరం వచ్చింది. తాను వుద్యోగరీత్యా తలవని తలంపుగా బొంబాయి వెళ్ళాననీ, తిరిగి ఎప్పుడొస్తానో తనకే తెలియదనీ, అంతవరకూ తన సామాన్లను జాగ్రత్తగా చూడమనీ, రాసింది రాగిణి.

రాగిణికోసం మరి కొన్నాళ్ళు చూసి ఆమె మరిక తిరిగి రాదని నిశ్చయించుకున్నాను. నలుగుర్ని దగ్గర పెట్టి రాగిణి గది తలుపులు తీసి ఆమె సామానంతా నా దగ్గరే భద్రం చేసాను. ఆ గది వేరొకరికి అద్దెకిచ్చాను. ఏం చెయ్యను బాబూ! అద్దెలమీద బతికేదాన్ని మరి!" అన్నది ముసలామె.

షరీఫ్ తల వూపుతూ "మీ దగ్గరున్న రాగిణి సామాన్లను నా కొకసారి చూపించండి. అవసరమయితే వాటిని మీరు పోలీసులకు స్వాధీనం చెయ్యాల్సుంటుంది" అన్నాడు.

ముసలమ్మ "అలాగే బాబూ" అంటూ షరీఫ్‌ను లోనికి తీసుకువెళ్ళింది. గదిలో ఒక మూలగా పేర్చి వున్నాయి సామాన్లు.

చిన్న సూట్ కేసూ, టేబిలూ, కుర్చీ, కిరోసిన్ స్టవ్, ఒక చెక్కపెట్టె, కొన్ని పాత్రలూ తప్ప చెప్పుకోదగ్గ సామానేం లేదక్కడ. వాటిని ఆ మూల వుంచాక మరి ముట్టుకోలేదనడానికి నిదర్శనంగా దుమ్ము, ధూళీ పట్టి వున్నాయవి.

సూట్ కేసులో కొన్ని చీరలూ బ్లవుజ్‌లూ వున్నాయి. చెక్కపెట్టెలో ఏవో చెత్తసామాన్లు తప్ప తనకు పని కొచ్చేవేం లేవు.

టేబిలు సొరుగులో వెదికారు. కొన్ని పుస్తకాలూ ఒక డయిరీ వున్నాయందులో. డైరీ పేజీలు చకచకా తిరగేసాడు షరీఫ్.

అందులో రాగిణి జనార్ధనరావు దగ్గర పనిలో చేరిన రోజులు వెతికి చూసాడు. తాను ఇంటర్వ్యూ వెళ్ళిన నాటి వివరాలు గూడా ఎక్కడా ఏదీ విడవకుండా రాసింది రాగిణి.

డైరీలో రాగిణి రాసిన విషయాలను బట్టి ఆమెకు జనార్ధనరావుతో ఆమె అదృశ్యం కావడానికి నెలరోజులు ముందుగానే శారీరక సంబంధం ఏర్పడినట్టు తెలుస్తోంది.

అందుకు సంబంధించి డైరీలో ముఖ్యమయిన డేట్సు నోట్ చేసుకున్నాడు షరీఫ్. అవి అతనిలో ఎన్నో అనుమానాలను మరింత ఆసక్తినీ కలిగించాయి. అవి:

ఆగష్టు 16: జనూతో పెళ్ళివిషయం కదిపాను. చాలా చికాకుపడ్డాడు. "మీ ఆడవాళ్ళెప్పుడూ ఇంతే. మగవాడు ఏదో ఇంత కక్కుర్తి పడితే; అదేదో వాడొక్కడి తప్పే అన్నట్టు దానికి పెళ్ళితో శిక్షించాలని చూస్తారు" అన్నాడు. అయినా "చూద్దాంలే" అన్నాడు.

ఆగష్టు 18: జనూతో అంతా బాగానే వుంది. ఆడదాన్ని

ఎలా రంజింపజేయాలో బాగా తెలిసినవాడు. కానీ వచ్చిన చిక్కల్లా ఒకటే. ఆ కొండచిలువ! అమ్మో అలా అంటే జనూకి కోపం వచ్చేస్తుంది అదే! ఆ భైరవి అంటే ఇత నికి ఎందుకంత భక్తి, ప్రేమ. ఆ మాటే ఎన్నాళ్ళగానో అడగాలనుకున్నా కేవలం నేనతడి వుద్యోగిననే భావనతో మనకెందుకులే అని ఇన్నాళ్ళూ వూరుకున్నాను.

కానీ ఇప్పుడు ఏర్పడిన చనువూ అధికారంతో "ఇది ఇక్కడెందుకు డియర్! ఏ "జూ"కో ఇచ్చెయ్యరాదా" అన్నాను. ఆ మాట జనూకి ఎంతో కోపాన్ని తెప్పించి నట్టుంది. "నోర్ముయ్" అన్నాడు గుడ్లెర్రజేసి. ఆ కళ్ళ వంకే భయంగా చూస్తూ వుండిపోయాను. ఆ కొండచిలువ కళ్ళకూ ఈ కళ్ళకు తేడా లేదనిపించి భయంతో వణికి పోతూ కళ్ళు మూసుకున్నాను.

ఆగష్టు 25: మన పెళ్ళి విషయం ఏదో ఒకటి తేల్చి చెప్పమని గట్టిగానే పట్టుబట్టాను. రేపు ఆదివారం ఎలాగూ తాను ఖాళీగా వుంటాడు గనక ఆవేళ సాయంత్రం వస్తే అన్నీ వివరంగా మాట్లాడుకుందాం" అన్నాడు.

అంతే! డైరీ అంతటితో ఆగిపోయింది!

షరీఫ్ డైరీని జేబులో వుంచుతూ, మిగిలిన వస్తువులను యథాతథంగా సర్ది అవసరమయితే వాటికోసం మరోసారి రాగలనని ముసలమ్మకు చెప్పి బయల్దేరాడు జీపులో.

షరీఫ్ బుర్రనిండా ఆలోచనలు ముసురుకున్నాయి. ముసలమ్మ చెప్పిన దానిని బట్టి రాగిణి జనార్ధనరావు దగ్గరకని బయల్దేరినట్టు తెలుస్తోంది. అలా వెళ్ళిన మనిషి మరి తిరిగి రానేలేదు. రాగిణి జనార్ధనరావు ఇల్లుచేరిందా? లేక మధ్యలో మరేదన్నా జరిగిందా?

మేరీ విషయంలోగూడా ఇదేమోస్తరుగా జరిగింది.

ఆదివారం నాడు ఆఫీసుకని ఇంట్లో చెప్పి బయల్దేరిన మేరీ గూడా మరి తిరిగి రాలేదు. మేరీకిగూడా జనార్ధనరావుతో శారీరక సంబంధం వుందా.

మేరీ! రాగిణి! ఇద్దరూ ఒకే రకంగా ఆదివారం నాడే అదృశ్యం కావడంలో అంతరార్థనమేమైనా వుందా?

ఇంతలో ఏదో అనుమానం కలిగి తన జేబులో వున్న పాకెట్ డైరీ తీసాడు షరీఫ్. అందులో చూడగా మరో ఆసక్తికరమయిన విషయం బయటపడింది మేరీ రాగిణులు అదృశ్యమయిన ఆదివారాలు రెండూ అమావాస్య రోజులు.

భృకుటి ముడిచాడు షరీఫ్. సందేహంలేదు. వీరిద్దరూ ఒకే కారణంమీద అదృశ్యమయ్యారు! అదిమాత్రం నిశ్చయం. కానీ ఏమిటది?

ఇంతలో కొండచిలువ గుర్తుకొచ్చింది. ఇది మరో సస్పెన్సు జనార్ధనరావు కొంపలో ఇది ఎందుకున్నట్టు!

ఇంతకూ జనార్ధనరావుకు ఈ వ్యవహారంలో ఎంతమేర సంబంధం వుంది? అన్నీ ప్రశ్నలే! దేనికీ సరయిన సమాధానం లేదు.

4

జీపు దిగి తిన్నగా లోనికి ప్రవేశించాడు షరీఫ్.

ఆసరికి ఏదో ఆఫీసు వ్యవహారాలు చూస్తున్న జనార్ధనరావు షరీఫ్‌ని చూస్తూనే మొహం చిట్లించాడు. ఇన్‌స్పెక్టర్ తిరిగి అంతలోనే రావడం అతనికి నచ్చలేదల్లే వుంది.

అతని వాలకాన్ని ఇట్టే పసిగట్టిన షరీఫ్ నవ్వుతూ "సారీ! మీకు ఇబ్బంది కలిగిస్తున్నట్టున్నాను" అన్నాడు.

జనార్ధనరావు మొహాన నవ్వు పులుముకుంటూ "ఇట్సాల్‌రైట్! విషయం చెప్పండి" అన్నాడు ముక్తసరిగా.

"మరేం లేదు. మీ దగ్గర ఒక కొండచిలువ వున్నట్టు నాకు చాన్నాళ్ళ క్రితమే తెలిసింది. ఇందాక ఆ విషయం మిమ్మల్ని అడగాలనుకుంటూనే కేసు విషయంలో పడి మరచిపోయాను. నిజానికి పాములంటే నాకు చాలా ఇష్టం. కొండచిలువలంటే మరిన్నూ" నవ్వుతూ చెప్పాడు షరీఫ్.

ఆ మాటకు జనార్ధనరావు మొహంలో షరీఫ్ ఆశించిన మార్పు లేవీ సంభవించలేదు. సరదాగా నవ్వేస్తూ "ఓహ్! ఈ విషయం మీవరకూ వచ్చిందా?" అంటూ కాస్త పైకి లేచి "ఇప్పుడే చూస్తారా దానిని" అన్నాడు.

షరీఫ్ తల వూపగా "రండి" అంటూ హుషారుగా లేచాడు జనార్ధనరావు. ఇద్దరూ భవంతి వెనకభాగానికి నడిచారు. ఆ భవంతి షరీఫ్ వూహించినదానికన్నా పొడవుగా విశాలంగా వుంది.

సుమారు ఐదు నిముషాలు నడిచి భవంతిని ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించబడిన విశాలమయిన హాల్లో ప్రవేశించారు.

హాలు మధ్యలో దాదాపు పదిహేనూ ఇరవై అడుగుల వెడల్పు కలిగి లోహపు కడ్డీలతో నిర్మించబడిన బలమయిన సెల్ గది సీలింగుకు కలపబడి వుంది.

సెల్ మధ్యభాగంలో బాగా పెరిగిన అరటి మొదలంత లావులో వున్న మచ్చల ప్రాణిని చూసి నిర్ఘాంతపోయాడు షరీఫ్. సెల్ పొడవునా నేలపై పరచుకొని వుందది.

కొండచిలువంటే ఏదో అంతంతమాత్రం అనుకున్నాడే తప్ప ఇంత గగుర్పాటు కలిగించేలా వుంటుందని షరీఫ్ వూహించనైనా లేదు.

జనార్ధనరావు ఇన్‌స్పెక్టర్‌వంక నవ్వుతూ చూసి "రండి లోనికి వెళదాం" అన్నాడు. షరీఫ్ "అబ్బే! ఎందుకులెండి!"

అని తప్పించుకోజూసినా "ఫరవాలేదు రండీ! భైరవి చాలా మంచిది" అంటూ ఇనపతలుపు తాళాలుతీసి షరీఫ్ చేయి పట్టుకు లాక్కెళ్ళాడు జనార్థనరావు.

నేలమీద అప్పటివరకూ నిస్త్రాణంగా పడివున్న కొండ చిలువ దాపులనే వినవచ్చిన అడుగుల సవ్వడికి చటుక్కున తల ఎత్తి చూసింది. జనార్థనరావు దాని తలపై తన చేతిని వుంచి సున్నితంగా తట్టాడు. కొండచిలువ తన తలను యథాప్రకారం దించేసుకుంది.

"భైరవిని సీలేరు కొండల్లో పట్టాం. దీనికోసం నేను ఎంతో శ్రమపడ్డాను. డబ్బు లెక్కలేనంత ఖర్చ యింది. నగరం నడిబొడ్డున వున్న నివాసంలో భైరవి లాంటి కొండచిలువను పెంచుతున్నందుకు మొదట్లో చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొన్నాను. ఈ విషయంలో సంబంధిత అధికార్లనుండి పర్మిషన్ పొందేందుకు మినిష్టర్ల హోదాలో రికమండేషన్లు సంపాదించాల్సి వచ్చింది" అన్నాడు జనార్థన రావు భైరవి శరీరాన్ని సుతారంగా వేళ్ళతో రాస్తూ.

షరీఫ్ "పదండి పోదాం" అంటూ బయటికి దారితీసాడు. అక్కడ వున్నంతసేపూ ముళ్ళమీద వున్నట్టే వుందతడికి.

షరీఫ్ ఆ తర్వాత ఎంతగా ప్రయత్నించినా ఈ కేసులో మరి ముందుకు సాగలేక పోయాడు. మేరీ! రాగిణి! ఎక్కడ, ఎలా అదృశ్యమయ్యారనే ప్రశ్నలకు అనుమానాలే తప్ప ఆధారాలు లభించలేదు. ఆధారాలు లేని అనుమానాలతో ఎవరినీ దోషులుగా నిర్ణయించే అవకాశం లేదుకదా!

5

ఆఫీసు రూమ్‌లో సెక్రటరీ సుహాసినికి సీరియస్‌గా ఏదో లెటర్ డిక్టేట్ చేస్తున్నాడు జనార్థనరావు. సుహాసిని వంచిన తల ఎత్తకుండా చకచకా రాసుకుపోతున్నది.

ఆవేళ ఆదివారం సాయంత్రం ప్రత్యేకించి సుహాసిని ఒక్కతెకే అర్జంటు పని వుందని రమ్మన్నాడు జనార్ధన రావు. సుహాసిని సాయంత్రం వచ్చింది లగాయితూ ఏదో ఒక పని చెబుతూనే వున్నాడు. అప్పటికి సమయం పది కావస్తోంది. అమావాస్యరోజు కారణంగా బయట వాతా వరణం కటిక చీకటిగా వుంది.

లెటరు రాయడం పూర్తిచేసి తల ఎత్తిన సుహాసినికి ఎదురుగా కుర్చీలో వున్న బాస్ కనిపించలేదు వెనక నుండి నవ్వు వినిపించి ఖంగారుగా వెనక్కి తిరిగింది. గది తలుపులు గడియవేసి నవ్వుతూ తనవేపే వస్తున్నాడు జనార్ధనరావు.

చటుక్కున కుర్చీలోంచి లేస్తూ తడబాటు స్వరంతో "స్సార్! ఏ....ఏ....ఏమిటిది?" అన్నది సుహాసిని.

వెకిలిగా నవ్వాడు జనార్ధనరావు. "సుహాసినీ! ఇప్పటికి ఎన్నోసార్లు ప్రత్యక్షంగా పరోక్షంగా నా కోరిక నీకు తెలియజేసాను. ఇన్నాళ్ళూ ఏదో ఒకరోజు నా కోరిక తీరు తుందనే ఆశతో ఎదురు చూసాను. కానీ నిరాశే మిగిలింది. ఇవ్వాళ అదేదో తేలిపోవాలి...." అన్నాడు ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ.

సుహాసిని చిగురుటాకులా గజగజలాడింది. "సార్.... నన్నేంచేయకండి....ప్లీజ్....మీకు దండం పెడతాను.... నన్నొదిలేయండి—" దీనంగా వేడుకొంటూ వెనక్కి జరుగుతున్నది.

జనార్ధనరావు అదేమీ పట్టించుకోకుండా ముందుకు దూసుకుపోతున్నాడు. అతడిలో వున్న నరనరమూ సుహా సిని మీద కోరికతో బిగుసుకుపోతున్నది.

సుహాసిని ప్రక్కకు పరుగెత్తి తలుపును చేరి గడియ

మీద చేయివేసింది. జనార్ధనరావు మెరుపు వేగంతో కదిలి సుహాసినిని రెక్కపట్టి తనవేపుకు గుంజి బలంగా సందిట బంధించాడు. సుహాసిని ఆ పట్టునుండి విడివడేందుకు గిజగిజ లాడింది. కానీ సాధ్యపడలేదు వుద్రేకం పెచ్చరిల్లగా జనార్ధనరావు ఈలోపున సుహాసిని శరీరంమీద వీలయిన ప్రతిచోటా కసిగా చుంబించసాగాడు.

ఒడలంతా జెర్రులు ప్రాకినట్టయి దిక్కుతోచక జనార్ధనరావు చేతిని గట్టిగా కొరికింది సుహాసిని. జనార్ధనరావు బాధగా అరుస్తూ సుహాసినిని బలంగా ప్రక్కకు విసిరికొట్టాడు. సుహాసిని విసురుగా వెళ్ళి తల గోడకు కొట్టుకోగా స్పృహ తప్పి పడిపోయింది నేలమీద.

జనార్ధనరావు కిందపడిన సుహాసినిని బండబూతులు తిడుతూ కాలితో తన్నాడు కసిగా. తర్వాత ఆమెను విసురుగా భుజానికెత్తుకొని విక్రమార్కుడిలా భవనం వెనక భాగంవేపు నడిచాడు.

జనార్ధనరావుకు ఒంటిమీద యిప్పుడు మొలతాడు సయితం లేదు. విశాలమయిన ఆ హాలు సాంబ్రాణి, అగరు వత్తుల ధూపవాసనలతో నిండివుంది. జనార్ధనరావు నోటి నుండి మంద్రస్థాయిలో మంత్రోచ్ఛారణ వెలువడుతోంది. మెలికలు తిరిగిన భైరవి నునుపు శరీరం లైటుకాంతిలో ధగధగలాడుతున్నది. మధ్య మధ్యలో తల పైకెత్తుతూ ఆ నిశ్శబ్దవాతావరణంలో "హిస్స్" మంటూ భైరవి చేసే చప్పుడు గగుర్పాటు కలిగించేదిగా వుంది.

భైరవికి ముందుగా ముగ్గులతో నిండిన చిన్న వేదికపై సుహాసిని మంత్రపుష్పంలా పడివుంది ఆమెకు శరీరంమీద నూలుపోగన్నా లేని విధంగా వెల్లకిలా స్పృహలేని స్థితిలో

వుంది. సమయం పన్నెండు కావస్తున్న కొద్దీ జనార్ధనరావు మంత్రోచ్చారణలో మార్పు రాసాగింది.

పెద్దగా అరుస్తూ చేతులు వూపుతూ భైరవిని ముందుకు కదలిరమ్మని ఆహ్వానిస్తున్నాడు. భైరవి క్రమేపి తలను పైకెత్తి నాలిక చాచి ముందుకు రాసాగింది. జనార్ధనరావు ఆనందంతో పొంగిపోతూ, పిశాచ నాట్యం ఆరంభించాడు. సుహాసిని దిగంబర శరీరాన్ని తన నాలుకతో మూడు సార్లు స్పృశించిన భైరవి శరీరం రెట్టింపు పొంగింది. తలను నేలకు మూడు నాలుగడుగులు పైకెత్తి నోటిని తెరిచింది బాగా బలిసిన పొట్టేలు సునాయాసంగా పట్టేంత విశాలంగా పర్వత గుహలా వుందా నోరు.

తెరచిన నోటిని సుహాసిని తలవేపుకు చాచుతూ భైరవి తన శరీరంతో సుహాసిని సుందరసుకుమార శరీరాన్ని పెన వేసేందుకు ముందుకు వురకబోయేంతలో "ఢాం" మనే శబ్దాలు వినిపించాయి వరుసగా. నిప్పురవ్వలు చెరుగుతూ తుపాకీ గుళ్ళు భైరవి నోటిలోకి దూసుకుపోగా బాధగా మెలికలు తిరుగుతూ జీవం కోల్పోయింది.

జనార్ధనరావు ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్టుడయ్యాడు. నిద్రమత్తు వదలినవాడిలా తల విదిలిస్తూ "రేయ్! ఎవడ్రా! నా భైరవిని పొట్టన బెట్టుకున్నది? వాణ్ణి నిలువునా చీరేస్తాను పాతేస్తాను" అంటూ కోపంతో చిందులు వేయసాగాడు.

చేతిలో పొగలు కక్కుతున్న రివాల్వర్‌తో ఇన్‌స్పెక్టర్ షరీఫ్, తుపాకులు ధరించిన పోలీసుల బృందం జనార్ధన రావు ఎదుట ప్రత్యక్షమయింది.

షరీఫ్‌ను చూస్తూనే జనార్ధనరావు పిచ్చివాడిలా అరుస్తూ "రేయ్ ఇన్‌స్పెక్టర్! నా భవనంలో కొచ్చి భైరవిని చంపడానికి నీకు యెన్ని గుండెల్రా. చూడు నిన్నేం

చేస్తానో" అంటూ ముందుకు వురికాడు పళ్ళు బిగిస్తూ.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ జనార్ధనరావును దగ్గరకు రానిచ్చి కుడికాలితో లాగి మరీ తన్నాడు. జనార్ధనరావు కెవ్వున అరుస్తూ అల్లంత దూరాన యెగిరిపడ్డాడు. బాధతో మెలికలు తిరుగుతూ చారెడు రక్తం కక్కుకున్నాడు. అయినా అతణ్ణి విడవదలచలేదు షరీఫ్. మరోసారి తన్నేందుకు సిద్ధపడిన ఇన్‌స్పెక్టర్ని హెడ్ ఐరావతం బలవంతంగా ఆపాడు.

"సార్! ఇక వదలండి. లేదంటే చస్తాడు" అంటూ.

ఈలోగా పోలీసులు సుహాసినికి ప్రక్కనే పడివున్న ఆమె చీరనుచుట్టబెట్టి మొహాన నీళ్ళుజల్లారు. నెమ్మదిగా కళ్ళు తెరచింది సుహాసిని. పోలీస్‌లను చూసి నవ్విందినీరసంగా.

షరీఫ్ ఆమెను సమీపించి "మిస్ సుహాసినీ. ఆర్‌యూ ఆల్‌రైట్!" అన్నాడు ఆత్రంగా.

"క్వైట్ ఓ.కె. ఇన్‌స్పెక్టర్. థాంక్‌యూ" అంది సుహాసిని.

ఇంతలో నెమ్మదిగా తేరుకున్న జనార్ధనరావు వగరుస్తూ "ఇన్‌స్పెక్టర్! ఇది మరీ దారుణం. ఇది నా యిల్లు ఆమె నా సెక్రటరీ త్వరలో మేం వివాహం కూడా చేసుకో బోతున్నాం. మా యింట్లో మాకు నచ్చిన విధంగా ఆట లాడుకుంటాం. ఇందులో దౌర్జన్యపూరితమయిన మీ జోక్యాన్ని సహించం" అన్నాడు కోపంగా.

షరీఫ్ అతణ్ణి అసహ్యంగా చూస్తూ "జనార్ధనరావ్! అతితెలివికి పోకు. నీ ఆట ఇక కట్టు. సుహాసిని మా డిపార్టుమెంటు మనిషి.

రాగిణి డయిరీ ఆధారంగా నీ సంగతి చాలావరకూ వూహించగలిగాం. నీకు తొలినుండీ క్షుద్రశక్తులమీద నమ్మకం యెక్కువ. కొండచిలువకు నిత్యం పూజలు జరిపి

ఆదివారం అమావాస్యరోజున దానికి ఒక యువతిని ఆహారంగా యిస్తే కొన్నాళ్ళకు నీకు ఆ క్షుద్రశక్తులు వశమౌతా యనే మూఢ నమ్మకం బాగా వుండి మేరీ రాగిణులను నీ అవసరం వున్నంతవరకూ వాడుకొని వారిని కొండచిలు వకు బలిచేశావు.

ఈ విషయాన్ని తొలుత మేం వూహించగలిగినా ఆ విషయాన్ని నిరూపించే సాక్ష్యాధారాలు మా వద్దలేక వూరుకో వలసివచ్చింది. అయినా అంతటితో నిరుత్సాహపడకుండా కేసును దీర్ఘకాలంలో పరిష్కరించవలసిన జాబితాలో చేర్చి మా మనిషయిన సుహాసినిని రంగంలోకి దింపాం. మా ఆశయం మేరకు నువ్వు సుహాసిని పిచ్చిలో పడ్డావు.

మునుపటి సెక్రటరీల మాదిరిగానే ఈమెనూ అనుభ వించాలనేది నీ మొదటి ప్రయత్నం. కానీ అది నెరవేర లేదు. ఈలోగా సుహాసిని మాత్రం తన విధి నిర్వహిస్తూ భైరవికి నిత్యం నువ్వు జరిపే పూజలు రికార్డుచేసి ఫోటోలు తీసి మా కప్పగించింది.

చివరకు నువ్వూ మేమూ ఎదురుచూస్తున్న ఆదివారం అమావాస్య రానేవచ్చింది. ఈ రోజు వీలయితే సుహాసినిని అనుభవించి భైరవికి ఆమెను అర్పించాలని నిశ్చయించు కున్నావు. మొదటిది నెరవేరకపోగా రెండోది నెరవేర బోతుండగా పట్టుబడ్డావు.

ఇంతక్రితం భైరవికి పూజ చేస్తూ నువ్వు జరిపిన భాగోతమంతా యిదిగో ఈ కెమెరాలోనూ ఈ టేపులోనూ బంధించబడ్డాయి. ఇవిగో వీటిని చూడు'' అంటూ ఒక కెమేరానూ టేపురికార్డర్‌నూ చూపించి ''జనార్ధనరావ్! నువ్విక తప్పించుకోలేవు'' అన్నాడు షరీఫ్ నవ్వుతూ.

జనార్ధనరావు మౌనంగా తల దించుకున్నాడు. □

రెండు శవాలు

బొమ్మిడి అచ్చారావు

ఇద్దరు యింకా నిద్రపోతున్నట్టే వున్నారు. ఆమె ఒంటిమీది చీర అస్తవ్యస్తంగా వుంది. ఛాతీమీద పూర్తిగా ఆచ్ఛాదన తొలగిపోయి వుంది. వెల్లకిలా పడుకుని సుఖనిద్రలో వున్నట్టుగావుంది. దాదాపు ముప్పయ్యేళ్ళ

అతను పక్కకు తిరికి పడుకుని వున్నాడు. బాగా అలసి పోయినట్టున్నాడు. అతని ఒంటిమీద షర్టు లేదు. లుంగీ మాత్రం ధరించి వున్నాడు. అది కూడా చాలా నిర్లక్ష్యంగా కట్టుకుని కట్టుకోనట్టున్నాడు. వయసు పాతిక సంవత్సరాల లోపే. దృఢంగా పొడుగ్గా పచ్చని పసిమితో వున్నాడు. అందగాడే. ఆ మాటకొస్తే ఆ యువతికన్న యువకుడే అన్ని విధాల అందంగా వున్నాడు.

"ఇవిగో, ఈ టేబిల్‌మీద యీ చీటీ దొరికింది. దీని మీదనే విషం తాగిన గ్లాసు లున్నాయి" అంటూ ఓ పావు తావు సైజు కాగితం అందించాడు యిన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

ఆ హోటల్ రూంవంక పరీక్షగా చూస్తూన్న డిటెక్టివ్ కిరణ్ ఆ కాగితం అందుకుని చూశాడు. దాన్లో నాలుగే లైన్లున్నాయి.

"మే మిద్దరం కలిసి తిరగటం పుల్లారావు కిష్టం లేదు. అందుకే కలిసి చావాలని నిర్ణయించు కున్నాం. లేచిపోవాలనుకున్నాం. కాని రమణి అందుకు ధైర్యం చేయలేకపోయింది. ఇద్దరం విడిగా వుండలేమని యిదివరకే నిర్ణయించు కున్నాం. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాం. మా మరణానికి యెవరూ బాధ్యులు కారు.

—సురేష్."

అని వుందా కాగితంలో.

కిరణ్ సాలోచనగా చూసాడు రెండు శవాల వంక. దగ్గరగా వెళ్ళి శవాలు పడుకున్న తీరుతెన్నులు పరిశీలనగా చూశాడు. తల పంకించాడు.

"పుల్లారావు ఎవరు?" అడిగాడు శ్రీనివాస్‌ని.

"ఆ విషయం యింకా తెలుసుకోవాలసి వుంది. హోటల్ రిజిష్టర్లో సురేష్, రమణి అని రాశారు. ఇద్దరు భార్యాభర్తలని కూడా రాశారు."

"వీళ్ళిద్దరు హోటల్ కొచ్చి ఎన్నాళ్ళయింది?"

"తేదీ చూశాను. ఇవాళ నాలుగోరోజు."

"ఉత్తరాన్నిబట్టి వీళ్ళిద్దరూ భార్యాభర్తలు కాదని తెలుస్తోంది. ఈమె—రమణి, పెళ్ళయిన స్త్రీ. సురేష్‌కన్న కనీసం అయిదారు సంవత్సరాలు పెద్దది. అతనితో భర్తకు తెలియకుండా అక్రమసంబంధం పెట్టుకుంది. లేచిరమ్మని సురేష్ అడిగివుంటాడు. కాని ఆమె ధైర్యం చేయలేకపోయింది. సంఘం, కట్టుబాట్లు, భర్త పరువు-ప్రతిష్ఠ ఆమెను నిరోధించివుంటాయి. సురేష్‌మీద వల్లమాలిన ప్రేమతో అటు భర్తను, యిటు ప్రియుడ్ని వదులుకోలేక-చివరికి ఆత్మహత్యకు బద్ధమై వుంటారు. అవునా?" అన్నాడు కిరణ్.

"ఎగ్జాట్లీ! నేనూ వూహించాను. పుల్లారావు రమణి భర్త పేరయివుంటుంది."

"ఆల్‌రైట్. ఇది ఆత్మహత్యేనని నిర్ధారణగా తెలిసేవరకు మనం కేస్‌లో ముందుకు వెళ్ళలేం. డాక్టరు పరీక్ష పూర్తయిందా?"

"ఓ గంట క్రితమే ఆయన తనపని ముగించుకుని వెళ్ళాడు. ఇద్దరు తాగిన పాయిజన్ గ్లాసులు తీసుకువెళ్ళాడు-కెమికల్ ఎనాలిసిస్ రిపోర్టు సాయంత్రానికి పంపిస్తానన్నాడు."

"ఓ.కే. ఈలోపల మనం చెయ్యవలసిన పనులు కొన్ని వున్నాయి. వీళ్ళ రూంకి సర్వ్‌చేసిన బోయ్‌ని పిలిపించు."

శ్రీనివాస్ ఆదేశాలపై బోయ్ వచ్చాడు.

కిరణ్ వాడివైపు సూటిగా చూశాడు. దాదాపు ఇరవై రెండు సంవత్సరాలుంటాయి. మొరటుగా, బలంగా వున్నాడు. వయసుకు మించిన శరీరం.

"నీ పేరు?"

"రాజారావండి."

"ఎంత కాలంగా యీ హోటల్లో పని చేస్తున్నావు?"

"దాదాపు ఆరేళ్ళవుతుందండి."

"మీదే వూరు?"

"గుంటూరు పక్కన పల్లె అండి."

"సరే, నువ్వు వీళ్ళిద్దరికీ రూం సర్వీసింగ్ చేశావు కదా! వచ్చినప్పట్నించీ నువ్వే వున్నావా?"

"నిన్న మాత్రం లేనండి. తక్కిన మూడు రోజులు నేనే వున్నానండి."

కిరణ్, శ్రీనివాస్ వంక తిరిగి, "వీళ్ళకు విష ప్రయోగం జరిగి యెన్నిగంటలయిందని చెప్పాడుడాక్టరు?"

"రాత్రి పది తర్వాత పన్నెండు గంటల్లోపల అయి వుంటుందన్నాడు."

కిరణ్ వాచీ చూసుకున్నాడు. ఉదయం పదిగంటల పది నిమిషాలు. శవాలు పూర్తిగా నీలిరంగుకి తిరిగిపోయి వున్నాయి. అదోరకమైన వాసన కూడా శవాల నుంచి వస్తోంది. సహజమరణమైతే అంత తొందరగా అలారాదు.

"అంటే....నిన్న ఉదయంనించి రాత్రివరకు డ్యూటీలో నువ్వు లేవన్న మాట!"

"లేనుసార్. నేనీ ఉదయమే ఆరుగంటల కొచ్చాను డ్యూటీలోకి వచ్చాక ఏడుగంటల కోసారి బజ్జర్ నొక్కాను. ఎవరూ తలుపు తీయలేదు. గాఢనిద్రలో వుండివుంటారని.

ఓ గంటపోయి మళ్ళీ బజర్ నొక్కాను. అప్పటికీ లేవ లేదు. మరో అరగంట తర్వాత బజ్జర్ నొక్కి ఎవరూ లేచిన అలికిడి వినిపించకపోవటంతో తలుపులు బాదాను. అయినా యెవరూ లేవలేదు.

సాధారణంగా అరున్నరకే ఈయన కాఫీ తెప్పించుకు తాగే అలవాటుంది.

రెండు రోజులు గమనించాను నేను. అందుకే అను మానం వచ్చి మా మేనేజరుగారికి తెలియచేశాను.

వారొచ్చి గట్టిగా తలుపు తట్టి, యింకా రకరకాలుగా లేపటానికి ప్రయత్నించి, యిక వీలుకాక తలుపులు బద్దలు కొట్టించారు. లోపల మంచంమీద యిద్దరు నిద్రపోతున్నట్టే కనిపించారు. కాని చూడబోతే ప్రాణంలేదు రాజారావు స్వచ్ఛంగానే మాట్లాడుతున్నాడు. చదువుకున్నవాడిలా వున్నాడు. యాసలేదు.

"అయితే నిన్న డ్యూటీ బోయ్ ఎవరు?"

"అతనికీరోజు ఆఫ్ సార్! నేనొచ్చాక అతనెళ్ళి పోయాడు."

"అతని పేరు."

"వెంకటేసు."

కిరణ్ హోటల్ మేనేజర్‌వైపు చూపి, "వెంకటేసుని పిలిపించగలరా?" అన్నాడు.

"అలాగేసార్, యిప్పుడే కబురుపెడతాను" అన్నాడు మేనేజర్.

రాజారావుని పంపేసి మళ్ళీ శవాల వంక పరీక్షగా చూశాడు కిరణ్. గదిలో ఒకేఒక సూట్ కేస్ వుంది. ఓ ఏర్ బాగ్ వుంది. ఏర్ బాగ్‌లో రెండు చీరలు, లంగాలు, బ్రాపియర్‌లు వున్నాయి. సూట్ కేసులో సురేష్‌వి నాలుగైదు

జతలున్నాయి.

భర్తకు తెలీకుండా ఏదో పని కల్పించుకుని రమణి బయల్దేరి వచ్చింది. సురేష్ కూడా ముందు అనుకున్న ప్లాన్ ప్రకారం ఎక్కడో కాచుకునివుండి యిద్దరు కలిపి హోటలు కొచ్చివుంటారు.

"వీళ్ళ అడ్రసు రిజిష్టర్లో నోట్ చేశారు కదూ!"

"చేశారు సార్!"

కిరణ్ శ్రీనివాస్ వంక చూపి, "ఏ వూరని రాశారందులో?" అనడిగాడు.

"అమలాపురం అని రాశారు" అన్నాడు శ్రీనివాస్.

"నిజమయి వుండదు. అమలాపురం నించి హైదరాబాద్ వచ్చి మకాం పెడతారా? విజయవాడ లోపలే ఎన్నో పట్నాలున్నాయి. అక్కడెక్కడైనా వుండొచ్చునే...."

"అవును, అవకాశముంది."

"కాబట్టి వాళ్ళు రాసిన అడ్రసు కరక్టయి వుండదు. మనం అమలాపురం వెళ్ళినా వృధాప్రయాసే అవుతుంది."

"మరి వాళ్ళ అడ్రసు తెల్సుకునేదెలా?"

కిరణ్ సూట్‌కేస్ అరల్లో వెతికాడు. రెండు కేష్‌బిల్సు దొరికాయి. వేంకటేశ్వరా క్లాత్ స్టోర్సు, మాచెర్లలో రెండు చీరలు కొన్నట్టు బిల్లు ఒకటి, లాండ్రీబిల్లు మరొకటి. గుడ్డల అడుగున ఓ ఉత్తరం దొరికింది.

ఉత్తరం పైన సురేష్ పేరు, వీధిపేరు, మాచర్ల అని రాసివున్నది.

కిరణ్ కళ్ళు మెరిశాయి!

"శ్రీనివాస్, ఈ యువకుడి యింటి అడ్రసు యిది. ఇతనిది మాచర్ల. ఈ మెది కూడా మాచర్లయే కావచ్చు. కేస్‌కి, ఓ స్వరూపం రావటం యిప్పుడే మొదలయింది"

అన్నాడు కిరణ్.

"అయితే నువ్వీ కేసు ఫెయిర్ సూయిసైడ్ కేసు కాదంటావా?"

"ఖచ్చితంగా కాదు. హత్య! డాక్టరు రిపోర్టు, వేలి ముద్రల రిపోర్టు వచ్చాక చూడు! ఆత్మహత్యగా నమ్మించటానికి ప్రయత్నం జరిగింది. అంతే!"

"ఎలా చెప్పగలిగావు రిపోర్టు చూడకుండా!"

"వెరీ సింపుల్. ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రాసిన చీటీ ఏదీ?"

"ఇదిగో!"

"దీన్లో సురేష్ సంతకం చూడు, ఇదిగో కేష్ బిల్లుమీద చీరలకు రెండువందలు మాత్రమే చెల్లించాడు. మరో నూట డెబ్బయి రూపాయలను అరువు రాయించి కింద సురేష్ సంతకం తీసుకున్నాడు షాపు అతను. ఈ కేష్‌బిల్లు చూడు!"

శ్రీనివాస్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"అయితే యిది హత్యేనంటావా?"

"అనుమానంలేదు. ఈ ఆత్మహత్య చీటీ హంతకుడే కల్పించాడు."

శ్రీనివాస్ తల విదిలించాడు.

"శవాల్ని మార్చ్యురీకి తరలించమంటావా?"

కిరణ్ తలూపి, "మనం వెంటనే మాచెర్ల వెళ్ళి రావాలి!" అన్నాడు.

మేనేజర్ పైకొచ్చాడు. "సార్, వెంకటేసు తల్లికి అనారోగ్యంగా వుందని వాళ్ళవూరు వెళ్ళాడట" అన్నాడు.

"అతని అడ్రసు తెలుసా, వాళ్ళ వూరిది?

"తెలియదు సార్! అతనీ హోటల్లో చేరి నెల రోజులు

కూడా కాలేదు. అతని గురించి కో వర్కర్సు కెవరికైనా తెలుసేమో అడుగుతాను!" అన్నాడు మేనేజర్. అయిదు నిమిషాల తర్వాత వచ్చి "ఎవరికీ తెలియదట సార్!" అన్నాడు.

2

శ్రీనివాస్ మఫ్టీలో వున్నాడు. కిరణ్ శ్రీనివాస్ మాచెర్ల చేరుకునేసరికి సాయంత్రం నాలుగు కావచ్చింది. సురేష్ అడ్రస్ వెతుక్కోవటం కష్టం కాలేదు. డోర్ నంబరు వీధి పేరుతోబాటు ఉత్తరం పైన రాసేవుంది.

ఇంట్లో ఓ ముసలాయన మాత్రం వున్నాడు వాళ్ళిద్దరు వెళ్ళిన సమయానికి.

"సురేష్ వున్నాడా?" అడిగాడు శ్రీనివాస్.

"ఎవరు బాబూ, మీరూ?" అన్నాడు ముసలాయన.

"మేం సురేష్ స్నేహితులం. ఎక్కడికి వెళ్ళాడో తెలుసా?" అడిగాడు కిరణ్.

"ఏమో బాబూ, మాకేమైనా చెప్పి చేస్తారా యీ కాలం కుర్రాళ్ళు?"

"మీరు సురేష్ కేమవుతారు?"

"సురేష్ తండ్రిని బాబూ! ఈ మధ్యనే రిటైరయ్యాను. ఒక్కగానొక్క కొడుకు చేతికందీ అందకుండా ఉద్యోగం లేకుండా గాలికి బలాదూరు తిరుగుతూంటే చూస్తూ ఏం చెయ్యలేని నిస్సహాయుడ్ని....మీరిద్దరు సురేష్ స్నేహితుల మంటున్నారు, మిమ్మల్ని నేనెప్పుడూ చూడలేదు" అన్నాడు ముసలాయన.

"మీరు చూసి వుండలేరులెండి. ఎందుకంటే సురేష్, మేము విడిపోయి దాదాపు పదేళ్ళయింది. చాన్నాళ్ళ తర్వాత స్నేహితుడ్ని చూడాలనిపించి వచ్చాం."

"ఉద్యోగాలు చేస్తున్నారా బాబూ!"

"చేస్తున్నామండి" అన్నాడు కిరణ్. శ్రీనివాస్ టైటు పాంటు, టైటు షర్టులో చాలా యిబ్బంది ఫీలవుతున్నాడు. పాతికేళ్ళ యువకుడిలాగా కనిపించడానికి చేసిన ప్రయత్నంలో బిగుతు షర్టు, పాంట్లు బిగించక తప్పలేదు. అతని అవస్తకు కిరణ్ లోలోన నవ్వుకోవటం గమనించి యింకా ఉడుక్కున్నాడు శ్రీనివాస్.

ముసలాయన యింతలో తనే అందుకున్నాడు "బాబూ! బహుశా మీకు తెలిసివుండదు—రెండేళ్ళ క్రితం నా భార్య అదే, సురేష్ తల్లి చనిపోయింది. అప్పట్నుంచి వీడికి పట్ట పగ్గాల్లేవు. అమ్మాయిలిద్దరూ వీడికన్న పెద్దవాళ్ళు కావటం వల్ల వాళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు. వీడికి హైద్రాబాద్‌లో ఎన్నో ఉద్యోగావకాశాలు వచ్చాయి. నా స్నేహితుడు అక్కడ మంచి హోదాలో వుండి రమ్మని ఎన్నోసార్లు రాశాడు. కాని వీడు పోతేనా? ఇప్పుడు ఆ స్నేహితుడు కూడా రిటైరయిపోయాడు. వీడికి ఉద్యోగం వేయించడం యిక నావల్లకాదు!" నిరాశ ధ్వనించింది ఆయన గొంతులో.

"అలాగా. ఈ సంగతులేవీ మాకుతెలీదండి. మేం వాడికి చెప్పుతాంలెండి!" అన్నాడు శ్రీనివాస్.

"అసలు వాడు మొండిచెయ్యటానికి కారణం వేరే వుందిలే బాబూ! మీ స్నేహితుడికి నచ్చచెప్పి దారికి తీసుకువస్తానంటే చెపుతాను!"

"ఏమిటో చెప్పండి, మా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాం."

"ఏంలేదు బాబూ! వీడు యెలా అలవాటుపడ్డాడో ఓ పెళ్ళయిన అమ్మాయితో తిరగడం మొదలుపెట్టాడు. ఆ పిల్ల

చిన్నదేం కాదు. వీడికన్న అయిదారేళ్ళు పెద్దది. పన్నెండేళ్ల కూతురు, పదేళ్ళ కొడుకు కూడా వున్నారు ఆ అమ్మాయికి దానికేం పోయేకాలమో, మొగుడు చాటున వీడితో తిరుగు తోంది. వద్దురా బాబూ. నీకు కావాలంటే అందమైన కన్నె పిల్లలు యెందరో వున్నారు, యీ అలవాటు మాను-అంటే వినటంలేదు బాబూ! మీరైనా చెప్పండి, తనకన్న వయ సులో పెద్దది, పిల్లలున్నదానితో వీడికిదేం పోయేకాలం చెప్పండి! చూసి చూసి ఆ మహాతల్లి వీడ్ని పట్టుకుంది. నన్నడిగితే మొగుడి చాటున యిలా బరితెగించి మెలిగే ఆడదాన్నినరికి పోగులు పెట్టాలంటాను" ఆవేశంగా అన్నా డాయన.

"అరె, ఈ సంగతులేం తెలీవండి మాకు! ఇంతకీ ఎవ రండి ఆ మహాతల్లి?"

"దానిపేరు రమణి. ఈ వూరే. వీడు ఎర్రగా, బుర్రగా, మంచి గుడ్డలేసుకుని దర్జాగా తిరుగుతాడు కదా! దానికన్ను పడింది. మొగుడికి తెలియనట్టుంది. తెలిస్తే దీన్ని ఎప్పుడో ఉప్పుపాతర వేసివుండేవాడు."

"అతనేం చేస్తుంటాడండి?"

"బిజినెస్. హైద్రాబాద్‌కి కూరగాయలు, మామిడిపళ్ళ సీజన్‌లో కాయలు. పళ్లు-యింకా రకరకాల సరుకులు ఎగు మతులు, దిగుమతులు చేస్తుంటాడు. అక్కడ్నుంచి అనాబ్ షాహి ద్రాక్ష తెప్పిస్తూ యిక్కడ చిల్లర వర్తకులకు మంచి లాభాలకు అమ్ముతాడు. బిజినెస్ పేరుతో అస్త మానం వూళ్లు పట్టుకు తిరుగుతాడు. అందుకే ఆ రమణి మా వాడ్ని పట్టుకుంది."

"అతని పేరేమిటన్నారు?" అడిగాడు కిరణ్.

"పుల్లారావు. భారీ విగ్రహం. చూట్టానికి రెండుకళ్ల

చాలవనుకోండి. అంత బావుంటాడు—మరి దానికేం పోయే కాలం వచ్చిందో, మొగుడ్ని చాటుచేసుకుని యిలా ఏడుస్తోంది."

"పుల్లారావిల్లెక్కడో తెలుసా మీకు?"

"పుల్లారావిల్లు తెలియనివాళ్ళు మాచెర్లలో యెవరూ వుండరు. బజారు వీధిన మూడో లైనులో పచ్చమేడ. బాగా స్థితిపరుడు కదా. కొన్నిగదులు ఏసీ కూడా చేయించాడు."

"సురేష్ ఎక్కడికి వెళ్ళాడో మీకు తెలుసా?"

"తెలీదు బాబూ!"

శ్రీనివాస్ భావయుక్తంగా కిరణ్ వంక చూశాడు.

కిరణ్ గొంతు సవరించుకుని, "ఇంతవరకు మీకు నిజం చెప్పకుండా దాచి మీ నుంచి ఈ వివరాలడిగినందుకు క్షమించండి. మేం సురేష్ స్నేహితులం కాదు!" అన్నాడు.

ముసలాయన అదిరిపడి, "మరి....?" అన్నాడు ఇంకేమనలేక.

"పోలీసులం. మీరు మనసు స్థిరం చేసుకోండి. సురేష్ యిక మనకు లేడు!"

ముసలాయన బిర్రబిగుసుకుపోయి అలాగే చూస్తుండిపోయాడు. కిరణ్ అతన్ని చటుక్కున పట్టుకున్నాడు.

ఆయన ప్రాణం గట్టిదే: షాక్ తట్టుకోవడమే కాకుండా "ఆ పుల్లారావే....వాడే....నా బిడ్డని పొట్టన పెట్టుకున్నాడు. అనుమానంలేదు...." అన్నాడు శూన్యంలోకి గాజుకళ్ళతో చూస్తూ.

"రమణిని కూడా చంపేశారు!"

ముసలాయన తలూపి, "పుల్లారావు కసి తీర్చుకున్నాడన్న మాట! ఇలాంటి ఆడదానికి అలాంటి శిక్ష తప్పదు!"

అంటూ ఒక్కసారిగా బావురుమన్నాడు ముసలాయన. అంతవరకు నిగ్రహించుకున్న దుఃఖం కట్టలు తెంచుకుని పొర్లుకొచ్చింది.

కొడుకుని తల్చుకుని మళ్ళీ మళ్ళీ ఏడ్చాడు ముసలాయన.

"బాబూ, నా బిడ్డ శవాన్ని చూడొచ్చా?" ముసలాయన దయనీయంగా అడుగుతుంటే డిటెక్టివ్ లిద్దరికీ కంట నీరు తిరిగింది.

"మరో అరగంటలో మిమ్మల్ని కల్సుకుని హైదరాబాద్ తీసుకువెళ్తాం. ఇంకా ఈ వూళ్ళో కొంచెం పనుంది. చూసుకుని వస్తాం! మీరు ధైర్యంగా వుండండి. సురేష్‌ని చంపినవాడిని ఉరికంబ మెక్కిస్తాం!" ముసలాయన భుజం తట్టి ధైర్యం చెప్పాడు కిరణ్.

3

బజారు వీధిలో వున్న పుల్లారావు పచ్చమేడ దగ్గరకు టయోటా పోనిచ్చి, దూరంగా ఆపాడు కిరణ్.

జంక్షన్‌లో పాన్‌షాపు దగ్గరకు నడిచాడు. అక్కర్లేక పోయినా గోల్డ్‌ఫ్లేక్ ప్యాకెట్ కొన్నాడు. పాన్‌షాపతన్ని మాటల్లోకి దించాడు.

"ఆ పచ్చమేడ యెవరిది అబ్బాయ్? చాలా ఆధునికంగా కట్టినట్టుంది!?"

"అదాబాబూ! మీరీ వూరికి కొత్తలా వుంది. అది పుల్లారావుగారని__అబ్బో లక్షాధికారిలెండి, లక్షాధికారేమిటండీ, కోటీశ్వరుడుకూడాను__కాని పాపం దురదృష్టం బాబూ!"

"అదేమిటి, కోటీశ్వరుడికి దురదృష్టమేమిటి?"

"అన్నట్టు మీరీ వూరికి కొత్తకదూ! నాలుగురోజుల

క్రితం లారీ లోడ్ చేయిస్తున్నారండి హైద్రాబాద్ కి. పక్క నించి గుంటూర్నించి ఒస్తున్న లారీ దూసుకుపోయిందండి. ఇంకా అదృష్టవంతుడు కాబట్టి ప్రాణాలు దక్కాయి. లేకుంటే...."

శ్రీనివాస్ అప్పుడే తనూ అక్కడికొచ్చి ఆ వార్త విని కిరణ్ తోబాటు ఆశ్చర్యంతో విస్మయంగా చూశాడతనివంక.

"ఏక్సిడెంటా?" అన్నాడు అప్రయత్నంగా.

"అవును బాబూ! కుడికాలు తొడదాకా తీసేశారండి గుంటూరు హాస్పిటల్లో. ఇప్పుడు బాగానే వున్నాడండి. సమయానికి ఆయనగారి భార్య కూడా దగ్గరలేదు చూడండి. అదీ దురదృష్టమంటే. తన స్నేహితురాలి పెళ్ళికి ఆమె గారు హైద్రాబాద్ వెళ్ళిందండి, ఇంకా తిరిగిరాలేదను కుంటాను...."

కిరణ్ మరికొద్ది క్షణాలు అతనితో మాట్లాడి టయోటా దగ్గరకు నడిచాడు. శ్రీనివాస్ అతన్ని అనుసరించాడు.

"నో, పుల్లారావు హంతకుడు కాదు. మరి ఎవరై వుంటారు చెప్మా, బ్రదర్, అసలివి హత్యలు కావు— ఆత్మహత్యలే అయుండాలి!" శ్రీనివాస్ మాటలు కిరణ్ మరుగ్గా చూడగానే ఆగిపోయాయి.

కిరణ్ మౌనంగా టయోటా, స్టార్టు చేశాడు. సురేష్ ఇంటికి పోనిచ్చి, అతని తండ్రిని ఎక్కించుకుని సరాసరి హైద్రాబాద్ రోడ్ పట్టించాడు.

4

డాక్టరు రిపోర్టు, వేలిముద్రల నిపుణుడి రిపోర్టు వచ్చాయి. కెమికల్ ఎనాలిసిస్ రిపోర్టు కూడా వచ్చాయి.

ఒక్కగ్లాసులో మాత్రమే పాలల్లో నిద్రమాత్రలు మితి

మీరిన మోతాదులో కలపబడివున్నాయి. రెండో గ్లాసులో యేలాంటి విషపదార్థంలేదు. ఆ పాలగ్లాసుమీద మాత్రం సురేష్, రమణి ఇద్దరి వేలిముద్రలు వున్నాయి. అయితే విషం ఇద్దరి జీర్ణాశయంలోను వున్నది. రెండో గ్లాసు కేవలం మంచినీళ్ళ గ్లాసు. అందులో పాలులేవు.

వేలిముద్రల నిపుణుడు సురేష్ వాళ్ళ రూం బయట తలుపు పక్కన ఓ చీటీ కనుగొన్నాడు. అదే చీటీలో నిద్ర మాత్రలు కట్టినట్టు రుజువైంది. ఆ చీటీమీద రమణి, రమణి, అంటూ పదేపదే ఆమెపేరు రాపి కొట్టేసివుంది.

కిరణ్ హోటల్ రాజ్‌కి ఫోన్ చేశాడు. అవతల మేనేజర్ పలికాడు.

"హల్లో. అయామ్ డిటెక్టివ్ కిరణ్! వెంకటేసువచ్చాడా?"

"లేదు సార్!"

"రాజారావున్నాడా?"

"ఉన్నాడండి!"

"వెంటనే స్టేషన్‌కి పంపండి. క్రైంబ్రాంచ్." అంటూ ఫోన్ పెట్టేశాడు.

అరగంట తర్వాత రాజారావు వాళ్ళముందున్నాడు.

"సురేష్‌కి రాత్రి నిద్రపోయే ముందు పాలుతాగే అలవాటుందా!"

"ఉందండి. నేనే వేడిగా వుండటం కోసం ఫ్లాస్కులో పోసి రూంలో వుంచేవాడినండి. రాత్రి పదిగంటల వరకు వాళ్ళిద్దరు ఏవో కబుర్లు చెప్పుకునేవారండి."

"గ్లాసుతో ఎప్పుడూ పెట్టేవాడవు కాదా?"

"నేను పెట్టలేదుగాని, వెంకటేసు పెట్టాడండి."

"నీకెలా తెలుసు?"

"నిన్న డ్యూటీలో మారేటప్పుడు చెప్పాడండి. ఫ్లాస్కు

పగిలిపోయిందని, అంచేత గ్లాసులో పాలు అయ్యగారికి యిచ్చాననీ చెప్పాడండి."

"వెంకటేసు బాగా చదువుకున్నట్టు కనపడేవాడా?"

"నిజమేనండి. దొరబాబులా వుంటాడండి. బాగా చదువుకున్నవాడే. ఉద్యోగం దొరక్క సర్వరు ఉద్యోగాని కొచ్చాడని బాధపడేవోళ్ళమండి!"

నిద్రమాత్రలు చుట్టిన కాగితంమీద 'రమణి' అని రాసిన రాతలు చూపించి, "వెంకటేసు దస్తూరి పోల్చగలవా?" అన్నాడు.

"ఇది వెంకటేసుదేనండి."

కిరణ్ కళ్లు మెరిశాయి. తర్వాత సురేష్ సంతకంతో రాసిన ఆత్మహత్య చీటీ చూపించి, "ఈ దస్తూరి ఎవరిది?" అన్నాడు.

రాజారావు వెంటనే, "ఈ దస్తూరి బాగా గుర్తు తెలుస్తున్నాదండి. వెంకటేసుదేనండి!" అన్నాడు.

సురేష్ తండ్రిపక్కనేవున్నాడు. ఆయనతో "వెంకటేసు అనే శత్రువు ఎవరైనా వున్నారా సురేష్‌కు?" అతడిగాడు.

"వెంకటేసు శత్రువు కాదండి, మా వాడి బెస్టుఫ్రెండు. రమణి గురించి ఒకసారి యిద్దరికీ గొడవయిందండి" అన్నాడాయన.

కిరణ్ శ్రీనివాస్ వంక చూపి, "వెంటనే వెంకటేసుని గాలించి పట్టుకో! అతడే హంతకుడు. రమణికి పెద్ద చరిత్రే వుంది. వెంకటేసు ఆమె ప్రియుల్లో ఒకడు. కక్షతో అవకాశం దొరకగానే సురేష్‌ని చంపాలనుకుని పాలల్లో విషం కలిపాడు వెంకటేసు. కాని దురదృష్టవశాత్తు రమణి కూడా పాలు తాగింది. ఫిఫ్టీ ఫిఫ్టీ. అంతే, ఇద్దరూ చనిపోయారు" అన్నాడు. □

విస్కీలో విషం

విపంచి

"పాస్ట్ ఈజ్ పాస్ట్. జరిగిందంతా మర్చిపోదాం. ఫ్రమ్ నౌ వుయార్ ఫ్రెండ్స్" రవితేజ్ చేతిని గట్టిగా నొక్కుతూ చెప్పాడు చంద్రమౌళి.

బదులుగా చిరునవ్వు నవ్వాడు రవితేజ్. అతనికి ఇంకా నమ్మకం కుదరటం లేదు తమ మధ్య విరోధం సమసిపోయి, స్నేహం స్థాపింపబడిందని. ఒక గంట క్రితం

వరకూ తామిద్దరు బద్ధ విరోధులు. బహుశా అయిదేళ్ళ నుండి ఇద్దరి మధ్య నిప్పు రాజుకుంటూనే వుంది.

"నువ్వు నన్ను నమ్మటం లేదనుకుంటా" రవితేజ్ ముఖంలోకి పట్టిపట్టి చూస్తూ, సూటిగా అడిగాడు చంద్ర మౌళి.

"అబ్బే, అదేం లేదు" తడబడ్డాడు రవితేజ్. తన భావా లని అంత జాగ్రత్తగా చంద్రమౌళి పరీక్షిస్తాడని వూహించ లేదు.

"రవితేజ్! ఇక ఈనాటితో మనకి, కాలేజీకి ఋణం తీరిపోయింది. ఎప్పుడో జూనియర్ ఇంటర్లో క్లాస్ లీడర్ షిప్‌కోసం మనం పడ్డ చిన్న తగవు, ఇప్పటికి మనమధ్య యింత ద్వేషాన్ని మిగిల్చింది. కాలేజీనుండి వెళ్ళిపోయే టప్పుడన్నా మిత్రులుగా విడిపోవటానికి నే నిష్టపడు తున్నాను" చంద్రమౌళి కళ్ళు చెమర్చాయి.

"నీ ఫీలింగ్స్ నేను అర్థం చేసుకోగలను మౌళీ! ఈ శుభదినాన్ని మన జీవితాంతం మర్చిపోలేనట్లు ఎంజాయ్ చేద్దాం. ఏమంటావు?" అడిగాడు రవితేజ్.

నవ్వాడు చంద్రమౌళి.

అతనెందుకు నవ్వాడో అర్థంకాలేదు రవితేజ్‌కి.

"ష్యూర్, ష్యూర్! గోకుల్ బార్‌కి వెళ్దాము" ప్రపో జల్ పెట్టాడు చంద్రమౌళి.

"బార్‌కా?! సారీ, నా కలవాటు లేదు" సీరియస్‌గా చెప్పాడు రవితేజ్.

చంద్రమౌళి ఆశ్చర్యంగా చూసాడతనికేసి. "ఇన్నాళ్లూ క్లాసులో అందరూ 'రవితేజుడు మంచి బాలుడు' అంటుంటే అర్థమైంది కాదు. ఇప్పుడు తెలిసింది

అలవాటంటావా? నాకేమంత అలవాటుందని. జస్ట్ ఫర్

ప్లెజర్! ప్లీజ్, నాకోసం ఈ ఒక్కరాత్రి కంపెనీ యివ్వు" ప్రాధేయపడుతున్నట్లు అన్నాడు చంద్రమౌళి.

కాసేపటివరకూ తటపటాయించాడు రవితేజ్. చివరకి చంద్రమౌళితో కలిసి గోకుల్ బార్‌లోకి నడిచాడు.

అప్పుడు సమయం రాత్రి తొమ్మిదిన్నర కావస్తుంది.

2

"నాకు బీర్ చెప్పు" ఓ క్షణమాగి. మళ్ళీ చెప్పాడు రవి తేజ్ "బీర్ మత్తు యివ్వదట కదా, అందుకే" నవ్వాడు.

"అదేం కుదర్దు మాన్! నాకోసం నువ్వు విస్కీ సిప్ చేయక తప్పదు" అన్నాడు చంద్రమౌళి.

వారిద్దరూ కాస్త మూలగావున్న టేబిల్ చూసుకొని, కూర్చున్నారు. బార్‌లో జనం అంత ఎక్కువ లేరు. అక్కడక్కడా కూర్చున్నవాళ్ళని లెక్కిస్తే అరడజను మంది కన్నా యెక్కువుండరు.

చాలా సన్నటి నీలపు కాంతి వారిమీద పడుతుంది— వారి తలపైనున్న నీలి బల్బునుండి.

ఆ నీలపు కాంతి తప్ప, బార్ నిండా నల్లటి చీకటి అలుముకొని వుంది.

"ఇప్పుడే వస్తాను" సీటులో నుండి లేచి, వెళ్ళాడు చంద్రమౌళి. మెత్తటి బూట్ల చప్పుడు అతడ్ని అనుసరించింది. ఆ తర్వాత అంతా నిశ్శబ్దం....

చుట్టూ వున్న వాతావరణాన్ని పరిశీలనగా చూశాడు రవితేజ్. నల్లటి చిక్కటి చీకటి....ఆ చీకటిలో సన్నటి నీలి వెలుగు..ఎక్కడో దూరంగా కూర్చున్న మనుషులు .. 'లో-వాయిస్'లో వినిపిస్తున్న ఇంగ్లీష్ మ్యూజిక్....రవి తేజ్‌ని అప్రయత్నంగానే భయపెట్టింది.

"అలవాటు లేని వాతావరణం" తనకు తానే సర్ది చెప్పు

కుంటున్నట్లుగా గొణుక్కున్నాడు.

దూరంగా చంద్రమౌళి వెయిటర్‌తో ఏదో 'గుసగుస' లాడటాన్ని గమనించాడు రవితేజ్. "ఏమిటా గుసగుసలు?" ఆలోచనలో పడ్డాడు.

తన సీట్లోకి చంద్రమౌళి వచ్చి, కూర్చోగానే అడిగాడు రవితేజ్. "ఏమిటి మౌళీ! ఆ వెయిటర్‌తో ఏమిటి మాట్లాడి వచ్చావు?"

ఆ సన్నటి నీలపు కాంతిలో చంద్రమౌళి కళ్ళు వింతగా మెరిసాయి. "ఫర్ దిస్ గుడ్ అకేషన్.... మనకోసం 'స్పెషల్ విస్కీ' ఎరేంజ్ చెయ్యమని చెప్పొచ్చాను. ఫారిన్ విస్కీ" చివరిమాట కాస్త గొంతు తగ్గించి, చెప్పాడు చంద్రమౌళి. అతని గొంతులో అదొక రకమైన వుత్సాహం ధ్వనించింది.

మరి కొద్దిసేపటికి వెయిటర్ విస్కీ హాఫ్ బాటిల్, రెండు గ్లాసులు, వాటర్ జగ్, ఐస్ బాక్స్ ట్రేలో తీసుకొచ్చి, వారిముందు పెట్టాడు.

"గాయ్యల వేపుడు తీసుకురా" వెయిటర్‌తో చెప్పాడు చంద్రమౌళి. వెయిటర్ వెళ్ళిపోయాడు.

"ఏమీ కాదుగా?" చంద్రమౌళి తన గ్లాసులో విస్కీ పోస్తుంటే అనుమానంగా అడిగాడు రవితేజ్. అతని స్వరం సన్నగా కంపించటాన్ని గమనించి, చిన్నగా నవ్వాడు చంద్రమౌళి. "డోంట్ వర్రీ. మరి కొద్దిసేపటిలో స్వర్గం నీ స్వంతం కాబోతుంటే అనుమానాలేమిటి?"

వణుకుతున్న చేతులతో విస్కీగ్లాసుని తీసుకొని, సిప్ చేసాడు రవితేజ్. గొంతు భగ్గుమంది—ఎవరో లోపల మంట పెట్టినట్లుగా.

"కంగారేం పడకు. కొత్తకదా! అదే సర్దుకుంటుంది" ధైర్యం చెబుతున్నట్లుగా అన్నాడు చంద్రమౌళి.

రాయ్యల వేపుడు వచ్చింది. అది నంజుకుంటూ, తాపీగా విస్కీ సిప్‌చేస్తూ, నెలాఖరులో ప్రారంభం కానున్న తమ పరీక్షల గురించి మాట్లాడుకోవటం ప్రారంభించారు.

నెమ్మది నెమ్మదిగా నిషా రవితేజ్ తలకెక్కుతుంది. కనులు ఎర్రబడుతున్నాయి. "చూడు మౌళీ! ఈఏడు నేనే కాలేజీ ఫస్ట్, ఛాలెంజ్" గొంతు తడబడింది రవితేజ్‌కి.

"ఒప్పుకొంటున్నానుగా! నువ్వు చదువులో మహా చక్రవర్తివని" ఎంత డ్రింక్ చేసినప్పటికి చంద్రమౌళి కంట్రోల్ తప్పలేదు.

కాలం మెల్లగా కరిగిపోతుంది—ఆ టేబిల్‌మీదున్న విస్కీ బాటిల్‌లా.

హాఫ్ బాటిల్ పూర్తి అయిపోయింది.

కేష్ కౌంటర్ దగ్గరున్న వాల్‌క్లాక్ పన్నెండు గంటలు కొట్టటాన్ని శ్రద్ధగా విన్నాడు చంద్రమౌళి.

యథాలాపంగా చేతి వాచీకేసి చూసుకున్నాడు. తేదీతో సహా చూపించే ఆటోమేటిక్ గడియారం అది. 'తారీఖు', 'నెల' రెండూ అప్పుడే మారిపోయాయి. పెద్దముల్లు, చిన్నముల్లు ఆలింగనంలో వున్నట్లు పన్నెండు మీద....

చిన్న చిరునవ్వు చంద్రమౌళి పెదాలపై జనించింది. హుంషారుగా చిటికేసాడు. "రవితేజ్ వస్తానుండు" అంటూ లేచి, వడివడిగా అడుగులేసుకుంటూ, అక్కడ్నుండి వెళ్ళిపోయాడు.

చంద్రమౌళి వస్తాడని మరో పావుగంట ఎదురు చూసాడు రవితేజ్.

చంద్రమౌళి రాలేదు.

వళ్ళు తూలిపోతుంది.

"మాళీ....మాళీ!" కుర్చీలో నుండి లేచి, అరిచాడు రవితేజ్.

ఆ పిలుపుకి సమాధానంగా వెయిటర్ వచ్చాడు. "మీ ఫ్రెండ్ బిల్లు చెల్లించి వెళ్ళిపోయారండీ. వెళ్తూ, మీకీ లెటరిమ్మని చెప్పారు" నాలుగు మడతలు పెట్టిన కాగితాన్ని రవితేజ్ చేతికిస్తూ, చెప్పాడు వెయిటర్.

భ్రుకుటి ముడివడింది. వెయిటరిచ్చిన కాగితాన్ని అందుకొని, 'బార్' బయటికి వచ్చాడు రవితేజ్.

బయట వీధిలైటు దగ్గర నిలబడి, ఆ కాంతిలో ఆ లెటర్‌ని చదివాడు రవితేజ్.

మొట్టమొదట చదవగానే మసక మసగ్గా మత్తుతో మూసుకుపోతున్నట్లున్న తన కళ్ళు తనని మోసం చేసాయని అనుకొన్నాడు రవితేజ్.

రెండవసారి చదవగానే ఆ అనుమానం, మత్తు అతడి దగ్గర్నుండి పారిపోయాయి. మూడోసారి చదివాడా వుత్తరాన్ని.

"మైడియర్ ఫ్రెండ్ రవితేజ్!

అయిదేళ్ళనుండి ఈ అవకాశం కోసం ఎదురు చూస్తున్నా. ఐదేళ్ళుగా నా అణువణువు ద్వేషంతో తపించిపోతుంది. ఇప్పుడు—నీ అంతట నువ్వే....మన కాలేజీ 'లాస్ట్ వర్కింగ్‌డే' నాడు నాకు చిక్కుకున్నావు. నువ్వు తాగింది విస్కీ కాదు. విషం! ఏడు గంటల్లో ప్రాణాలు తీపే కాలకూట విషం!! దాని బారి నుండి నువ్వేమాత్రం తప్పించకోలేవు. రేపుదయం సరిగ్గా ఆరుగంటలకి నీ చావు కబురు నాకు అందుతుంది. నీ అంత్యక్రియలకి హాజరవుతాను.

ఇప్పటికి.... ఇంకా ఆరుగంటలు!!
పాపం! నీ చావుకి ఈ ఒక్క రాత్రే!!!
ఏం చేసుకుంటావో ఈ రాత్రిని.
గుడ్ బై ఫ్రెండ్, గుడ్ బై ”

3

“నో!” అరిచాననుకున్నాడు రవితేజ్. భయంతో అతని అవయవాలు పని చెయ్యటం మానేసాయి—తాత్కాలికంగా. శరీరమంతా చెమట్లు పట్టేసాయి.

కడుపులో ఏదో త్రిప్పుతున్నట్లు ఫీలింగ్. ప్రేవులన్నింటిని తోడేస్తున్నట్లు అదొకరకమైన మంట.

మెదడు బద్దలవుతున్న అగ్నిపర్వతంలా తయారైంది. శరీరం వణుకుతుంది.

“నో....నో! నా వయసింకా ఇరవై ఏళ్ళే....ఓగాడ్! ఏమీ అనుభవించకుండానే నేను....ఓష్....ఏం చెయ్యాలి? ఏం? ఈ ఆరు గంటలు??? ఆ చంద్రమౌళిగాడు నమ్మించి, విషం తాగించేసాడు. ఫ్రెండ్‌గా నటించి, తెలివిగా తనని చంపేస్తున్నాడు .... చంపేసాడు .... అబ్బా! కడుపులో మంటలు....విషం....విషం! ప్రతి రక్తనాళంలోకి వెళ్ళి కలిసిపోతూ, నరనరంలో చోటు చేసుకొంటూ....విషం రక్తంలో కలసిపోతే .... ఎవ్వరూ రక్షించలేరు. ఓరి దేవుడా! నీ హుండీలో పదివేలేస్తాను. ఈ ఒక్క రాత్రి ... రాత్రి చావుకి దూరంగా నన్ను....” వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించాడు రవితేజ్.

రోడ్డుమీద పోతున్న ఒకరిద్దరూ ఓ క్షణమాగి, అతడికేసి చిత్రంగా చూసి, తమ దారిన తాము వెళ్ళిపోతున్నారు.

ఏం చెయ్యాలో పాలుబోవటం లేదు రవితేజ్‌కి. ఆలోచించటానికి ఏమాత్రం అవకాశమివ్వని పరిస్థితి అది.

కడుపంతా దేవేస్తున్నట్లు ..."ఓక్ ....ఓక్!" బలవం తంగా వాంతి చేసుకున్నాడు రవితేజ్. కొద్దిగానే అయ్యింది వాంతి. నీరసంగా పీధిలైటుకి చేరగిల్లాడు.

అప్పుడు స్ఫురించింది అతనికి. 'ఈ కుతంత్రంలో ఆ వెయిటర్‌కి భాగముండాలి' తట్టిన వెంటనే ఆలస్యం చేయ కుండా చివాలున లేచి, బార్‌వైపు పరుగు తీస్తున్నట్లుగా అడుగులేశాడు రవితేజ్.

బార్ కట్టెయ్యబోతున్నారు.

"వెయిటర్—వెయిటర్!" కేకలేసుకొంటూ వెళ్ళాడు రవితేజ్. వాళ్ళకి సప్లై చేసిన వెయిటర్ అతని దగ్గర కొచ్చాడు.

రవితేజ్ ఆ వెయిటర్ కాలర్ పట్టుకొని, గుంజుతూ, "చెప్పరా బాస్టర్డ్! నాకు విషమిస్తావురా....చంపేస్తారా వెధవా!" వెయిటర్ మెడ పిసకబోయాడు—ఉక్రోషంగా, క్రోధంగా.

బార్ మేనేజర్ వచ్చి 'పెడీల్' మని రవితేజ్ చెంప మీద బలంగా కొట్టాడు. దెబ్బకి కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి రవితేజ్‌కి.

"మీరందరూ.... (బూతుమాట తిట్టాడు) నన్ను చంపే స్తున్నారు" ఉక్రోషంగా అన్నాడు రవితేజ్. పిచ్చెక్కి పోతున్నట్లుగా వుందతనికి. మెదడులోని నరాలు తెగిపోతు న్నంత తీవ్రమైన బాధ.

"రేయ్, పీడికి కాస్త డోస్ ఎక్కువైనట్లుంది. గదిలో వేసి తాళం వేద్దాం" అన్నాడు మేనేజర్.

వెయిటర్లందరూ రవితేజ్‌ని గట్టిగా పట్టుకొన్నారు.

రవితేజ్ గింజుకొంటున్నాడు, అరుస్తున్నాడు. బూతులు తిడుతున్నాడు. విడిపించుకోవటానికి విశ్వ ప్రయత్నం

చేస్తున్నాడు.

మేనేజర్ తనని గదిలో బంధిస్తే ఏమవుతుందో వూహించాడు రవితేజ్. వెంటనే శరీరంలోని శక్తినంతటిని కేంద్రీకరించుకొని, బలంగా విదిలించుకొన్నాడు.

వెయిటర్లు అతన్ని అడ్డుకోబోయారు. "ఆపండి" అంటూ మేనేజర్ ముందుకొచ్చాడు.

ఏమాత్రం ఆలోచించలేదు రవితేజ్. సమీపంలో కనిపించిన స్టూల్ని చేతిలోకి తీసుకున్నాడు. బలంగా విసిరాడు. ఆ స్టూల్ సూటిగా పోయి మేనేజర్ తలకి తగలటంతో తల పగిలి రక్తం రాసాగింది. మేనేజర్ కుప్పలా కూలిపోయాడు.

మెరుపుగా బయటికి పరుగుతీసాడు రవితేజ్. రన్నింగ్ రేస్‌లో పాల్గొంటున్నట్లు పరుగు తీస్తున్నాడు. వెనుకనే వెయిటర్లు తరుముకొస్తున్నారు.

ఆ అర్ధరాత్రి. రోడ్డుమీద ఒంటరిగా పరుగెత్తున్నాడు రవితేజ్. వెయిటర్ల బారినుండి తప్పించుకోవడానికి కన్పించిన చిన్న చీకటి సందులోకి తిరిగాడు. ఆ సందు మొదట్లో వున్న చెత్తకుండీ చాటున నక్కాడు. బరువుగా వూపిరి పీలుస్తున్నాడు. "అయిపోయింది....తన జీవితం అయిపోయింది. ఇంకో అయిదారు గంటల్లో" ఏడుపొచ్చింది రవితేజ్‌కి.

గుండె గాభరాగా రెట్టింపు వేగంతో కొట్టుకుంటోంది. "ఈ వూళ్ళో తన వాళ్ళెవ్వరూ లేరు. ఎక్కడో వూరికి దూరంగా వున్న లొకాలిటీలోని ఒంటరి రూమ్! ఎలా? ఎలా?? అప్పుడే చావుకి మరోగంట దగ్గరయ్యాడు" చాలా దుర్భరమైన సిట్యుయేషన్ అది.

అరగంట తర్వాత రవితేజ్ మెల్లగా లేచి, నీరసంగా

అడుగులేసుకుంటూ నడుస్తున్నాడు. కాసేపటికో, కూసే పటికో స్పృహ తప్పి పోతాడన్నట్లు తూలుతుంది అతని శరీరం.

ఇంతలో రవితేజ్ కళ్ళు కన్పించిన నల్లటి నేమ్‌ప్లేట్ వైపు పరుగుతీసాయి. అతనిలో ఆశ చిగురించింది.

4

"ఎలా వుంది నా పథకం? ఈ దెబ్బతో పాపం....రవితేజ్" మాట పూర్తి చెయ్యకుండానే పకపకా నవ్వాడు చంద్రమౌళి.

"బ్రహ్మాండం చంద్రా!" ఉత్సాహంగా అరిచారు ఆ గదిలో వున్న అతడి క్లాస్‌మెట్స్.

"చాలా కొత్త పద్ధతిలో...." మళ్ళీ నవ్వేలు.

"లెటర్ని చదవగానే రవితేజ్ నాకోసం వెదుకుతాడు. మీకు తెలుసుగా! 'చావుకి ఈ ఒక్కరాత్రి' అనేసరికి మనిషి కెంత కంగారు పుడుతుందో?! ఫ్రెండ్స్! తిరిగి రేప్పొద్దున్నే హాజరవుదాము" చెప్పాడు చంద్రమౌళి.

(అక్కడే అతను తప్పు అంచనా వేసాడు. దానికి ఆ మరునటిరోజు చంద్రమౌళి దారుణమైన ప్రతిఫలాన్ని అనుభవించాల్సి వచ్చింది.)

* * *

అప్పుడే ఇంగ్లీష్ పిక్చర్ చూసొచ్చి, పడుకున్నాడు డాక్టర్ చక్రపాణి.

"బజ్‌జ్" కాలింగ్‌బెల్ నొక్కబడటంతో నిద్రాభంగం అయ్యింది. విసుగ్గా లేచి వెళ్ళి, తలుపు తీసాడు.

ఎదురుగా గుమ్మంలో నిలబడి వున్నాడు రవితేజ్.

విస్కీవాసన డాక్టర్ నాసికా పుటాలని తాకింది. చిరాగ్గా నుదురు చిట్లించి, అతనికేసి పరీక్షగా చూసాడు డాక్టర్

చక్రపాణి.

చిందరవందరగా రేగిపోయిన జుట్టు, ఎర్రగా వున్న కళ్ళు....బాగా నలిగిపోయిన బట్టలు....వళ్ళంతా చెమట.

"డాక్టర్, నా ఫ్రెండ్ నన్ను బార్లోకి తీసుకెళ్ళి, విష మిచ్చాడు. ప్లీజ్ సేవ్‌మీ డాక్టర్! ప్లీజ్....నా చావుకి ఈ ఒక్క-రాత్రే" ఉద్వేగంగా అన్నాడు రవితేజ్. ఆ కంగారులో అతని మాటలు కాస్త తడబడ్డాయి.

"గో మాన్! గో ఎవే. బాగా తాగొచ్చి, గొడవ చేస్తున్నావా? గెటౌట్ ఫ్రం హియర్" విసుగ్గా కసిరాడు డాక్టర్ చక్రపాణి. అతను రవితేజ్ మాటల్ని విశ్వసించ లేదు.

"అది కాదు డాక్టర్....చూడండి! నేను చచ్చిపోతున్నాను. విషం తాగించాడు" రోదనా మిశితమైన స్వరంతో డాక్టర్ని ప్రాధేయపడ్డాడు రవితేజ్.

విపరీతమైన ఆగ్రహం ముంచుకొచ్చింది డాక్టర్ చక్రపాణికి. అసలే నిద్ర పాడుకావటం ఆ కోపానికి అగ్నికి ఆజ్యంలా అయ్యింది.

రవితేజ్ మాటల్ని ఒక సామాన్యమైన తాగుబోతు 'ప్రలాపన'గా భావించి, అతడ్ని తేలిగ్గా కొట్టిపడేసాడు చక్రపాణి. "నేను నీ మాటలేమీ వినదల్చుకోలేదు" అంటూ డోర్ మూసెయ్యబోయాడు డాక్టర్ చక్రపాణి.

అంతవరకూ వున్న ఒకే ఒక్క ఆశ అడుగంటిపోయింది. ఆ క్షణాన తను మనిషినని మర్చిపోయాడు రవితేజ్. విపరీతమైన క్రోధం, ద్వేషం....తనింక కొద్ది గంటల్లో చావబోతున్నానన్న భయంకరమైన భయం రవితేజ్‌ని పూర్తిగా మార్చేసింది.

రవితేజ్ బలమైన పొడవాటి వేళ్ళు డాక్టర్ మెడని

కపిగా పట్టుకొన్నాయి. నాగుబాముల్లా కదులుతున్న వేళ్ళు డాక్టర్ చక్రపాణి మెడ చుట్టూ బిగుసుకుపోతున్నాయి. విదిలించుకోబోయాడు చక్రపాణి. కాని అది అతనికి అసాధ్యమైంది.

రవితేజ్ పెదాలపై వికృతమైన నవ్వు...."నన్ను బ్రతికించవు కదా డాక్టర్! అనుభవించు....చావు....చావు"

"ఊమ్, ఊమ్మ్" వూపిరి పీల్చుకోవటం కష్టమైపోతుంది చక్రపాణికి. ముఖమంతా ఉబ్బుతున్నట్లుగా వుంది. కనుగ్రుడ్లు బయటికొచ్చేస్తున్నాయి.

"దబ్—" కొంత సేపటికి చక్రపాణి శరీరం నేలమీద పడింది.

ఆ ప్రాంతం నుండి బయటపడి, వేగంగా అడుగులేస్తున్నాడు రవితేజ్. అతనిలో తనిక బ్రతుకుతానన్న ఆశ చచ్చిపోయింది. తన చావుకి ఈ ఒక్కరాత్రే....మనసులోనే తీర్మానించుకున్నాడు.

అప్పుడే లోపల శరీరంలో ఏదో మార్పు....మెదడులో సంచలనం....విషం అణువణువులో వేగంగా ప్రవహిస్తుంది, తనని చావుకి దగ్గర చేయటానికి.

తనవింత అకాల మృత్యువుకి గురి చేస్తున్న చంద్రమౌళిపై పగ తీర్చుకోవాలి—పళ్ళు పటపటా కొరికాడు రవితేజ్. పిడికిలి బిగించాడు. అతనిలో విచక్షణా జ్ఞానం నశించింది.

రవితేజ్ మనసులో యిప్పుడు మెదులుతున్నది ఒక్కటే. కసి!

5

"పాత సిన్మాకి వద్దే బాబూ! పెద్దలు అంటే విన్పించుకొన్నావా? ఇప్పుడు చూడు, టైమెంత అయ్యిందో! పావు

తక్కువ రెండు" గొణిగింది కౌసల్య.

సన్నగా నవ్వింది మంజీర. "పోన్లేవే కౌసల్యా! పరీక్షలయ్యేంతవరకూ మళ్ళీ సినిమా చూడటం వీలు కాదుగా! ఏం, ఈ చీకటిలో ఇంటికెళ్ళడానికి భయపడుతున్నావా ఏమిటి?" అంది మంజీర.

బదులుగా ఏమీ మాట్లాడలేదు కౌసల్య.

వారు నడుస్తున్న రోడ్డుమీద వారిద్దరూ తప్ప, మరెవ్వరూ లేరు.

కౌసల్య వాళ్ళ యింటికెళ్ళే సందొచ్చింది. "నేనిలా వెళ్ళిపోతాను, గుడ్‌నైట్" చెప్పి, ఆ సందులోకి తిరిగింది కౌసల్య.

ఒంటరిగా నడవసాగింది మంజీర. నిర్మానుష్యమైన సందు అది. ఎక్కడో కుక్కలు మొరగటం లీలగా వినిపిస్తుంది. వీధిలైటు కాంతి తప్ప, అంతా దట్టమైన చీకటి.... ఆ సందు దాటితే తను ఇల్లు వస్తుంది.

మంజీరని దాటుకుంటూ వెళ్ళి, అరక్షణం తర్వాత గిర్రున వెనక్కి తిరిగాడు రవితేజ్—అనుమానమేసి.

"వెళ్తోంది మంజీరేనా?" పరీక్షగా చూసాడు. "నో డౌట్, ఆ అందమైన నడక మంజీరదే" చప్పున అతని మెదడులో మెరుపు మెరిసింది.

"మంజీర—చంద్రమౌళి ప్రేయసి" గుర్తుకొచ్చిన మరుక్షణం విపరీతమైన ఆనందంతో వుక్కిరిబిక్కిరయ్యాడు రవితేజ్. చంద్రమౌళి కోసం బయల్దేరాడతను.

చంద్రమౌళిపై పగ తీర్చుకోవటానికి మంచి సాధనం. వాడు కుళ్ళి, కుళ్ళి నికృష్టంగా ఏడ్వాలి—క్రూరంగా నవ్వుకొన్నాడు.

వేగంగా అడుగులేస్తూ, మంజీరని సమీపించాడు రవి

తేజ్. చటుక్కున వెనుదిరిగింది మంజీర. ఆ చిరుకాంతిలో రవితేజ్‌ని గుర్తించిందామె. రవితేజ్....” ఆశ్చర్యంగా గొణిగింది.

తన రెండు చేతుల్ని ఆమె నడుము చుట్టూ వేసాడు రవితేజ్. ఆమె బుగ్గలమీదికి వంగాడు. విసురుగా రెండు చేతుల్తో రవితేజ్ జుట్టు పట్టుకొని వెనక్కినెట్టింది. తనకి తెలిసినంత మటుకు రవితేజ్ చాలా మంచివాడు. మరి ప్పుడు— ఆలోచిస్తూ పరుగు తీయబోయింది మంజీర.

నిర్దాక్షిణ్యంగా ఆమెని అడ్డుకొన్నాడు రవితేజ్. అత నేమీ ఆలోచించటం లేదు. మంజీర నోరుని ఒక చేతితో గట్టిగా నొక్కేసి, మూలకు తీసుకుపోయాడు.

గింజుకుంటుంది మంజీర. ఆమె అందమైన కళ్ళల్లో నీళ్ళు చోటు చేసుకొన్నాయి.

జాకెట్టుని, చీరని దయాదాక్షిణ్యం లేకుండా దానవుడిలా చింపేసాడు రవితేజ్.

మంజీర దురదృష్టాన ఆ ప్రాంతాన ఎవ్వరూ లేరా సమయానికి.

సన్నగా రోదిస్తుంది మంజీర.

ఆ రోదనని ఏమాత్రం లక్ష్యం చేయకుండా కసిగా మంజీర బంగారు భవిష్యత్‌ని నాశనం చేస్తున్నాడు రవితేజ్.

6

రవితేజ్‌ని తల్చుకొని, పడీపడీ నవ్వుతున్నాడు చంద్రమౌళి. ఎంతాపుకుందామన్నా నవ్వాగటంలేదు. “పూర్ రవితేజ్!” ఇంకా నిద్రపోలేదతను.

ఇంతలో తలుపు తట్టిన చప్పుడు....

"ఈ అర్ధరాత్రివేళ ఎవరు....బహుశా రవితేజ్" ఆలో చేస్తూ, తలుపు తెరిచాడు చంద్రమౌళి.

అతని అంచనా నిజమైంది.

ఎదురుగా గుమ్మంలో నిలబడి వున్నాడు రవితేజ్.

పలకరింపుగా నవ్వుతూ, వాచీకేసి చూసుకున్నాడు చంద్రమౌళి. మూడున్నర కావస్తుంది.

రవితేజ్ నిశ్చలంగా నిలబడి వున్నాడు. అతని కళ్ళల్లో ఏభావం లేదు. చొక్కా అక్కడక్కడా చిరిగి (మంజీర చేతుల్లో) ముఖమంతా రక్కులు, స్నానం చేసినట్లు శరీర మంతా చెమట....భయంకరంగా చూస్తున్న కళ్ళల్లో ఎర్ర జీరలు....చంద్రమౌళికి ఎప్పుడో తను చూసిన డ్రాకులా సినిమాలోని "క్రిస్టోఫర్‌లీ" గుర్తుకొచ్చి సన్నటి వణుకు కలిగింది.

"లోపలికి రారా రవితేజ్" చంద్రమౌళి స్వరం కంపించింది.

మౌనంగా లోపలికొచ్చాడు రవితేజ్.

ఈసారి కాస్త ధైర్యం తెచ్చుకొని, నవ్వాడు చంద్రమౌళి. "మైడియర్ ఫూల్! ఎలా వుం...." మాట పూర్తి కాకముందే రవితేజ్ చేతిలో కత్తి 'తళుక్కు'మంది.

"ఏం చెయ్యబోతున్నావు?" చిన్నగా అరిచాడు చంద్రమౌళి.

"అనవసరంగా మాట్లాడకు మౌళీ! నువ్వింత నమ్మించి, గొంతు కోస్తావనుకోలేదు. విస్కీ పేరుతో విషం తాగించావు. ఇంకో రెండు, మూడు గంటల్లో నా ప్రాణాలు పోయేలా ఏర్పాటు చేసావు. అందుకే....అందుకే...."

కసీగా పళ్ళు నూరాడు రవితేజ్.

తెల్లబోయి, చంద్రమౌళి వింటున్నాడా మాటలని. "నీ ప్రాణాతి ప్రాణమైన, అపురూప ప్రేయసి, అపరంజి బొమ్మ మంజీర నాచేత దారుణంగా 'రేప్' చెయ్యబడి, ఇప్పుడు ఎవ్వరూలేని ఆ నిర్జనపు రోడ్డుమీద స్పృహ కోల్పోయి, మానంపోయి ఒంటరిగా పడి వుంది" ఒక్కొక్క పదాన్ని వత్తి వత్తి పలికాడు రవితేజ్.

అదిరిపడ్డాడు చంద్రమౌళి. "ఎంత పనిచేసావు రవి తేజ్" అంటూ ముందుకి రాబోయాడు.

అంతే! 'కసుక్కు'న కత్తి చంద్రమౌళి ఛాతిలోకి దిగ బడింది. వెచ్చటి రక్తం బయటికి వచ్చింది. వెనక్కి వాలి పోతూ, గొణుగుతున్నాడు చంద్రమౌళి.

"రవితేజ్....ఫూల్....ఫూల్! నిన్న మార్చ్ 31. పన్నెండు దాటాక ఏప్రిల్ 1 వచ్చింది. నిన్ను ఏప్రిల్ ఫూల్ చేద్దామని....కాని నేనేసిన ప్రాక్టికల్ జోక్ యిలా మారుతుందని...." ఇక ఆ తర్వాత చంద్రమౌళి నోట ఏ మాటలు లేవు. చాలా చిత్రంగా అతడి ప్రాణాలు పోయాయి.

నిశ్చేష్టుడై, నిలబడిపోయాడు రవితేజ్. అతని మెద డులో భూకంపాల ప్రకంపనం....

"ఏప్రిల్‌ఫూల్....ప్రాక్టికల్ జోక్" నమ్మలేనట్లుగా లోపలలోపల గొణుక్కున్నాడు. "విస్కీలో విషం కలి పితే మౌళి తనతోబాటు తాగుతాడా....కాస్త ఆలోచించి వుంటే! ఛా! తను బార్ మేనేజర్ని....డాక్టర్ని....మంజీ రని .... మౌళిని .... నిజంగానే" .... వెర్రిగా నవ్వాడు రవితేజ్. □

25 జతల కళ్ళు

ఓరుగంటి పద్మావతి

"కేసులులేని ప్లీడరు తక్కువ ఫీజు తీసుకొన్నా, గొప్పగా వాదించొచ్చు. కాని జనం అలాంటి ప్లీడరు దగ్గరకి వెళ్ళరు. ఒక పెద్ద ఆఫీసు పదిమంది గుమస్తాలతో హుందాగా కనపడే ప్లీడరు దగ్గరకి వెడతారు. అలాగే మన లాంటి సామాన్య డిటెక్టివ్‌ల దగ్గరకి ఎవరూ రాదు" అని బాధగా తన గోడు గోడలకి చెప్పుకోసాగాడు డిటెక్టివ్.

అవధాని.

ఆ గోడల బాధలు తీరుస్తానికా అన్నట్టు శర్మ వచ్చాడు.

"ఏం బాసు! మీరు అలా బాధలు గోడలకి చెబితే అవి మరీ చెమ్మగిల్లి, బీటలుతీసి, ఈ ఇల్లు కూలిపోవచ్చు. ఈ ఏలూరు పట్టణంలో ఈ మహానుభావులు కాబట్టి మనకి ఈ ఇల్లు అద్దెకి ఇచ్చారు. ఇప్పుడు ఈ ఇల్లుకూడా లేకపోతే మనకి ఈ ఏలూరులో స్థానం లేదు. కనుక మీ బాధలు గోడలకి చెప్పటం మానేసి, నాకు చెప్పండి బాసు" అన్నాడు కోడు విరిగిన కుర్చీలో జాగ్రత్తగా కూర్చొంటూ శర్మ.

అవధానికి డిటెక్టివ్ నవుదామన్న దురుద్దేశం ఏనాడూ లేదు. కాని ఇంకే వృత్తికి పనికిరాక ఇలా డిటెక్టివ్‌గా మారాడు. కలరా సోకి తండ్రి, తండ్రి చనిపోయినందుకు తల్లి, ఇద్దరూ చనిపోగా వున్న రెండెకరాలని, రెండు సంవత్సరాలలో అమ్ముకొని తినేసాడు అవధాని. ఇంటర్మీడియట్ దాకా చదివిన అవధానికి తల్లిదండ్రులు చనిపోవటంతో ఆపైన చదువు ఎక్కలేదు.

కాని డిటెక్టివ్ పుస్తకాలు మాత్రం తెగ చదివేవాడు. ఆ రోజుల్లోనే శర్మతో పరిచయమైంది. శర్మకికూడా నా అనేవాళ్ళు లేరు. అవధానితో కలియటానికి ఒప్పుకొన్నాడు శర్మ.

ఏలూరు పట్టణమంతా తిరిగారు రూమ్‌కోసం. "డిటెక్టివ్ ఆఫీసు తెరుస్తామంటే 'చస్తే అద్దెకి రూమ్‌లు ఇవ్వం'" అని భీష్మించుకొని కూర్చున్నారు ఏలూరులోని రూమ్‌ల యజమానులు.

అవధాని నాన్నగారికి స్నేహితుడైన సుబ్బరామయ్యగారి ద్వారా ఈ పాతకాలపు నాటి ఇల్లు అద్దెకి దొరికింది.

ఒక మంచిరోజు చూసి బోర్డు దిగేసారు ఇంటిముందు.

ముందుగది ఆఫీసు. వెనుక రెండు గదులూ నివాసానికి.

"అదేనయ్యా! మన ఏలూరు పట్టణంలో మూడురోజుల్లో ఇరవైకి పైగా హత్యలు జరిగాయి. అయినా మనకి కేసులు యెందుకు రావటంలేదా అని బాధపడుతున్నాను" అన్నాడు డిటెక్టివ్ అవధాని బాధగా.

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ముగ్గురిలోను ఇద్దరు రచయితలు వున్నారట అలాగే ప్రతి నలుగురిలోను ఒక డిటెక్టివ్ వున్నాడు. అసలు మనలాంటి వాళ్ళని జనం గుర్తించరయ్యా" అని మొన్న ఒక రిటైర్డు డిటెక్టివ్ నాతో అన్నాడు. అది నిజమే. అదే మనల్ని ఏ ఇంగ్లాండువాళ్లో, ఏ అమెరికావాళ్ళో పిలుచుకొని వెళ్ళి, అక్కడ రెండు మూడు కేసులు ఇచ్చి, వాటిని మనం పరిష్కరించి భారత దేశానికి తిరిగి వస్తే 'ఎక్కడ అవధానిగారు, ఎక్కడ శర్మ గారు' అంటూ జనం మన వెనక పడతారు. ఆ అవకాశం వచ్చే వరకూ యెదురు చూడక తప్పదు" అన్నాడు శర్మ భారంగా.

"లోపలకి రావచ్చా" అన్న గంభీరమైన కంఠధ్వని విని అదిరిపడి అవధాని. శర్మ గుమ్మంవైపు చూశారు.

'ముత్యాలముగ్గు' సినిమాలో రావుగోపాలరావులాంటి వ్యక్తి గుమ్మంలో నిలబడి వున్నాడు.

"ఆ రండి! రండి మీకోసమే మా ఆఫీసు గది తలుపులు యెల్లప్పుడూ తీసే వుంచుతాం" అన్నాడు అవధాని ఆహ్వానిస్తూ.

"భలేవాళ్ళయ్యా! ఎల్లప్పుడూ తలుపులు తీసి వుంచిదే దొంగలు పడరు" అన్నాడు రావుగోపాలరావులాంటి వ్యక్తి లోపలికొస్తూ.

"భలే జోకు వేసారండి" అన్నాడు శర్మ నవ్వు తెచ్చి

పెట్టుకొని. అవధానిగూడా పెద్దగా నవ్వాడు నవ్వు రాక పోయినా.

"అది జోకు ఏమిటయ్యా! మీ బొంత" అంటూ ఇంకో వ్యక్తి లోపలికి ప్రవేశించాడు హుందాగా.

అవధాని, శర్మ అధిరిపడి అతనివైపు చూసారు.

'పగపట్టిన సింహం' లో సత్యనారాయణలా వున్నాడు అతను.

"ఆ! రండిసార్! రండి" అని అతనిని గూడా ఆహ్వానించాడు అవధాని. అతనికి చాలా ఆనందంగా వుంది కేసులు వచ్చినందుకు.

"నా పేరు గోపాలరావు, ఇతనిపేరు నారాయణ" అని రావుగోపాలరావు లాంటి వ్యక్తి, సత్యనారాయణలాంటి వ్యక్తిని పరిచయం చేసాడు.

"మాకు ఒక చిన్న విషయంలో మీ సహాయం కావాలి. చేస్తే ఫీజుగా పదివేలు ఇస్తాం" అన్నాడు నారాయణ.

"పదివేలా" అన్నాడు శర్మ నోరుతెరచి.

"చెప్పండి సార్, చేస్తాం" అన్నాడు అవధాని ఆనందంగా.

"మేం చాలా వ్యాపారాలు చేసాం. ఎంతో డబ్బు సంపాదించాం. అయితే అన్నిట్లోకి సులువైనది, అధిక ధనవంతుల్ని చేసేది దొంగనోట్లు ముద్రించటం ఒక్కటే అని తెలుసుకొన్నాం" అని ఆగాడు గోపాలరావు.

"దొంగనోట్ల ముద్రణా" అన్నాడు అవధాని భయంగా.

"చెప్పండి సార్!" అన్నాడు శర్మ పదివేలని తలచుకుంటూ.

"దొంగనోట్లు ముద్రించటం ఎంత సులువో మార్చటం అంత కష్టం. మామూలు సాదాసీదా మనుషుల్ని పెట్టి

మార్పించవచ్చు. కాని అది చాలా రిస్కు. వాళ్ళు పట్టుబడి పోయి, మమ్మల్నిగూడా శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపించవచ్చు. లేదా మమ్మల్ని బ్లాకుమెయిల్ చేయవచ్చు. అందుకనే సమర్థుడైన మనిషికోసం గాలిస్తుంటే మీగురించి తెలిసింది. మీ పనల్లా మా దగ్గర నుంచి డబ్బు తీసుకొని వెళ్ళి, విజయవాడలోని బ్యాంకు క్యాషియర్ ప్రభాకర రెడ్డికి ఇవ్వటమే. మిగిలిన పనంతా అతనే చూసుకొంటాడు. ఇలా చేస్తే ట్రిప్పుకి పదివేలు చొప్పున ఇస్తాము. అంటే మీరు ఏలూరు నుండి విజయవాడ ఒక చిన్న సూట్కేసు పట్టుకొని వెళ్ళినందుకు మీకు ప్రతిఫలం పదివేల రూపాయలన్నమాట" అన్నాడు నారాయణ హుందాగా.

"పట్టుపడితే పదేళ్ళు జైలుశిక్ష వేస్తారు. వద్దు బాబూ, బ్రతికి వుంటే కిలో 2 రూ॥లు బియ్యం తినేనా బ్రతుకుతాం" అన్నాడు అవధాని భయం, భయంగా.

"మీరు ఊరుకోండి బాసు. పాపాత్ములే ఈ లోకంలో పచ్చగా బ్రతకగలుగుతున్నారు. పుణ్యాత్ములకు ఈ పుడిమి మీద నూకలు చెల్లిపోతున్నాయి. 'పాపీచిరాయివు' అన్నారు పాపాత్ములు. వాళ్ళ మాట ఎందుకు కాదనాలి. న్యాయంగా కేసులకోసం చూసాం దొరకలేదు. మనం పట్టుకొని వెళ్ళే పెట్టెలో దొంగనోట్లు వున్నాయి అనుకొని పట్టుకొని వెళ్ళటం యెందుకు. ఏ డిటెక్టివ్ పుస్తకాలో వున్నాయనుకొని పట్టుకొని వెడదాం. ఇక్కడ పాపమా, పుణ్యమా? అన్నది కాదు ప్రశ్న. పదివేలు, అదీ పైసలుకాదు. రూపాయలు అదీ పాయింట్. ఆలస్యం చేయకుండా ఒప్పుకోండి బాసు" అని ప్రాధేయపడసాగాడు శర్మ.

"మనిషివంటే నువ్వయ్యా! నీలాంటి చాకులాంటి మనిషే మాకు కావలసింది" అన్నాడు గోపాలరావు,

శర్మని చూస్తూ.

"నాకూ ఒప్పుకోవాలనే వుంది. కాని డిటెక్టివ్‌ల మయుండి ఈ పనికి" అని గొణిగాడు అవధాని.

"ఆ! అందుకేనయ్యా ఒప్పుకోమంటున్నది. మామూలు కిరాయి కోటిగాళ్ళకి ఈ పని అప్పగిస్తే ప్రమాదం కనుకనే మీలాంటి డిటెక్టివ్‌ల కోసం పరుగెత్తుకొని వచ్చింది" అన్నాడు నారాయణ.

"ఒప్పుకోవయ్యా! నీతి నీతి అని నీలిగితే నిలువ నీడ లేకుండా పోతావు" అన్నాడు గోపాలరావు విసుగ్గా.

"ఒప్పుకో బాసూ! నిక్షేపం లాంటి కేసు. పదివేల రూపాయల్ని కాలదన్నకు" అని సలహా ఇచ్చాడు శర్మ.

"సరే! అయితే అక్కడ ప్రభాకరరెడ్డిగారి ఎడ్రస్సు, ఇక్కడ మీ అడ్రస్సు ఇవ్వండి" అన్నాడు అవధాని.

"మా ఎడ్రస్సు మీకివ్వం. ప్రమాదం తెచ్చుకొన్నట్టు అవుతుంది. మార్చవలసిన నోట్లు వున్నప్పుడల్లా మీకు తెచ్చి ఇస్తాం. విజయవాడలో ప్రభాకరరెడ్డికి ఆ నోట్లు ఇవ్వటమే మీ పని" అని ప్రభాకరరెడ్డి ఎడ్రస్సు ఒక చిన్న కాగితంమీద వ్రాసి ఇచ్చాడు నారాయణ.

"సరే! డబ్బు ఎప్పుడిస్తారు. మేం యెప్పుడు మార్చాలి" అన్నాడు అవధాని.

"రేపు పొద్దున్నే డబ్బు తీసుకొని వస్తాం. ప్రయాణానికి రెడీగా వుండండి" అని శర్మకి, అవధానికి చెప్పి బయటకి నడిచాడు గోపాలరావు. గోపాలరావుని అనుసరించాడు నారాయణ.

"సరే. ఏం చేస్తాం. ఇంత బతుకూ బ్రతికి ఇంటి వెనక చచ్చినట్టు, ఒప్పుకొన్నాక తప్పదుగా" అని వాపోయాడు అవధాని.

2

"సత్యనారాయణగారు. అదే నారాయణగారు రాలేదా" అని ప్రశ్నించాడు అవధాని, ఒక్కడే వచ్చిన గోపాలరావుని.

"రాలేదు. వేరే పనివచ్చి ఆగిపోయాడు. ఇదిగో ఈ సూట్కేసు పట్టుకొని, విజయవాడలో ప్రభాకరరెడ్డికి ఇవ్వటమే మీ పని. మధ్యలో ఎక్కడా తెరవకండి. ప్రమాదం. ఇదిగో మీకిస్తానన్న పదివేలూ" అని పదివేల రూపాయల కట్టని అవధానికి అందించాడు గోపాలరావు.

"ఇవిగూడా దొంగనోట్లేనా?" అని అడిగాడు అవధాని.

"ఛ. కాదు. కావాలంటే పరీక్షించుకోండి. మీకు దొంగనోట్లు ఇచ్చి కొరివితో తల గోక్కుంటానా" అన్నాడు గోపాలరావు.

"అబ్బే! మా బాసు ఊరికే అన్నారు" అని సర్ది చెప్పాడు శర్మ.

"మళ్ళీ వస్తా" అని చెప్పి వెళ్ళిపోయాడు గోపాలరావు.

గోపాలరావు వెళ్ళిపోయాక ఇంటికి తాళంపెట్టి గోపాలరావు ఇచ్చిన సూట్కేసు పట్టుకొని బస్టాండుకి నడిచారు అవధాని, శర్మ. వీళ్ళు వెళ్ళేసరికి విజయవాడ వెళ్ళే బస్సు రెడీగా వుంది.

ఇంకేం ఆలోచించకుండా బస్సెక్కి కూర్చున్నారు ఇద్దరూ.

శర్మా, అవధాని విజయవాడ రావటం అదే మొదటి సారి. బస్సు దిగంగానే బస్టాండులో వున్న బస్సులన్నింటిని ఆశ్చర్యంగా చూసుకొంటూ బయటకి వచ్చారు అవధాని, శర్మలు.

"బాసూ! ఏదన్నా హోటల్‌కి వెళ్ళి కాస్త కాఫీ, టిఫిన్ తీసుకొని. అప్పుడు ఆ ప్రభాకరరెడ్డి ఇంటికి వెడదాం" అన్నాడు శర్మ.

"సరే నడు" అని సూటుకేసు ఒక చేతిలోనుంచి మరొక చేతిలోకి మార్చుకోబోతుంటే, అవధాని చేతిమీద ఎవరో కొట్టినట్టు అయింది. బాధగా పక్కకి తిరిగి చూసే సరికి, అప్పుడే ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని ఎవడో అవధాని చేతినుంచి సూట్కేసు లాక్కుని పరిగెత్తసాగాడు. ఏం జరిగింది అవధానికి ముందు అర్థం కాలేదు.

అర్థం అయి తేరుకొని పరిగెత్తటం మొదలుపెట్టేసరికి ఆ దొంగ సందుమలుపు తిరిగాడు అవధాని వెంబడించాడు.

బాసు ఎందుకు పరిగెడుతున్నాడో శర్మకి ముందు అర్థం కాలేదు. కాని బాసు చేతిలో సూటుకేసు కనిపించలేదు. అప్పుడు అతని బుర్రలో బల్బు వెలిగింది. వెంటనే బాసుకి అందగా తానూ పరిగెత్తసాగాడు శర్మ.

బస్టాండులో వీళ్ళ అయోమయాన్ని, ఆశ్చర్యాన్ని గమనించి, సూటుకేసు చూసి, "వీళ్ళెవరో పల్లెటూరి అమాయకులు, దండిగా డబ్బు తెచ్చుకొని వుంటారు. కొట్టేస్తే సరి" అని తలచిన ఒక బస్టాండు దొంగగారు ఈ సూట్‌కేసు కొట్టేసే మహాపనికి పూనుకొన్నారు.

విజయవాడ పట్టణ పౌరులకి ఇదేం అర్థంకాలేదు. ముందు వొక గళ్ళలుంగీ, తెల్లచొక్కా అతను సూట్‌కేసు పట్టుకొని పరిగెత్తటం, ఆ వెనక నల్లటి ప్యాంటు, తెల్ల చొక్కా, సన్నని మీసకట్టు, సమ్మర్‌క్రాఫ్‌తో ఒక వ్యక్తి పరిగెత్తటం, ఆ వెనుక తెల్లప్యాంటులో తెల్లషర్టు టక్ చేసి, సన్నని మీసాలు, హిప్పీజుట్టుతో మరొక వ్యక్తి పరిగెత్తటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. సినిమా షూటింగ్

అనుకోవటానికి వెనక కెమేరాలేదు. పోనీ ఒలింపిక్ రేసు అనుకొందామా అంటే అలగా కనపడ్డంలేదు. అలా ఆశ్చర్యపోతూ, ఊహాగానాలుచేస్తూ వాళ్ళనే చూడసాగారు జనం.

పరిగెత్తుకొని వెళ్ళి రైల్వేస్టేషన్లో జొరబడ్డాడు ఆ దొంగ. ఆ దొంగకి కూడా ఆశ్చర్యంగానే వుంది. 'వెధవ సూటుకేసు కోసం ఇంతసేపు తనని తరిమినవాళ్ళు లేరు' అలా ఆలోచించి అవధాని, శర్మని బండబూతులు తిట్టుకో సాగాడు ఆ దొంగ.

ఈలోపున రైల్వేస్టేషన్ దగ్గరకి దూసుకొచ్చేశారు అవధాని, శర్మలు. తెగించి స్టేషన్‌లోకి జొరబడ్డారు ఇద్దరూ.

దొంగకి విసుగ్గా వుంది. లోపలికి వెడదామా అంటే ప్లాటుఫారం టిక్కెట్టు లేదు. అందుకని మళ్ళీ బయటకే పోదామని నిశ్చయించుకొని బయటికి పరుగు తీశాడు దొంగ.

అప్పుడే స్టేషనులోకి రాబోతున్నారు ఒక యువజంట. దొంగగారు ఆదుర్దాలో చూసుకోకుండా ఆ జంటలోని అమ్మాయిని గుద్దేశాడు. ధనేలుమంటూ క్రింద పడింది ఆ అమ్మాయి.

"జయా! నిన్ను గుద్దేసి క్రిందపడేసిన వాడ్ని ఏ దేవుడూ క్షమించడు జయా. మళ్ళీ జన్మంటూ ఉంటే వాడి భార్యని నేను క్రిందపడేస్తాను జయా" అని వెధవ స్టైయిల్ ఒకటి పెట్టి, ఆ దొంగని ఏమీ చేయలేక జయనైనా లేవ తీద్దామని క్రిందకి వంగాడు ఆ యువకుడు.

ఆ దొంగమీదే దృష్టి అంతా పెట్టుకుని వస్తున్న అవ ధాని, క్రిందకి వంగిన ఆ యువకుడ్ని చూసుకోకుండా

'ధనేలు'మని గుద్దేసి, ఒక జంప్‌చేసి, లేచి దొంగ వెనుక పరుగు ప్రారంభించాడు.

ఆ యువకుడు నరంపట్టేసి వెంటనే లేవలేకపోయాడు. ఈలోపున. జయ అనే అమ్మాయి లేచి, "నాగేశ్వరరావు, లే. మళ్ళీ నరం పట్టేసిందా" అని బాధగా అడిగి, అతడిని లేపటానికి క్రిందికి ఒంగింది.

బాసు మిస్సయిపోయాడు. దొంగ అంతులేకుండా పోయాడు, అన్న కంగారులో జయని "ధనేలు"మని గుద్దేసి ఒక పిల్లిమొగ్గవేసి, అక్కడనుండి పరిగెత్తాడు శర్మ.

ఈ లోపున నాగేశ్వరరావు లేచి "మళ్ళీ జన్మంటూ వుంటే వాళ్ళు నరకానికి పోతారు" అని అవధానిని, శర్మని, దొంగని ఉమ్మడిగా దీవించి జయని లేపాడు.

జయా, నాగేశ్వరరావు ఇద్దరూ కుంటుకుంటూ స్టేషన్ లోకి నడిచారు.

దొంగ మళ్ళీ బస్టాండు వైపు బయలుదేరాడు అవధాని, శర్మలు పట్టుదలగా వెంబడించసాగారు.

స్పీడుగా వస్తున్న సిటీ బస్సు డ్రయివర్‌కి ముందు అర్థంకాలేదు. తెరుకొని అద్దంలోంచి చూసేసరికి యెవడో కళ్ళలుంగీ, తెల్లచొక్కాతో చేతిలో సూటుకేసుతో దగ్గరికి వచ్చేసాడు. వాడు యెక్కడ చస్తాడో అన్న భయంతో బస్సుని పక్కకి తిప్పేశాడు డ్రయివర్. బస్సులో కాసేపు హాహాకారాలు.

ఆ బస్సు వెనకే వస్తున్న ఒక రిక్షావాడు బస్సు పక్కకి తిరగడంతో ఖంగారుపడి, తాను కూడా పక్కకి తిప్పేసాడు. రిక్షా ఆ పక్కనే వున్న మురికిగుంటలో పడింది.

సిటీబస్సుకి, రిక్షాకి మధ్యవున్న ఖాళీలోంచి దొంగ నేర్పుగా పరిగెత్తాడు.

"దొంగ, దొంగ" అని అవధాని అరుద్దామనుకొన్నాడు. కాని అరిస్తే తమ బ్రతుకులే బెజవాడ అయిపోతాయి. దొంగ దొరుకుతాడు. వాడ్ని పోలీసులకి అప్పగిస్తారు జనం. పోలీసులు సూటుకేసు మూత తెరిచిచూస్తే అందులో ఉన్న వన్నీ దొంగనోట్లే. అప్పుడు దొంగని వదిలేసి తమ భరతం పడతారు బెజవాడ పోలీసులు: అలా ఆలోచించి అరిచే కార్యక్రమాన్ని విరమించుకొని దొంగ వెనకపడ్డాడు అవధాని.

శర్మ మాత్రం యివన్నీ ఆలోచించలేదు. బాస్ ఎందు వల్ల, 'దొంగ, దొంగ' అని అరవట్లేదా అని ఆలోచించాడు. పరిగెత్తడంవల్ల ఆయాసం వచ్చి అరవలేకపోతున్నాదేమో, అని తలచి తనే 'దొంగ, దొంగ' అని గట్టిగా అరిచాడు శర్మ.

'దొంగ, దొంగ' అని అరుపులు ఎప్పుడయితే వినపడ్డాయో వెంటనే పక్కసందు నుండి పోతున్న ఇన్‌స్పెక్టర్ చిరంజీవి తన మోటారు సైకిలుని యిటువైపు త్రిప్పాడు. మోటారుసైకిలు వెనక కూర్చున్న ఎస్సై మోహన్ ఆశ్చర్యంగా చూడసాగాడు.

బస్టాండులోకి వెళ్ళి బస్సెక్కి అవధాని, శర్మల నుంచి దూరంగా పారిపోదామన్న ఆలోచన మనస్సులో నిలుపుకొని పరిగెడుతున్న దొంగ, వేగంగా వస్తున్న ఇన్‌స్పెక్టర్ చిరంజీవి మోటార్ సైకిల్ని గుద్దేసి 'ధనేలు' మంటూ పడిపోయాడు.

శర్మ "దొంగ, దొంగ" అని అరవడంతో శర్మకి ముందు పరిగెడుతున్న అవధానే దొంగ అనుకొన్న విజయవాడ పౌరులు వీరోచితంగా ముందుకు వచ్చి అవధానిని పట్టుకొన్నారు.

అవధాని నెత్తి. నోరు బాదుకొని చెప్పినా ఎవరూ వినలేదు. ఆఖరికి శర్మవచ్చి చెప్పినా ఎవ్వరూ ఖాతరు చేయలేదు. ఇంతలో యెవరో 'అరిగోరోయ్! ఇన్‌స్పెక్టర్ చిరంజీవిగారు. వారిదగ్గరకి ఈ దొంగాడ్ని తీసుకొని వెడదాం. వాళ్ళే తేలుస్తారు వీడి సంగతి" అన్నారు.

వెంటనే గొర్రెల మందలాంటి గుంపు, అవధానే దొంగ అనుకొని నడిపించుకుంటూ పోలీసుల వైపుకి తీసుకొని వెళ్ళసాగారు.

ఈలోగా "ఏరా దొంగరాస్కెలు. ఏది ఆ సూటుకేసు యిలా ఇవ్వు" అని దొంగకి రెండు కరాటే పరోటాలు తినిపించి, సూటుకేసు లాక్కున్నాడు చిరంజీవి.

సూటుకేసు మూత తెరిచిన చిరంజీవికి మతిపోయింది. సూటుకేస్‌లో చెత్తకాగితాలు పేర్చివున్నాయి. లోపల చిన్న చిన్న గాజుజాడీల్లో ఏదో ద్రావకంలో "కళ్ళు" భద్రపరచి వున్నాయి. వాటిని లెక్కవేస్తే పాతిక జతల 'కళ్ళు' లెక్క తేలాయి. వెంటనే చిరంజీవి కళ్ళముందు డి.ఎస్.పి. గారు చెప్పిన విషయాలు, పేపర్లో చదివిన విషయాలు గిర్రున తిరిగాయి.

'ఏలూరు, పరిసర ప్రాంతాలలో మూడురోజులలో పాతిక దారుణమైన హత్యలు జరిగాయి. హతులందరూ పాతిక ఏళ్ళలోపువారే. హతులెవరికీ కళ్లు లేనట్లు, కళ్ళ స్థానంలో రెండు గుంటలు మాత్రం దర్శన మిచ్చాయి పోలీసులకి. 'కళ్ళ' కోసమే ఈ హత్యలు చేసినట్టు పోలీసువర్గాల వారు భావిస్తున్నారు. హంతకుల కోసం పోలీస్‌లు తీవ్రంగా గాలిస్తున్నారు."

ఆలోచనలోంచి తేరుకొన్న చిరంజీవి దొంగని లాగి పట్టి ఒక్కటి గుద్దాడు. దొంగ తూలి వెనక్కిపడ్డాడు.

ఆ తరువాత లేచి "సార్! ఈ 'కళ్ళ'కి నాకు ఎటువంటి సంబంధమూ లేదు. సార్! అరిగో ఆయన దగ్గర యీ సూటుకేస్ అరగంట క్రితం బస్టాండులో కొట్టేసాను" అని దూరంగా జనం చేతిలో ఇరుక్కొని పడుతూ లేస్తూ వస్తున్న అవధానిని చూపించాడు దొంగ.

ఈ లోపున జనం అవధానిని చిరంజీవి దగ్గరికి తీసుకొని వచ్చారు. శర్మకూడా వాళ్ళ వెనకాలే వచ్చాడు.

"అమాయకుల్ని చంపి, వాళ్ళ 'కళ్ళు' పెకలించి విదేశీయులకి అమ్ముతున్నందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను" అని అరచి అవధానిని పట్టుకొన్నాడు చిరంజీవి.

అప్పుడు చూసాడు అవధాని సూటుకేస్‌లో వున్న 'కళ్ళ'ని. చూసి నిర్ఘాంతపోయాడు. శర్మ కూడా షాక్ తిన్నాడు.

ఇక దాచి లాభంలేదని, దాస్తే మొదటికే మోసం వచ్చి అసలు హంతకులు తప్పించుకుపోవచ్చని తలచి, గోపాలరావు, నారాయణ రావటం, దొంగనోట్లు మార్చమనటం దగ్గర నుండి, జరిగినదంతా ఇన్‌స్పెక్టర్ చిరంజీవికి చెప్పాడు అవధాని.

శర్మ కూడా అవధాని చెప్పినదానిని బలపరిచాడు.

"అయితే మీ దగ్గర ప్రభాకర రెడ్డి ఎడ్రస్సు వుంది కదా. ఆ ప్రభాకర రెడ్డి బ్యాంకు క్యాషియర్ అయివుండడు. ఎందుకంటే ఇవి దొంగనోట్లు కావు కనక. ఆ ప్రభాకర రెడ్డి యింటికి వెళ్ళి నాలుగు సమోసాలు తినిపిస్తే ఆ గోపాలరావు, నారాయణల ఎడ్రస్సు చెబుతాడు. పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి బలగంతోపాటు ప్రభాకర రెడ్డి ఇంటికి వెడదాం" అని చెప్పి, అవధాని, శర్మని తీసుకొని పోలీస్‌స్టేషన్ వైపు బయలుదేరాడు ఇన్‌స్పెక్టర్ చిరంజీవి హుందాగా. □

కొరడా దెబ్బ

సరసి

మా ఆవిడ ఏది కావాలన్నా క్షణాలమీద తెచ్చియిచ్చి ఆమె కళ్ళల్లో వెలిగే ఆనందజ్యోతుల తాలూకు కాంతుల్ని చూసి ముచ్చటపడిపోయే అలవాటు వున్న నేను మా పెళ్ళి అయి ఈ దసరాకి సరిగ్గా సంవత్సరం కావొస్తున్నా కొత్తలో ఆమె ముచ్చటపడి ప్రాధేయపూర్వకంగా అడిగిన ఒకే ఒక్క కోరికను మాత్రం తీర్చలేకపోయానే

అన్న దిగులుతో. ఆశక్తతతో బెంగ పెట్టుకోబోతున్న సమయంలో హఠాత్తుగా మా కజిన్ సుబ్రమణ్యం గుర్తుకొచ్చి ఆ సాయంత్రం ఆఫీసు నించి సరాసరి వాళ్ళింటికి వెళ్ళి సంగతంతా చెప్పి సలహా చెప్పమని కళ్ళు మూసుక్కూచున్నాను, వాడికెదురుగా వున్న కుర్చీలో.

"స్టాపుకి దూరంగా స్త్రీలూ వృద్ధులే కాక ఏ ఇతర ప్రయాణీకుడు కూడా అందుకోలేనంత దూరంలో సిటీ బస్సు లాపుతున్న ఈ రోజుల్లో, ఒకవేళ శక్తికొద్దీ పరిగెట్టినా పుష్పక విమానంలాంటి ఆ బస్సుల్లో తన్నుకుంటూ పొడుచుకుంటూ ఎక్కలేక, ఒకవేళ అదృష్టవశాత్తూ క్షేమంగా యెక్కగలిగినా పోకిరీ వెధవలు మీదపడి రాసుకుంటూ నిలబడితే సహిస్తూ ప్రయాణించలేక, ఓ ఆడకూతురు—అదే నీ భార్య "ఓ స్కూటర్ కొనుక్కుందామండీ!" అని ఎట్టకేలకు ఒక కోరిక కోరిందంటే అది ఎంత మాత్రం విలాసంకోసం కాదనీ అది తప్పకుండా తీర్చవలసిన అవసరమైన ఓ కోరిక అని నేను ఘంటాపథంగా చెప్తాన్రా!" అన్నాడు సుబ్రమ్మణ్యం గుక్క తిప్పుకోకుండా.

"అది నిజమేనోయ్! నా దగ్గిర తన్నినా ఓ పెన్నీకూడా లేదే? అలాంటప్పుడు తొమ్మిదివేలు ఎప్పటికి కూడబెడతానూ? ఎప్పుడు స్కూటర్ కొని మా ఆవిణ్ణి రంజింపజేస్తాను!" సందేహం వెలిబుచ్చాన్నేను.

సుబ్రమణ్యం తీవ్రంగా ఆలోచించి "రేపు రా చెప్తా" అన్నాడు.

వాడికి ఓ డ్రామా డ్రస్ కంపెనీ వుంది. మర్నాడు సరాసరి నన్నక్కడికి తీసికెళ్ళి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డ్రస్ వేయించాడు. బొద్దుమీసాలు అతికించుకుని, టోపీ, బూట్లూ,

రివాల్వర్ కిట్టు—ఇవన్నీ వేసుకునేసరికి నేను నిజంగా ఓ పెద్ద పోలీసాఫీసర్లా కనబడ్డాను అద్దంలో. చేతికి చిన్న నల్ల చేవ లాటీకర్ర ఇచ్చి ఏం చెయ్యాలో వివరంగా చెప్పి "ఇక వెళ్ళిరా! ఆల్దిబెస్ట్!" అన్నాడు సుబ్రమణ్యం.

"ఓరి వీడి దుంపతెగా! వీడి బుర్రలో ఎన్ని తెలివితేట లున్నాయ్? బిజినెస్ బుర్ర!!" అని వాణ్ణి మనసులో మెచ్చు కుంటూ రోడ్డు చేరుకుని ఆటోని పిల్చాను.

అనుకున్న చోటికి ఆటో చేరగానే డ్రైవర్తో "ఇక్కడే వుండు నే వచ్చేదాకా" అని చెప్పి సందు చివరి దాకా నడుచుకుంటూ వెళ్ళి ఎడమవైపుకి తిరిగి లైబ్రరీ పక్కనున్న ఓ డాబా యిల్లు తలుపు తట్టాను మెల్లగా.

ఎవడో తలుపు కొంచెం తెరిచి నన్ను చూసి చటుక్కున వేసెయ్యబోయాడు. నేను మెరుపువేగంతో తలుపు మూత బడకుండా బూటుని తలుపు సందులో పెట్టి శక్తికొద్దీ గట్టిగా తోసి లోపలికి ప్రవేశిస్తూనే గడియవేశాను.

ఇరవై నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుని బైట కొచ్చాను మొహానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ.

ఆటో యెక్కి "వచ్చిన చోటుకే పోనీ" అన్నాను.

"నాకు తెల్సురా అంటిస్తే అంటుకుంటావు నువ్వు! ఎలా అదరగొట్టావో ఇప్పుడు చెప్పు" అంటూ కుర్చీ ముందుకు జరుపుకున్నాడు సుబ్రమణ్యం.

"లోపలి కెడుతూనే తలుపు బోల్టు పెట్టేసి కిట్ లోంచి రివాల్వర్ తీశాను. తలుపు తీసినవాడు నా మీదికి చెయ్యెత్తే లోగానే మెడమీద బలంగా ఒక్కటిచ్చేసరికి వాడు మూలు గుతూ కింద పడిపోయాడు మసకగా వున్న ఆ వెలుతుర్లో తడువుకుంటూ ఎదురుగా వున్న హాలులోకి ప్రవేశించాను. అక్కడే వుంది సంగతంతా.

ఓ చిన్న స్క్రీన్‌మీద బ్రహ్మాండంగా 'బ్లూ ఫిల్మ్' ప్రదర్శించబడుతోంది. పదిహేను మంది ప్రేక్షకులు తల తిప్పకుండా, జీవితం ధన్యమైందన్నట్లుగా కళ్ళింత చేసుకుని నోళ్ళు వెళ్ళబెట్టి రసవత్తరంగా చూస్తున్నారు ప్రతిసీనునీ. రెండు నిమిషాలపాటు నేను కూడా సినిమా చూసి, ప్రక్కనే గోడకున్న లైట్ స్విచ్ ఆన్ చేశా.

లైట్లు వెలిగాయి! ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చి పడిన ప్రబుద్ధులంతా నన్నూ నా చేతిలో మెరుస్తున్న రివాల్వర్‌నీ చూసి "కెవ్వు"మన్నారు. ప్రదర్శన ఆగి పోయింది.

"ఎవ్వరూ కదలకండి! పిచ్చిపనులు చేస్తే పుర్రెలెగిరి పోతాయ్!" అన్నాను నువ్వు చెప్పిన డైలాగు యథా తథంగా.

బిక్కచచ్చిపోయారు జనాలు. అందరూ సంఘంలో పెద్దమనుష లాయె! గుట్టు కాస్తా రట్టయితే పెళ్ళాం పిల్ల ల్లోనూ, బంధువుల్లోనూ, నలుగుర్లోనూ తలెత్తుకోలేరు.

అందుకే కాళ్ళబేరానికొచ్చి పాతికా యాభై నా చేతిలో పెట్టి "కేసు లేకుండా చూసి మమ్మల్ని గుట్టుగా విడిచి పెట్టు నాయనా! నీ పేరు చెప్పుకుంటాం! జన్మలో యిటు వంటి తప్పుడు పనులు మరి చెయ్యం!" అన్నారు అంతా ఒక చోటుచేరి.

నువ్వు చెప్పావుగా-అప్పటికప్పుడు లంచం అడిగితే వాళ్ళ దగ్గిరేముంటుందీ వందా యాభయ్యో తప్పితే?- అని. అందుకే ఒక్కొక్కళ్ళూ వెయ్యి వెయ్యి రూపా యలు ఇచ్చేటట్టూ వాళ్ళ అడ్రస్‌లు తీసుకుని రేపు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి నేను వసూలు చేసుకునేటట్టూ ఇక కేసు లేకుండా వదిలేసేటట్టూ ఒప్పందం చేసుకున్నాను.

అందరూ డబ్బు పుచ్చిపోతున్న ముసలి ధనవంతులు కాబట్టీ వెయ్యి అంటే వాళ్ళకు లెక్కలోది కాదు కాబట్టి వెంటనే ఒప్పేసుకుని దడదడా అడ్రసులిచ్చి రాసుకోమన్నారు. ఎవ్వడూ తప్పుడు ఎడ్రస్ ఇవ్వ లేదనే అనుకుంటున్నాను. ఒకవేళ అలా తప్పుకుందామని యెవరైనా ప్రయత్నించినా వారి సాయంతో అటువంటి వాళ్ళని పట్టుకోవడం నాకు పెద్ద కష్టం కాదనీ ఆ తర్వాత వాళ్ళ పాట్లు భగవంతుడికే తెలుస్తాయనీ బెదిరించాను.

లిస్టు రాసుకుని 'బ్రతుకుజీవుడా' అనుకుంటూ బైట పడి యిలా వచ్చా. ఇవిగో నీ మీసాలూ డ్రస్సూను'' అని ముగించాను.

పగలబడి నవ్వుకున్నాం ఇద్దరం పదినిమిషాలపాటు.

మర్నాడు ఉదయమే ఏడుగంటలకే త్వరగా తెమిలి బయల్దేరాను ఇంట్లో. నేను స్కూటర్‌కోసం పడుతున్న ఈ పాట్లేమీ మా ఆవిడకి తెలియనివ్వలేదు. ఆడవాళ్ళ నోట్లో నువ్వుగింజ ఆగదనీ నా భయం.

"ఎప్పుడూ లేంది ఈవేళ న్యూస్‌పేపర్ కూడా చదవ కుండా వెళ్ళిపోతున్నారేమిటి పొద్దున్నే? పని బాగా ఉందా ఆఫీస్‌లో?'' అంది మా ఆవిడ.

దానికేం తెల్సు ఈ రోజు ఆఫీస్‌కి సెలవుపెట్టి డబ్బు వసూళ్ళకి తిరుగుతున్నాననీ? తలాడించి ఆమె బుగ్గమీద ఓ చిటికేసి బైటకొచ్చాను హుషారుగా.

పావుగంటలో నన్ను మళ్ళీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మార్చేశాడు సుబ్రమణ్యం. లిస్టులో మొదటి పేరు చూసు కుని ఆటోని పిల్చి ఎక్కాను.

గేటు పక్కగా గోడలో పాలరాతి బోర్డు—"కళ్యాణ సుందరం'' అని. ఆటో ఆపి లోపలికెడుతూ అనుకున్నాను

కళ్యాణం అయ్యి యాభయ్యో పడిలో పడినా మానవుడి కింకా వాంఛలు చావలేదు. ఈ ఫైను కట్టేక మరింక 'బ్లూ ఫిల్మ్' జోలికి పోడు.

నౌఖరు వెళ్ళి చెప్పేసరికి తలుపు తెరుచుకొచ్చి నన్ను లోపలికి తీసికెళ్ళాడు కళ్యాణసుందరం. తన ప్రైవేట్ రూంలో కూర్చోబెట్టి తలుపు లాక్ చేసి వచ్చి వెయ్యి రూపాయలు తీశాడు.

అవి నా చేతిలో పెడుతూ "వాస్తవంగా నేనుదా సినిమా అంతా చూడలేదు. అది ప్రారంభమయిన వెంటనే నీవు వస్తివి. నిన్ను చూసి నాకు భయమ్ కలిగి నీ వెను కనే నేనుకూడ బయటకు వచ్చి శీఘ్రం వీటుకి వచ్చివేస్తిని. కొంచెం కన్సిషన్దా యిస్తే సందోసం" అని చేతులు నలపడం ప్రారంభించాడు.

"అమ్మో యెన్ని తెలివితేటల్రా నీకు?" అని లోపలే తిట్టుకుని "ముడియాదు, ముడియాదు" అనేసి లేచి వచ్చేశాను, బోణీ వెయ్యి రూపాయలు ముట్టినందుకు సంతోష పడిపోతూ.

అనుమానం రాకుండా ఆటోని సెంటర్లో వదిలేసి 'శేర్ చమన్‌లాల్ పూల్‌చంద్' ఇంటికి బయల్దేరాను వేరే ఆటోలో.

చమన్‌లాల్‌కి నలభై యేళ్ళు పైనుంటాయి. తెల్లగా గున్నలాగా ఉంటాడు. నన్ను చూస్తూనే ఆప్తమిత్రుణ్ణి చూసినంత సంతోష పడిపోయి "ఆయియే మహరాజ్! ఆయియే" అంటూ సాదరంగా లోపలికి ఆహ్వానించి కూర్చోబెట్టి, సర్వెంట్ చేత కూల్‌డ్రింక్స్ తెప్పించాడు. వాడిని బైటకు పంపేసి తలుపులాక్ చేసివచ్చాడు.

"పిరికి వెధవలు" అని మనసులోనే నవ్వుకున్నాను.

ముసి ముసి నవ్వులు నవ్వుతూ ఇనస్పెక్టర్ దగ్గరకెళ్ళి తలుపు తెరవడానికి బదులు పైన గోడకు తగిలించి వున్న 'కొరడా' తీసి నన్ను సమీపించాడు చమన్‌లాల్.

"వీడి మొహంమండా! నన్ను కొట్టడానికా ఆ కొరడా? లేకపోతే పశ్చాత్తాపంతో అది నా చేతికిచ్చి తనని కొట్ట మంటాడా?" అని లోలోపలే తత్తరపడుతూ బైటికి మాత్రం గంభీరం నటిస్తూ కూర్చున్నాను.

"సాబ్! ఈ ఉదయం పేపరు చదివారా!" అన్నాడు వినయంగా.

"అబ్బే లేదు. ఏం?"

"దురదృష్టవంతులు" అంటూ కొరడాతో 'ఛెళ్ ఛెళ్' మని నాకు నాలుగు తగిలిచ్చేసరికి నా ప్రాణం పైనే పోయింది. గొంతు తడారిపోయింది. హూనమైపోయింది కాకీబట్టలు కప్పుకున్న నా ఒళ్ళు.

"వాట్‌నాన్సెన్స్? ఓ బాధ్యత గలిగిన పోలీసాఫీసర్ని న్యూస్ పేపర్ చదవలేదని కొట్టడానికి నీ కెంత ధైర్యం? నీ మీద క్రిమినల్ కేస్ బుక్ చేస్తా" కుర్చీలోంచి లేస్తూ అన్నాను మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి.

ఇదేం పట్టించుకోని చమన్‌లాల్ తన ధర్మం తాను నిర్వర్తించినట్లు కొరడా చుట్టబెట్టేసి మేకుకి తగిలించి వచ్చాడు తాపీగా. పక్కనే ఉన్న న్యూస్ పేపర్ తీసి మధ్య పేజీలో ఓ చోట చూపించాడు వేలుపెట్టి.

"రహస్యంగా బ్లూ ఫిల్మ్ ప్రదర్శన."

"నగరంలో స్థానిక విలాస్‌నగర్ గ్రంథాలయానికి సమీపంలో గల ఒక ఇంటిలో నిన్న రాత్రి రహస్యంగా బ్లూఫిల్మ్ ప్రదర్శిస్తున్న యిద్దరు వ్యక్తుల్నీ, పదముగ్గురు ప్రేక్షకుల్నీ పోలీసులు అరెస్టుచేసి తరువాత జామీనుపై

విడుదల చేశారు. ప్రొజెక్టర్, ఫిల్ములను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేస్ దర్యాప్తులో వుంది."

తల తిరిగిపోయింది అది చదివేసరికి. నేను వచ్చేశాక అసలైన పోలీసు లొచ్చారన్నమాట. అంటే నేను నకిలీ పోలీస్ నన్న సంగతి చమన్‌లాల్‌తో సహా మిగిలినవాళ్ళం దరికీ కూడ తెలిసిపోయుండాలి. నా వెనుకనే బైటకు వచ్చే సిన కళ్యాణసుందరానికి యీ విషయం తెలియదన్న మాట.

"అయ్యొయ్యో! పొద్దున్నే మా ఆవిడ మాటవిని న్యూస్ పేపరు చదివివుంటే ఈ దెబ్బలు తప్పేవి కదా!" అని బాధపడ్డాను.

చమన్‌లాల్ నవ్వుతూ పోలీస్‌లకి ఫోను చెయ్య బోయాడు. ఒక్కదూకు దూకి అది డిస్కనెక్టు చేసి అతన్ని కాళ్ళావేళ్ళాపడి బతిమాలుకున్నాను 'రక్షించ' మంటూ. బతిమాలగా మాలగా చివరికి "ఓ వెయ్యి రూపాయలిస్తే ఒదిలేస్తా"నని బేరం పెట్టాడు. లోపల ఏడ్చుకుంటూ కళ్యాణసుందరం ఇచ్చిన వెయ్యీ జేబులోంచి తీసి చమన్ లాల్ చేతిలో పెట్టాను.

"అబ్ ఆప్ జాసక్తే" అన్నాడు డబ్బు లెక్కబెట్టు కొని.

వెళ్ళపోయే ముందు నేను నేలమీద దేనికోసమో వెతుక్కోవడం గమనించిన చమన్‌గాడు "ఏవిటీ?" అన్నాడు.

"నా మీసాలు! పడిపోయాయి! అవి లేకుండా వెడితే బైట ఆటోవాడికి అనుమానం వస్తుంది" అన్నాను నీర సంగా.

పోయిన రెండు మీసాల్నీ వెతికి చమన్‌గాడే స్వయంగా జిగురు రాపి నా మూతికి అంటించి "అచ్ఛాహై! ఇప్పుడు మీరు అచ్చం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌వలె వున్నారు! అద్దంలో సూస్కుంటారా?" అన్నాడు నవ్వుతూ.

"నో థాంక్స్" అని వాణ్ణి లోపలే కసిగా తిట్టుకుంటూ బైటపడి జేబులోవున్న లిస్టు చింపేసి సుబ్రమణ్యం దగ్గిర కొచ్చాను.

బోడి సలహా ఇచ్చినందుకు వాణ్ణి ముక్కచీవాట్లేసే సరికి వాడు నాలిక్కరుచుకున్నాడు గట్టిగా.

డ్రస్సు మార్చుకుని మీసాలు గిరవాటేసి ఒళ్ళు నొప్పుల్తో ఇంటికి చేరేసరికి కిళ్ళీ నవుల్తూ ఎర్రగా నవ్వుతూ కనిపించేరు మావగారు వసార్లో.

నవ్వకపోతే బావుండదని ఓసారి మందంగా యికిలించి మంచంమీద వాలిపోయా ఒళ్ళు చేత్తో రాసుకుంటూ.

"ఈ పండక్కి పెళ్ళయ్యి ఏడాదవుతోంది కదోయ్ అల్లుడూ! అమ్మాయినీ నిన్నూ తీసుకెడదామని వచ్చా" అన్నాడాయన నవ్వుతూ.

"నేను రాలేనండీ మీ అమ్మాయిని తీసికెళ్ళండి" అన్నాను చిరాగ్గా మొహంపెట్టి.

"అలా అంటే యెలాగోయ్? అమ్మాయ్ ముచ్చటపడు తోంది కదాని నీ కోసం ఓ స్కూటర్ కూడా కొని వుంచా నాయె!" అన్నాడు.

లోపలనించి వస్తూ యీ మాట విన్న మా ఆవిడ మొహంలో ఒక్కసారి వెలిగాయి కోటి ఆనంద జ్యోతులు!

వాటిని చూసేసరికి ఒళ్ళు నొప్పులన్నీ ఎగిరిపోయి ఎక్కడలేని ముచ్చటా వేసేసింది నాకు ఆ క్షణంలో. □

సీరియల్

కాంచన శిఖరం

వాణిశ్రీ

(గతసంచిక తరువాయి)

"అపర్ణ వాళ్ళ నాన్న మన క్వార్టర్‌కి వచ్చాడు."

"ఊఁ.... ఏమిటట?" అన్నాడు. అతని ముఖంలో చిరునవ్వు వెలిగింది.

"అపర్ణ గురించే."

"ఇంకెందుకు వస్తాడ్లే? మీరేం చెప్పారు?"

"మాకు తెలియదని చెప్పాం."

"తర్వాత."

"కిశోర్ గురించి అడిగాడు."

"మా రూమ్‌లో వుండడంలేదని రెడ్డి దబాయించాడు కాని ఆయనగారికి కిశోర్‌మీద అనుమానం వుంది. పోలీస్ రిపోర్టు ఇస్తేగాని రోగం కుదరదని చిందులు తొక్కుతూ పోయాడు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏడవనీ...." తేలిగ్గా అన్నాడు జ్వాలా.

"వాడు నిజంగా పోలీస్ రిపోర్టు ఇస్తే?" కొంచెం భయంగా వుంది కృష్ణమూర్తికి.

"ఇస్తే యివ్వనీ. మనకేం భయం. రేపు ఈపాటికి ఛలో...." నవ్వాడు జ్వాలా.

"పోలీసులు మనల్ని పట్టుకుంటే?"

"మూర్తిభాయ్! పోలీస్‌ల సంగతి నీ కంటే నాకు బాగా తెలుసు. మనల్ని యేమీ చెయ్యడానికి వాళ్ళకి ఆధారాలు లేవు. ఆధారాలు వున్న కేసుల్లోనే వాళ్ళు చూసీచూడనట్లు పోతుంటారు. ఇక మనల్నేం చేస్తారు? నువ్వేం భయపడకు" అన్నాడు జ్వాలా.

"అంత తేలిగ్గా తీసెయ్యకు దాదా! ఒకవేళ మనం చిక్కుపడిపోతే అక్కడ కిశోర్ పని ఇరుకున పడుతుంది. మనకోసం ఢిల్లీకి రిజర్వేషను కూడా చేయించి ఎదురుచూస్తుంటాడు గూడా!" అన్నాడు కృష్ణమూర్తి.

"అదంతా నేను చూసుకుంటాలే. పద క్వార్టర్‌కి. ఆకలి దంచేస్తోంది. క్యారేజి వచ్చేసిందా?" అన్నాడు.

"ఆఁ...."

"ముందు కడుపులో పడితేగాని ఐడియాలు రావు"

నవ్వుతూ అన్నాడు దాదా.

జ్వాలా నిబ్బరానికి కృష్ణమూర్తి విస్తుపోయాడు.

9

ఢిల్లీవరకూ ఏ ఆటంకమూ లేకుండా హాయిగా సాగింది ప్రయాణం. ఎవరెస్టు హోటల్లో రెండు రూములు తీసుకుని అంతా సర్దుకున్నారు. రెండు రోజులపాటు ఢిల్లీలో చూడ దగిన ప్రదేశాలు చూశారు. జ్వాలా బాంక్ లాకర్‌లో వున్న లక్ష్మి విగ్రహం తెచ్చి రూంలో పెట్టాడు.

"దాదా ఇంకా చూడాల్సిన ప్రదేశాలు ఏవైనా వుంటే చూపించు. అన్నీ చూసివెళ్దాం" అన్నాడు ఫణీంద్ర.

"ఢిల్లీలో దాదాపు అన్నీ చూశాం. ఉత్తరప్రదేశ్‌లో చూడాల్సినవి యెన్నో వున్నాయి" అన్నాడు జ్వాలా.

"అవన్నీ చూపించు దాదా! నాకెంతో ఇంట్రెస్టింగ్ వున్నాయి హిస్టారికల్ ప్లేసెస్" అన్నాడు ఫణి.

జ్వాలా నవ్వాడు.

"చూడు భాయ్! ఉత్తరప్రదేశ్‌లో అన్నీ చూడాలంటే సంవత్సరంపాటు చూస్తూ వుండొచ్చు. ఇది ఆంధ్రప్రదేశ్ కాదు."

"అబ్బా! అన్ని ముఖ్యప్రదేశా లున్నాయా?"

"అవన్నీ చూపితీరాల్సిందేగాని నోటితో చెప్పాల్సినవి కాదు. ఉత్తరప్రదేశ్‌ని చూస్తే భారతదేశాన్ని చూపినట్లే అనే సామెత అక్షరాలా నిజం. ప్రపంచంలో వింత కట్టడంగా చెప్పుకునే ఆగ్రాలో తాజ్‌మహల్ సంగతి మీకు చెప్పాల్సింది ఏముంది? ఫతేపూర్ సిక్రీ వంటి పురాతన రాజధాని నగరాలు యెన్నో వున్నాయి. కృష్ణుడు పుట్టిన మధుర, ఆయన గడిపిన బృందావన్, రాముడు పుట్టిన అయోధ్య యిక్కడేకదా వున్నాయి. ఇక రాజధాని లక్నోకి

ఉద్యానవనాల నగరం అనే పేరుంది. త్రివేణి సంగమం అని గంగ, యమున, సరస్వతి నదుల కలయిక అలహాబాద్‌లో చూసితీరాల్సిందే హిందువుల పుణ్యక్షేత్రం కాశీ సంగతి తెలియనివాళ్ళు ఎవరూ వుండరు."

"కాశీ గూడా ఉత్తరప్రదేశ్‌లోనే వుందా?"

"అవును భాయ్! బుద్ధుల పుణ్యక్షేత్రం సారనాథ్ గూడా యిక్కడే వుంది. రెండువేల ఐదువందల సంవత్సరాలకు పూర్వం యిక్కడే ధర్మబోధలు చేశాడట. ఇంకా అనేక బౌద్ధుల పుణ్యక్షేత్రాలు వున్నాయి. అందులో ముఖ్యమైంది శ్రావస్తి. ఇక్కడ బుద్ధుడు ఇరవైనాలుగు వర్ష ఋతువులు గడిపాడట."

"దాదా! అవన్నీ వింటుంటే చూడాలని తపించిపోతున్నాను." అన్నాడు ఫణీంద్ర.

"ఇంక హిమాలయపర్వతాల్లో పవిత్ర నదులు యమున పుట్టిన యమునోత్రి, గంగ పుట్టిన గంగోత్రి, చూడొచ్చు. కేదార్‌నాథ్, బదర్‌నాథ్, ఋషికేష్, హరిద్వార్ వంటి క్షేత్రాలు చూడాలంటే ఎంతకాలం పడుతుందో చెప్పలేం. అదీగాక అవి సమ్మర్‌లోనే చూడాలి."

"ఇక చాలు దాదా!"

"సమ్మర్‌లో హిల్ స్టేషన్సు. నైనిటాల్, ముస్సోరి...." అంటూ పకపక నవ్వాడు జ్వాలా.

"దాదా! మమ్మల్ని వుడికించకు." అన్నాడు ఫణి.

"మనం పుణ్యం సంపాదించుకోవడానికని యాత్రలు చేయడానికి రాలేదు. మనం సాహసయాత్రకు వచ్చాం గుర్తుంచుకోండి." తీవ్రంగా అన్నాడు మేఘనాధ్‌రెడ్డి.

"ఇంపార్టెంట్ ప్లేసెస్ చూడాలని కోరుకోడం తప్పా?" కోపంగా అన్నాడు ఫణీంద్ర.

"అంతే మరి. మనం సరదాగా తిరగడానికే డబ్బు ఖర్చుపెట్టుకుంటూపోతుంటే తర్వాత మన గతి ఏమిటి? చేతిలో డబ్బు అయిపోక ముందే లక్ష్యం చేరుకోవాలి" మేఘనాథ్ కోపంగా అన్నాడు.

"అరె భాయ్! అనవసరంగా పోట్లాడుకోకండి" అన్నాడు జ్వాలా ఇద్దర్నీ శాంతపరుస్తూ.

"చూడు దాదా! రెడ్డి అనవరంగా కోప్పడుతున్నాడు." అన్నాడు ఫణి.

"నేనేం కోప్పడ్డం లేదురా! ఒక పనిమీద బయల్దేరి నప్పుడు మన దృష్టి లక్ష్యంమీదే వుండాలని అంటున్నాను" అన్నాడు మేఘనాథ్.

"లక్ష్యం తప్పి ఎవరు పోతున్నారు కొత్త ప్రదేశానికి వచ్చినప్పుడు ఇక్కడి వింతలు, విశేషాలు తెలుసుకోవాలను కోవడం తప్పా?"

"తెలుసుకోవడం తప్పుకాదు. అవన్నీ చూడ్డానికి బయ ల్దేరిపోదాం అంటేనే!"

"అరె భాయ్! మీ పోట్లాట ఇక ఆపండి. రెడ్డిభాయ్! నువ్వు కొంచెం తగ్గు. వాడు తీసికెళ్ళమని అంటేమాత్రం నేను తీసికెళ్తానా? నాకు ఆ మాత్రం తెలీదా? నువ్వింక వూరుకో" అన్నాడు జ్వాలా.

ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు.

"దాదా! ఇక మన ప్రయాణానికి ముహూర్తం పెట్టు" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

"నేనేం పురోహితుడ్నా పంచాంగంచూసి ముహూర్తం పెట్టడానికి. అయినా సాధించాలనే పట్టువల, ఆత్మవిశ్వాసం వుండాలే గాని ముహూర్తా లెందుకు?" అన్నాడు జ్వాలా నవ్వుతూ.

"ముహూర్తం అంటే నా వుద్దేశ్యం టైం ఫిక్స్ చెయ్యమని. అంతే" అన్నాడు కృష్ణమూర్తి.

"కిశోర్ సంగతి ఏమిటి? అని ఆలోచిస్తున్నాను. మనం తిరిగివచ్చేవరకూ ఎక్కడ వుంచాలి? ఏం చేయాలి? ఏదైనా ఏర్పాటు చెయ్యాలిగదా!" అన్నాడు దాదా.

అపర్ణ వింతగా చూసింది.

"ఏమీ అనుకోకపోతే నాకీ విషయం చెప్పండి. అసలు మీ ప్రయాణం యెక్కడికి? యెందుకెళ్తున్నారు?" అని ప్రశ్నించింది.

అపర్ణకు సాహసయాత్ర గురించి ఏమీ తెలియదు. కిశోర్ గూడా ఆమెకు అసలు విషయం చెప్పలేదు.

కిశోర్, దాదావైపు చూపి మందహాసం చేశాడు. అంతా ముఖాలు చూసుకున్నారు. ఆమెకు సమాధానం యెవరు చెప్పాలో అర్థం కావడంలేదు. జ్వాలా ఆలోచిస్తున్నాడు ఏదో.

"ఎవరూ మాట్లాడరేమిటి?" అపర్ణకు ఆశ్చర్యంగా వుంది ఎవరూ సమాధానం చెప్పకపోవడం.

కిశోర్ సందిగ్ధావస్థలో పడ్డాడు.

"బేటీ! మేం చాలా దూరం పోతున్నాం. తిరిగిరావడానికి చాలా టైం పడుతుంది" అన్నాడు జ్వాలా.

"చాలా దూరం అంటే యెక్కడికి?" సూటిగా ప్రశ్నించింది.

"మాకు వుద్యోగాలు పోయాయి గదా! డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచిస్తున్నాం" అన్నాడు.

"డబ్బు సంపాదించడానికి చాలా దూరం పోవాలా? మీ దగ్గర ఏదో కొంచెం డబ్బు వుంది గదా! అది పెట్టుబడి పెట్టి ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చు" అంది అపర్ణ.

"వ్యాపారమా? మాకు యెందులో అనుభవం వుందని" నవ్వుతూ అన్నాడు జ్వాలా.

"ఎక్కడైనా మంచి సెంటర్ చూడండి హోటల్ పెట్టేదాం. నేను చెప్పినట్లు చెయ్యండి చాలు. నేను నడుపుతాను హోటల్" అంది అపర్ణ.

అంతా పకపక నవ్వారు.

"నవ్వుతారెందుకు?" అంది ఆశ్చర్యంగా.

"నవ్వక ఏడవాలా? హోటల్ పెట్టడానికి ఈ ఢిల్లీ వరకూ రావాలా? హైదరాబాద్ చాలదూ! లేకపోతే ఏ బెజవాడో, వైజాగో, గుంటూరో పోవచ్చు. మనకి ఎన్ని పట్టణాలు లేవు" అన్నాడు కిశోర్.

"ఏమిటో మీ సంగతి అర్థం కావడంలేదు" అంది అపర్ణ.

"అర్థం కావడానికేంలేదులే. దాదా సంగతి నీకు పూర్తిగా తెలీదు. ఆయన ఒకప్పుడు రాజకుమారుడు. కాలం కలిసిరాక యిట్లా మనలా సామాన్యుడిగా బ్రతుకుతున్నాడనుకో. ఆయన పూర్వీకులు దాచిన నిధి ఒకటి వుందట. అది ఎక్కడుందో తెలుసుకోవాలని మనవాళ్ళు పట్టుదలగా బయల్దేరారు. నిజానికి దాదాకి ఇందులో ఏమీ ఆసక్తి లేదు. ఆయనకేం బ్రహ్మచారి. ఒక్కడు యెలాగైనా బ్రతికెయ్యగలడు. కాని మనవాళ్ళు ఆయన్ని బలవంతపెట్టి ఒప్పించి బయల్దేరతీశారు. అదీ సంగతి" కిశోర్ టూకీగా చెప్పాడు ఆమెకు.

"అటువంటప్పుడు వాళ్ళతోపాటు మనం మాత్రం యెందుకు వెళ్ళగూడదు?" ప్రశ్నించింది అపర్ణ.

కిశోర్ మాట్లాడలేదు.

"అది చాలా కష్టంతో కూడిన ప్రయాణం. మైళ్ళకొద్దీ

దూరం నడవాల్సి వస్తుంది. అడవుల్లో, కొండలమీద యెన్నో కష్టాలు ఎదుర్కోవాలి" అన్నాడు దాదా.

"మీకు లేని కష్టాలు నాకు రావుగదా! మేమూ మీతోనే వస్తాం దాదా!" అంది అపర్ణ.

"వద్దమ్మా! నువ్వు ఆడపిల్లవు. అవన్నీ నువ్వు తట్టుకో లేవు. అనవసరంగా కోరి కష్టాలు తెచ్చుకోవడం ఎందుకు? మేం వచ్చేవరకూ ఇక్కడ వుండండి" అన్నాడు మేఘనాథ్ ఆమెకు నచ్చచెప్తూ.

"కష్టమో నష్టమో? అదంతా నాకు తెలీదు. మీతో పాటు బయల్దేరాను. మీతోపాటే అన్నీ భరిస్తాను. మిమ్మల్ని ఎక్కడికో పంపించి మేం హాయిగా యిక్కడ యెలా వుండగలం?" అంది అపర్ణ.

దాదా ఏదో చెప్పబోయాడు.

"దాదా! ప్లీజ్! కాదనకండి. కిశోర్ నువ్వేం మాట్లాడ వేం?" అంది.

"దాదా! అపర్ణ చెప్పినట్లే చేద్దాం. మేము గూడా మీతోనే బయల్దేరతాం. మిమ్మల్ని వదలి వుండడం నాకూ ఇష్టంగాలేదు. కాని అపర్ణ కోసం ఒప్పుకున్నాను. ఇప్పుడు అపర్ణే ధైర్యంగా బయల్దేరుతోంది. మనకేం అభ్యంతరం" అన్నాడు కిశోర్.

"దాదా! నేను మీ వెంట రావడం వలన మరొక వుప యోగం గూడా వుంది. మీరు చేతులు కాల్చుకోనక్కర్లేదు. బ్రహ్మాండంగా వంటచేసి పెడుతూ వుంటాను" అంది అపర్ణ.

అంతా నవ్వారు.

కిశోర్, అపర్ణ గూడా సాహసయాత్రలో పాల్గొనడానికి నిర్ణయమైంది.

10

మర్నాడు సాయంకాలం హోటల్లో రూమ్స్ ఖాళీచేసి రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. ఢిల్లీకి మూడువందల మైళ్ళ దూరంలో కాళీనగర్ స్టేషన్‌కి చేరాలి. అక్కడ్నుంచి ఇక రైలులైను లేదు.

సాయంకాలం ఆరు గంటలకు రైలు బయల్దేరింది.

"దాదా! నువ్వు ప్రణయసామ్రాజ్యం ఏలిన చోటైనా చూపిస్తావా? లేక అదీలేదా?" జ్వాలా చెవిలో నెమ్మదిగా అన్నాడు ఫణీంద్ర.

"విజయపూర్ గురించికదూ నువ్వు అంటున్నది. మన ప్రయాణం అక్కడ్నుంచే దారిలోనే వుంటుంది. అక్కడొక రోజు వుండిపోదాంలే" అన్నాడు జ్వాలా.

ఆ ప్రదేశం తనుగూడా చూడాలని కోరుకుంటున్నట్లు అతని కంఠం ధ్వనించింది.

అన్నీ చిన్నచిన్న స్టేషన్స్. ఆగుతూ, నెమ్మదిగా ప్రయాణిస్తోంది రైలు. ఆ రాత్రంతా ప్రయాణించి మర్నాడు పగలంతా పోతూనేవుంది. అన్నీ చిన్న చిన్న అడవులు, కొండలు, పల్లెటూళ్ళు. చూడ్డానికి గూడా విసుగ్గానే వుంది. రైల్లో రష్‌గూడా లేదు. జనం పల్చగా వున్నారు. నిద్రపోవడం, లేకపోతే పేకాటతో కాలక్షేపం చేశారు.

కాళీనగర్ చేరేటప్పటికి రాత్రి ఏడు దాటింది. ఇక అక్కడ్నుంచి రైలుమార్గం లేదు. రైలు వెనక్కి తిరిగి ఢిల్లీ వెళ్తుంది.

ఊరు చిన్నదే. కాని చాలా పల్లెలకు కూడలి స్థానం. బస చెయ్యడానికి లాడ్జింగులు వంటివి ఏమీలేవు. ఒక

పూటకూళ్ళ యింట్లో భోజనాలు చేసి అక్కడే పడు కున్నారు.

మర్నాడు ఉదయం లేచి విజయపూర్‌కి బయల్దేరారు. అక్కడ్నుంచి ప్రైవేటు బస్సులో ప్రయాణం. జనం క్రిక్కిరిసిపోయి వున్నారు. లోపల చోటుచాలక టాపుమీద గూడ కూర్చోబెట్టారు.

బస్సులో గాలి ఆడడంలేదు. చెమట కారిపోతోంది.

"దాదా! ఈ నరకంలో మనం ఎంతసేపు వుండాలి?" అన్నాడు ఫణీంద్ర విసుగ్గా.

"విజయపూర్ నలభై మైళ్ళుంటుంది. ఇది దొక్కు సర్వీసు కాబట్టి, వెళ్ళేది ఘాట్‌రోడ్ కాబట్టి కనీసం నాలుగు గంటలు ఓర్చుకోవాలి" అన్నాడు జ్వాలా.

"అమ్మో! నాలుగు గంటలే. ఈ లోపల వూపిరాడక చస్తామేమో?" అన్నాడు ఫణీంద్ర నీరసంగా.

జాల్వా చెప్పినట్లే బస్సు నాలుగుగంటలు నడిచింది. కొండలు యెక్కుతూ, దిగుతూ నత్తనడకతో యెలాగో విజయపూర్ చేరుకుంది. అప్పటికి మధ్యాహ్నం ఒంటి గంటయింది. అందరికీ ఆకలి నకనకలాడుతోంది.

బస్సు దిగగానే జట్కావాళ్ళు చుట్టుముట్టారు.

"ఖిల్లా దగ్గరికి వెళ్ళాలా?" అంటూ సంచులు లాక్కో బోయారు.

"తినడానికి ఏదైనా దొరుకుతుందా?" అని అడిగాడు దాదా.

బస్సు ఆగినచోట రెండు చిన్న పాకల్లాంటివి ఉన్నాయి. అందులో తినడానికి దొరుకుతుందని చెప్పారు. రొట్టెలు తిన్నారు.

"దాదా! అన్నం తినకపోతే నాకు కడుపు నిండినట్లు

లేదు" అన్నాడు కిశోర్.

"అన్నం సంగతి మర్చిపొమ్మని చెప్పానుగా భాయ్! బియ్యం కొంచెం తెచ్చుకున్నారుగా. అప్పుడప్పుడూ అమ్మాయి వండిపెడుతూ వుంటుందిలే" అన్నాడు జ్వాలా నవ్వుతూ.

విజయపూర్ కోట దగ్గర డాక్ బంగళా వుందని జట్కావాళ్ళు చెప్పారు. బస్సు ఆగిన చోటికి అది మూడు మైళ్ళు వుంది. రెండు జట్కాల్లో డాక్ బంగళాకి చేరుకున్నారు.

విశాలమైన ఆవరణలో పెద్ద పెద్ద రావిచెట్ల నీడలో వుంది డాక్ బంగళా. అదృష్టవశాత్తు అందులో ఎవరూ లేరు. ఖాళీగానే వుంది.

మూడు రోజుల ప్రయాణం తర్వాత విశ్రాంతి వారి ప్రాణానికి హాయిగా వుంది. బంగాళా వాచ్‌మాన్ ముస్లిం. పేరు సమద్. అద్భుతంగా వంట చేస్తానని చెప్పాడు. రాత్రికి రొట్టెలు, కోడి మాంసం, పెరుగు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమద్ అలాగే చేస్తానన్నాడు. డబ్బు తీసుకుని కోళ్ళు తెస్తానని సైకిల్‌మీద వూళ్ళోకి వెళ్ళాడు.

విజయపూర్ బోసిపోయినట్లుగా కనిపిస్తోంది జ్వాలా కళ్ళకి. తను నవ యువకుడిగా అక్కడ గడిపిన రోజుల్లో ఎంత వైభవంగా వుండేదీ కోట! ఎంత సందడి, ఎంత దర్జా! ఆ డాబూ దర్పం వెలిగించి సేవలు చేయించుకున్న రాజాలు, రాణీలు యిప్పుడెక్కడున్నారో? వారి వారసులు ఏం చేస్తున్నారో?

కొండమీద కోటవైపే తదేకంగా చూస్తూ పడక కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న జ్వాలాకి ఎప్పుడో కునుకు పట్టింది.

లోపల కుర్రవాళ్ళు టేప్‌రికార్డర్ పెట్టుకుని పేకాటలో మునిగిపోయారు.

ఆ రాత్రి భోజనాలైన తర్వాత హాయిగా నిద్రపోయారు.

మర్నాడు ఉదయమే లేచి అందర్నీ వెంటబెట్టుకుని విజయపూర్ కోట చూపించడానికి బయల్దేరాడు జ్వాలా.

కోట పూర్తిగా శిథిలం కాలేదు. గోడలు దృఢంగానే వున్నాయి. అక్కడక్కడా పగుళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి. బురుజుల మీద ఉక్కు ఫిరంగులు అలాగే వున్నాయి. ఇప్పుడా కోట కేంద్రప్రభుత్వం ఆధీనంలో వుంది. ఆర్కులాజికల్ డిపార్టువారు సంరక్షిస్తున్నట్లు అక్కడక్కడా బోర్డులు కనిపిస్తున్నాయి.

ఏనుగులు స్నానం చేసే చెరువు కోట లోపలే ప్రత్యేకంగా కట్టారు. ముందుగా ఏనుగుల్ని ప్రత్యేకమైన ద్వారం ద్వారా చెరువులోకి పంపేవారట. ఆ తర్వాత నీళ్ళు వదిలేవారట. అవి ఈతకొడుతూ సరదాలు చేసుకున్నాక నీళ్ళు తీసివేసేవారట. నీళ్ళు ఎలా వదిలేదీ ఎలా తీసివేసేదీ వివరంగా చెప్పాడు జ్వాలా. ఆ ఏర్పాట్లు అద్భుతంగా వున్నాయి.

కోట గోడచుట్టూ కందకం లోతుగా వుంది. వాటిలో యిప్పటికీ నీళ్ళున్నాయి. కోట లోపలకు ప్రవేశించిన శత్రువుల్ని ప్రాణాలతో బైటకు పోనివ్వకుండా చంపడానికి యెన్నో మార్గాలున్నాయి. అవన్నీ వివరించి చెప్పాడు. జ్వాలా.

చచ్చినవాడిని మోసుకుని బైట పడవేసే పనేలేదట. లోపల్నుంచే ఎన్నో జారుడు బండలు లాంటి రంధ్రాలు వున్నాయి. వాటిమీద వేస్తే శవం జారుకుంటూ వెళ్ళి కందకంలో పడిపోతుందట. ఆ జారుడుబండలు చూస్తుంటే

వాళ్ళకి భయంతో గుండెలు జల్లుమన్నాయి.

ఏనుగుల శాలలు, గుర్రాలశాలలు, ఆయుధాగారాలు, అన్నీ చూశారు.

మహారాజావారు జలకాలాడే స్విమ్మింగ్‌పూల్ పాల రాతితో కట్టారు. అదింకా చెక్కుచెదరకుండా అలాగే వుంది.

ఆ రోజుల్లో రాజుగారు ఒడ్డున కుర్చీలో కూర్చునే వారట. నాలుగువైపులా కుర్చీలుండేవట. ఆయన అటూ యిటూ తిరుగుతూ తనకి యిష్టం వచ్చినచోట కూర్చునే వాడట. స్విమ్మింగ్‌పూల్లో యువతులు నగ్నంగా జలకాలాడుతూ వుండేవారట. వారి అందచందాలు తిలకిస్తూ రాజావారు గంటల తరబడి గడిపేవారట. ఇలాంటివే రాజాల సరదాల గురించి కథలు చెప్పాడు జ్వాలా.

అంతఃపురంలో చాలా భవనాలు అందవికారంగా తయారయ్యాయి. ఎండకి ఎండి వానకి తడిపి రూపు మాపి పోతున్నాయి గోడలమీద పిచ్చిచెట్లు మొలుస్తున్నా పట్టించుకునేవాళ్ళు లేరు. అప్పటి పూలతోట స్థానంలో ముళ్ళ పొదలు ఎదిగిపోయి వున్నాయి.

ఆ రోజుల్లో తను యువరాణి రంజితను కలుసుకోవడానికి కోటగోడ యెక్కడ యెక్కేదీ, యెక్కడ దిగేదీ చూపించాడు. రంజిత పడకగది చూపించాడు.

ఆ రోజు రాత్రి వాళ్ళిద్దరూ బైటపడిన రహస్యద్వారం గమ్మత్తుగా వుంది. అందులో నుంచి దారి వుందని జ్వాలా చెప్తేగాని నమ్మలేకపోయారు. అదొక చెక్క బీరువాలా వుంది. దాన్ని కదిలించి మార్గం చూపించేసరికి అంతా ఆశ్చర్యపోయారు.

రెండురోజులపాటు విజయపూర్‌లో గడిపి జ్వాలా

చెప్పే అలనాటి కథలు వింటూ వుంటే వాళ్ళకి వింతగా వుంది.

జ్వాలా ఈ లోకం మరిచిపోయాడు. ఆ రోజుల్లోకి వెళ్ళిపోయింది మనసు. రంజిత చుట్టూ తిరుగుతోంది అతని మనసు.

"దాదా ఆఖరి రాజుగారు యిప్పుడు యెక్కడున్నాడో ఏమో నీకేమైనా తెలుసా?" ప్రశ్నించాడు ఫణి.

"ఉహూం....అడ్రస్ తెలీదు. కాని చూచాయగా వారి గురించి తెలుస్తూ వుండేది. బ్రిటిష్‌వారిపై స్వతంత్ర పోరాటం జరుగుతూ వుండగా రాజావారు బొంబాయి చేరుకున్నారనీ అక్కడ పరిశ్రమలు స్థాపించారనీ అనుకున్నారు" అన్నాడు జ్వాలా.

"అనుకోవడం ఏమిటి దాదా! నిజమై వుంటుంది. ఆ రోజుల్లో పన్నులు వసూలుచేసి ప్రజల్ని పీడించుకుని తిని సుఖపడ్డారు, రాజ్యాలు పోయాక పరిశ్రమలు స్థాపించి లాభాలు సంపాయించి యిప్పుడు జల్సాలు చేస్తున్నారు. అప్పటి రాజాలే యిప్పటి పారిశ్రామికవేత్తలు, నాయకులు, అధికారులు వగైరా!" అన్నాడు మేఘనాధ్.

"జ్వాలా అడ్డుపడబట్టి కాంచన శిఖరంలో నిధి వాళ్ళకి దక్కకుండాపోయింది. లేకపోతే అదీ తమ పరం చేసుకుని మరికొన్ని భారీ పరిశ్రమలు పెట్టివుండేవాళ్ళు. ఎక్కడా? ఇండియాలో కాదు. ఏ అమెరికానో పోయి జల్సాలు చేస్తుండేవాళ్ళు" అన్నాడు ఫణి.

జ్వాలా నవ్వాడు.

"అది వారికి ప్రాప్తం లేదు."

అంతా నవ్వారు.

బంగళా నవ్వులతో మార్మోగింది.

"మనకోసం కాంచన పర్వతంలో శిఖరం ఎదురు చూస్తూ వుంది" అన్నాడు మేఘనాధ్ రెడ్డి.

11

అడవి చిక్కగా వుంది.

సాలవృక్షాలు ఎత్తుగా తలలూపుతున్నాయి. గడ్డి బలిసి వుంది. అడవి గుర్రు పెడుతున్నట్లుగా శబ్దం వస్తోంది.

నాలుగువేపులా రక రకాల చెట్లు కొత్త చివుళ్ళు తొడుగుతున్నాయి. పసుపు పచ్చటిపూలు విరబూసి బంగారు కాంతులీనుతున్నాయి.

ప్రకృతి ముసుగు తొలగించి నగ్నంగా నిల్చున్నట్లు మనోహరంగా కనిపిస్తున్నది. చూసినంత మేరా కళ్ళ కింపుగా పచ్చగా వుంది అడవి.

ప్రతి చెట్టూ, కొమ్మా, రెమ్మా, ఆకూ, పూరేకూ వారికి స్వాగతం చెప్తున్నట్లు గాలికి వూగుతున్నాయి.

సాయంకాలం కావస్తోంది.

సీతాకోకచిలుకలా ఆకాశం రంగులు మార్చింది.

సూర్యుడి ఏటవాలు కిరణాలు చెట్లమీద బంగారు రంగులో పడుతున్నాయి.

చిక్కగా వూడలు దిగిన మర్రిచెట్టు క్రింద ఆగాడు జ్వాలాప్రతాప్.

"మనం ఈ రాత్రికి యిక్కడే మకాం చేయాల్సి వుంటుంది" అన్నాడు కిట్ క్రిందకు దించి.

అంతా తమతమ బరువులు దించుకున్నారు.

దూరంగా సెలయేరు గలగలా పారుతున్నది.

"అమ్మాయీ! నువ్వు వంటపని మొదలుపెట్టవచ్చు" అన్నాడు జ్వాలా నవ్వుతూ.

"అలాగే దాదా! రాళ్ళు సంపాదించండి ముందు" అంది

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, 1 నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

తనూ నవ్వుతూ.

"అడవిలో రాళ్ళకే కరువా?" అన్నాడు కిశోర్.

"రాళ్ళన్నీ సమంగా వుండాలి. పొయ్యిమీద పాత్ర నిలవాలి" అంది.

కిశోర్ నాలుగురాళ్ళు తెచ్చిపడేశాడు.

జ్వాలా, మేఘనాధ్ టెంట్ బిగించే కార్యక్రమం చేపట్టారు

ఫణీంద్ర, కృష్ణమూర్తి ప్లాస్టిక్ క్యాన్‌లు పట్టుకెళ్ళారు సెలయేటి దగ్గరికి.

నీళ్ళు తెచ్చాక ఎండుపుల్లలు ఏరుకొచ్చి పడేశారు.

అపర్ణ వంట మొదలుపెట్టింది.

చీకటి పడేలోపుగానే టెంట్ వెయ్యడం పూర్తయింది.

జ్వాలా గ్యాస్‌లైట్ వెలిగించి చెట్టుకు వ్రేలాడదీశాడు. భోజనాలైన తర్వాత లైట్ ఆర్పేశాడు.

టెంట్‌కు కొంచెం దూరంలో మంట చేశాడు. పెద్ద పెద్ద దుంగలు మండుతున్నాయి. ఆ వెలుగులో అడవి ఎర్రగా కనిపిస్తోంది.

"మీరు పడుకోండి. నేను కాపలా వుంటాను" అన్నాడు జ్వాలా.

"దాదా! నువ్వు నిద్రపో. మేమంతా వుండగా నీ కెందుకు శ్రమ. వంతుల వారీగా కాపలా వుంటాం లే" అన్నాడు మేఘనాధ్.

"ముందు ముందు అలాగే వుందురుగానిలే. నేను కొంచెంసేపు వుంటాను. నిద్ర వస్తే నిన్ను లేపుతాను. సరేనా!" అన్నాడు జ్వాలా.

దాదా మాటకు తిరుగు వుండదని తెలిసిన మేఘనాధ్ సరేనని తల వూపాడు.

అపరాధ పరిశోధనపోటీ-193

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-8-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు '84 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. అన్ని విధాల కాంగ్రేస్-ఐ పార్టీ అడుగుజాడల్లో నడుస్తున్న రాజకీయ పార్టీ—? (తెలుగుదేశం, ఎ.ఐ.ఎ.డి.ఎమ్.కె.)
2. పంజాబ్‌లో సైనిక చర్యకు నిరసనగా కొందరు సిక్కులు తిరుగుబాటు జరిపారు—? (రక్షణదళం, పోలీసుశాఖ)
3. ఈ నగరంలో సర్క్యులర్ రైల్వే నిర్మాణం జరుగబోతుంది—? (కలకత్తా, మద్రాసు)
4. ఇటీవల యీ శాఖ ఎక్కువగా విమర్శలకు గురవుతున్నది—? (పోస్టల్, రైల్వేలు)
5. నేరస్తులకు నిలయం—? (ఉత్తరప్రదేశ్, పంజాబ్)

జ్వాలా మంటకు దగ్గర్లోనే బండమీద కూర్చున్నాడు తుపాకీ భుజాన పెట్టుకుని.

కీచురాళ్ళ రొద తప్ప వేరే శబ్దం లేదు. అర్ధరాత్రివరకు ప్రశాంతంగా గడిచిపోయింది. పగలు చాలా దూరం నడవడం వల్ల అలసటతో అంతా గాఢంగా నిద్రపోతున్నారు.

జ్వాలాకి నిద్ర ముంచుకొస్తోంది.

మేఘనాధ్‌ని నిద్రలేపాలని అనుకుంటున్నాడు.

ఇంతలో భయంకరంగా పెద్దపులి గర్జన వినిపించింది.

జ్వాలా వులిక్కిపడి లేచి నిల్చున్నాడు. కళ్ళు పెద్దవి చేసి చుట్టూ చూశాడు.

పులి గర్జన అడవిలో మారుమ్రోగుతోంది. పులి సెలయేటి దగ్గర వుందని జ్వాలా తెలుసుకున్నాడు. అది నీళ్ళు త్రాగడానికి వచ్చి వుంటుంది.

పులి గర్జన విని టెంటులో నిద్రపోతున్న వాళ్ళు లేచారు. భయంతో శరీరాలు రోమాంచిత మయ్యాయి.

"దాదా!" అని కేక పెట్టాడు మేఘనాధ్.

"అరె భాయ్! ఎవరూ బైటకు రాకండి" అన్నాడు జ్వాలా గట్టిగా.

కాసేపటికి పులిగర్జన దూరమైంది.

మేఘనాధ్ టెంట్‌లోనుంచి బైటకు వచ్చాడు.

"దాదా! నువ్వికా పడుకో. నేను కాపలా వుంటాను" అన్నాడు.

జ్వాలా నవ్వి "నేను నిన్ను నిద్ర లేపాలనుకున్నాను. ఇంతలో పులి నిన్ను నిద్రలేపింది" అన్నాడు.

"మంచిపనే చేసింది" అన్నాడు.

"కొంచెంసేపు చూద్దాం. నీళ్ళు తాగడానికి ఏవైనా జంతువులు వస్తాయి. ఒకదాన్ని కొడితే రేపటికి మంచి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-8-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు '84 నెల సంచికలో ప్రకటిస్తాము.

జూన్ '84 పోటీ ఫలితాలు

(1) జూన్ '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ప్రేమించే వయసు !
కాటేసే మనసు !!

పంపినవారు: శ్రీ కె. త్రినాధ్, S/O ముసలయ్య (ఆర్టిస్టు), మార్టేరు - 534 122, ప.గో. జిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పాపాని కిదే శిక్ష !
పాపల కదే రక్ష !!

పంపినవారు: శ్రీ వింజమూరి వెంకట పార్వతీశం, 8-4-32, శ్రీ కిషన్ కాలనీ, వరంగల్ - 506 002.

భోజనం" అన్నాడు జ్వాలా.

"ఏవైనా వస్తాయా?"

"చూస్తుండు వస్తాయి. ఎండుటాకులు చప్పుడు విని పిస్తే గమనించు. ఏదైనా వచ్చిందని అనుకుంటే నన్ను నిద్రలేపు. నేను ఈ బండమీదే పడుకుంటాను" అన్నాడు జ్వాలా.

మేఘనాధ్ తుపాకీ పట్టుకుని కూర్చున్నాడు. నాలుగు సెల్స్ వేసిన బ్యాటరీలైటు దగ్గరే పెట్టుకున్నాడు. జ్వాలా కళ్ళు మూశాడు.

కొంచెం సేపటికే ఎండుటాకులు గలగల లాడాయి. మేఘనాధ్ తుపాకీ గట్టిగా పట్టుకున్నాడు. కళ్ళు పెద్దవిచేసి చూశాడు. దగ్గర్లోనే ఒక పొదలో ఏదో జంతువు దూరినట్లు మొక్కలు కదిలాయి.

మంట తగ్గిపోయింది. వెలుగు సరిగా అనడం లేదు. జ్వాలాని లేపాలనుకున్నాడు. కాని వెంటనే తన నిర్ణయం మార్చుకున్నాడు. ఆ పొదలో ఏం వుందో తెలుసుకున్న తర్వాత లేపవచ్చు అనుకున్నాడు. పొదవంకే తదేకదృష్టితో చూస్తూ కూర్చున్నాడు.

కాసేపటికి పొద కదిలింది. మేఘనాధ్ బ్యాటరీలైటు సూటిగా వేశాడు. నల్లటి ఆకారం పరిగెత్తింది. గుర్రు గుర్రు అంటూ శబ్దంచేస్తూ పారిపోయింది. అది అడవి పంది. మేఘనాధ్ తుపాకీ గురిపెట్టాడు. ఇంతలో అది ఒక చెట్టుచాటుకు వెళ్ళి కన్పించకుండా పోయింది. అతను నిరాశపడ్డాడు.

మంటలో కర్ర పడేశాడు. మంట పెద్దదైంది.

అతను అలాగే కాపలా కూర్చున్నాడు.

శ్రీ మహాలక్ష్మీవారి వెరైటీ నవలలు

తప్పక చదవండి!

1.	మేఘమాల	మల్లాది వెంకటకృష్ణమూర్తి	17-00
2.	మేలుకొలుపు	చివుకుల పురుషోత్తం	25-00
3.	మయూరి (డైరక్టు నవల)	లల్లాదేవి	15-00
4.	స్టెప్ ఫాదర్ (డైరక్టు నవల)	మన్నెం శారద	12-00
5.	మిస్టర్ సంపత్ M.A.	మాదిరెడ్డి సులోచన	20-00
6.	ఖైదీ (అపన సీరియల్)	A.V. మోహన్రావ్	20-00

అనివార్య పరిస్థితులవలన, మల్లాది 'కొత్త శత్రువు', ఎన్.ఆర్. నంది 'పిగ్గు-పిగ్గు', లల్లాదేవి 'కల్లోలగౌతమి' నవలలు పైసెట్టుతో విడుదల కావటంలేదు. జులైలో విడుదల అవుతాయి. పాఠకులు గమనించ ప్రార్థన.

అడ్వాన్సుతో ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ-2

తెల్లగా తెల్లవారింది.

"మేఘనాధ్ టెంట్‌లోకి వెళ్ళి పడుకున్నాడు.

అంతా మేలుకున్నారు.

ఫణీంద్ర, కృష్ణమూర్తి కాలకృత్యాలు తీర్చుకోవడానికి సెలయేటి దగ్గరికి వెళ్ళారు.

అపర్ణ పొయ్యి వెలిగించి టీ తయారుచేసింది.

"దాదా!....దాదా!...." అని అరుస్తూ పరిగెత్తుకుని వస్తున్నాడు కృష్ణమూర్తి.

అతని వెనుకే ఫణీంద్ర.

జ్వాలా లేచి ఎదురు వెళ్ళాడు.

"ఏం జరిగింది భాయ్!"

కృష్ణమూర్తి అలసటతో రొప్పుతున్నాడు.

"దాదా! అక్కడ ఎవరిదో శవం వుంది" అన్నాడు.

"శవమా?" ఆశ్చర్యపోయాడు జ్వాలా.

"అవును దాదా! మనిషిదే. అబ్బ భయంకరంగా వుంది. రాత్రి అరిచిన పులి చంపిందేమో?" అన్నాడు ఫణీంద్ర.

"పదండి చూద్దాం" అన్నాడు దాదా. తుపాకీ తీసుకుని బయల్దేరాడు.

సెలయేటికి కొంచెం దూరంలో రాళ్ళమీద పడివుంది శవం. ముఖం గుర్తు పట్టడానికి వీల్లేకుండా చీరి వుంది. పంచెమాత్రం పీలికలై నామమాత్రంగా మిగిలి వుంది. తొడలు, పొట్టభాగంలో కండలు తినేసి వుంటుంది.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.